# కాలుతున్న పూలతోట

# (పెద్ద కథ)

ఆకాశంలో బ్రహ్మాండమైన గజసైన్యం సమాయత్తమైనట్టు ముదురు గచ్చకాయ రంగులో ఉన్న నీళ్ళ సంచుల్లాంటి మబ్బులు గుమికూడి గర్జిస్తున్నాయి.

ఆకాశం మధ్యగా పెద్ద ప్రశ్నార్థకం ఆకారంలో గీత గీసినట్టు మెరిసిందొక మెరుపు తీగ. దాంతో కళ్ళు మిరుమిట్లు గొలిపినట్లయింది.

"ఇంకా అలాగే కూర్చున్నావేం బాబూ? ఇంటికి వెళ్ళాలని లేదా?" అని పలకరించారెవరో వెనకనుంచి.

గాంధీ ఏమీ మాట్లాడకుండా లేచాడు. తనకు 'స్వాధీనం' చేయబడిన ఫైలు చేత్తో పుచ్చుకుని ఒక్కక్షణం వరండాలో స్తంభాని కానుకుని నిలబడ్డాడు. ఆ తర్వాత ఒకదాని వెంట ఒకటిగా నెమ్మదిగా మెట్లుదిగి ఆవరణ దాటి రోడ్డుమీదికి వచ్చాడు.

అక్కడ అట్టే వాహన సంచారం లేదు. పాదచారులు కూడా తక్కువగానే వున్నారు. చీకటిపడుతూవుండటం, వర్షం వచ్చే సూచనలు మెండుగా కానరావడంతో ఆ కొద్దిమంది కూడా గూళ్ళకు చేరుకునే ఆరాటంతో త్వరత్వరగా నడుస్తున్నారు.

రెండు ఫర్లాంగుల దూరం నడిస్తే సెంటరు... అక్కడ అర్ధరాత్రి కూడా పట్టపగలులా వుంటుంది. రకరకాల కాంతివంతమైన దీపాలు'ఫెళ్ళు' న వెలుగుతూవుంటాయి.

గాంధీ నెమ్మదిగానే నడుస్తున్నాడు.

ఏ ఆరాటమూ, ఆత్రుతా లేకుండా నడుస్తున్నాడు.

ఆనాడు-

తనకు మెలకువ వచ్చేసరికి కిటికీలో నుంచి పలుచని బంగారు రంగు ఎండ కనిపించింది.

కిటికీ అవతల ఏదో చిన్న మొక్క గాలికి నెమ్మదిగా తల వూపుతూ కనిపించింది.

దాని ఆకులలో ఒకే ఒక పువ్వు...వెన్నముద్దలా...తెల్లగా...

"నే నెక్కడున్నాను?" అనుకున్నాడు తాను.

తర్వాత "నే నెక్కడున్నాను?" అని పైకి అన్నాడు కూడా.

"పడుకోండి...పడుకోండి..." అని ఒక కంఠస్వరం వినిపించింది మెత్తగా, మృదువుగా...

తలతిప్పి చూశాడు. నల్లగానే వున్నా ఆకర్షణీయమైన విగ్రహం... తెల్లని చీరె...చెంపకు చేరడేసి కళ్ళు... కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటున్నదల్లా లేచి వచ్చింది.

"ఇది హాస్పిటలా? నేనిక్కడి కెలా...? నన్నెవరు తీసుకువచ్చారు? అసలేమయింది...?"

ఆమె నెమ్మదిగా "ఏమీలేదు. చిన్న యాక్సిడెంట్... మిమ్మల్ని తీసుకొస్తున్న పోలీసువ్యాను చెట్టును గుద్దేసింది. డ్రైవరుకు బాగా గాయాలు తగిలాయి. మీరు కొంచెం షాక్ తిన్నారు. అంతో!" అని చెప్పింది.

"ఎప్పుడు? ఎక్కడ జరిగింది."

"మొన్న మధ్యాహ్నం!"

"మైగాడ్!మరి నా ఫైలు, సర్టిఫికెట్లు. డిగ్రీలు?"

"అన్నీ వున్నాయి. చెక్కు చెదరకుండా వున్నాయి. నేను తెచ్చి యిస్తాను మీరు రిలాక్స్ కండి!"

ఆమె గదిలోంచి బయటికి వెళ్ళింది.

– తనకు అంతా గుర్తుకు వచ్చింది. తాను జైల్లోవున్నాడు. బహుశా రెండు మూడురోజులున్నాడేమో! తరువాత ఒకనాడు ఉదయమే తనను కోర్టుకు తీసుకుపోయారు.

తన నేరం ?

ఆత్మహత్యా ప్రయత్నం !

తాను అంతా చెప్పాడు. అన్నీ ఒప్పుకున్నాడు.

"అవును... ఆత్మహత్య చేసుకుందా మనుకున్నాను. నిజమే – నా కెవరూలేరు. దిక్కూ దివాణమూ లేనివాణ్ణి. (నిజమేనా? తనకొక పినతండ్రి వున్నాడనీ, చిన్నప్పుడే దేశాలుపట్టి పోయాడనీ, ఏ సన్యాసుల్లోనో కలిసిపోయివుంటాడనీ అమ్మ చెప్పింది తన చిన్నతనంలో ఒకసారి). చిన్నప్పటినుంచీ వారాలు చేసుకుని చదువుకున్నాను. వీధిలాంతర్ల కింద చదువుకున్నాను. కాలేజీకి వచ్చాక చిన్నపిల్లలకు ట్యూషన్లు చెప్పుకుని చదువుకున్నాను. ఎం.ఎస్.సి. పాసయ్యాను. ఫస్టుక్లాసులో యూనివర్సిటీ కంతటికీ రెండోవాడిగా పాసయ్యాను. పాసై, నాలుగేళ్ళపాటు ఉద్యోగం కోసం ప్రయత్నించాను. అప్లయి చేయని ఉద్యోగం లేదు. హాజరుకాని ఇంటర్వ్యూలేదు. నా ఆశ అడియాసే అయ్యింది. చిన్న ఉద్యోగం కోసం కక్కుర్తి పడితే నా క్వాలిఫికేషన్ ఎక్కువన్నారు. తగిన ఉద్యోగమా నాకు రాలేదు, రాదు. చివరకు విసిగిపోయాను.ఆ నాడు–

ఆనాడు– ఆగస్టు పదిహేనో తేదీ– మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన పర్వదినం, అదృష్టవంతులు,అమాయకులైన స్కూలుపిల్లలు, రాజకీయనాయకులు,ఉపన్యాసకేసరులు గొప్ప కోలాహలం చేస్తున్నారు. పెద్దఎత్తున పండుగ జరుపుకుంటున్నారు.

ఆనాడు పగలంతా వీధుల్లో తిరిగాను. మతిచెడిన వాడిలా తిండీ, తిప్పలూ లేకుండా తిరిగాను. బహుశా నిజంగానే నాకు మతిస్థిరం తప్పిందేమో! లేకపోతే సాయంకాలం వేళకు ఆ బుద్ధి ఎందుకు పుట్టింది? ఆ షాపుకెందుకు వెళ్ళాను? ఉన్న కొంచెం డబ్బు పెట్టి ఎండ్రిన్ ఎందుకు కొన్నాను?"

నర్సు లోపలికి వచ్చి ఫైలు అతనికి అందించి, "ఇదే కదా మీ ఫైలు?" అని అడిగింది.

"అవును." అన్నాడతను ఆనందంగా దాన్ని అందుకుని.

"అందులో అన్నీ సరిగా. భద్రంగా వుంటాయి, చూసుకోండి?" అన్నదామె.

పక్కమీద సర్దుకుని కూర్చుని ఫైలు తెరిచి చూసుకున్నాడు. అన్నీ సరిగానే వున్నాయి. చివరలో విడిగా ఒక చిన్న కాగితం ముక్క వున్నది. దాన్లో అక్షరాలు అస్తవ్యస్తంగా ఘోరంగా వున్నాయి. ఉన్నవి నాలుగే పంక్తులు-బహుశా సిరాఅయిపోయిన కలంతో వ్రాశాడు తాను. చివర సంతకంలో చివరి అక్షరాలు సరిగా కనిపించడం లేదు. అది తాను వ్రాసిందే.

దాన్ని మళ్ళీ చదువుకున్నాడు. "డి.ఎమ్.కె.గాంధీ అనబడే నేను ఆత్మహత్య చేసుకుంటున్నాను. నా చావు కెవరూ బాధ్యులు కాదు. నా కెవరూ లేరు!"

గాంధీ వున్నట్టుండి ఆ కాగితాన్ని వుండగాచుట్టి నలిపివేసి కిటికీలో నుంచి అవతలికి విసిరేశాడు. తర్వాత ఫైలు దిండు క్రింద వుంచుకుని సర్దుకుని పడుకున్నాడు.

నర్సు మంచానికి కొద్ది దూరంలో నిలబడి అతని వంకనే చూస్తున్నది. అతడంతలో వెల్లకిలా పడుకుని కళ్ళు మూసుకున్నాడు.

ఆనాడు కోర్టులో తాను చెప్పిన దాన్ని అక్కడి వారందరూ జడ్జితో సహా ఎంతో సానుభూతితో విన్నారు. తర్వాత జడ్జి తన ఎదురుగా బల్లమీద వున్న కళ్ళజోడు అందుకుని ముఖానికి తగిలించుకుని హియరింగ్ వాయిదా వేసి చివాలున లేచి వెళ్ళిపోయాడు.

తర్వాత తాను జైలు గదిలో ఒంటరిగా వున్నాడు. ఏమీ తోచలేదు. మెదడంతా రకరకాల సమస్యలతో బరువెక్కి పోతున్నది. ఒక కొత్త ప్రాబ్లమ్ - అంతకుముందు కష్టసాధ్యమనుకున్నది తేలికగా సాల్వ్ అయ్యేపద్ధతి మెదడులో మెరుపులా మెరిసింది. తనకు తెల్లకాగితాలు,కలమూ తెప్పించి పెట్టమని జైలు అధికారులను కోరుకున్నాడు. వాళ్ళు చాలాసేపు తాత్సారం చేసి చివరకు "వీల్లేద"ని కబురుపంపించారు.

ఆ నాడల్లా కలతనిద్ర పట్టింది. నిద్రలో ముక్కలు ముక్కలుగా కల - కలలో అమ్మ ముఖం కనిపించింది. ఆ ముఖంలో, ఆ కళ్ళలో ముందు ధైన్యం... తర్వాత అంతలోనే ఆ కళ్ళలో నుంచి అశ్రువులు ధారగా వర్షించడం ప్రారంభమైంది.

"అమ్మా!" అని అరుస్తూ ఉలిక్కిపడి లేచాడు తాను. బరువైన బూట్లతో అటూ యిటూ జైలు వరండాలో తిరుగుతున్న కాపలాదారు కొంచెం కంగారుగా "ఏమిటి,ఎందుకు అరిచావు?" అంటూ వచ్చాడు.

"ఏమీలేదు. ఏదోకల వచ్చింది." అని సమాధానం యిచ్చాడు తాను. మిగిలిన రాత్రి అంతా మెలకువే- తెల్లవారేముందు కొంచెంగా నిద్రపట్టింది. ఆ నిద్రలో మాటిమాటికీ ఒక నడివయసు మగవాడి ముఖం కనిపించింది. ఆ ముఖం తన తండ్రిదేమో! తాను తండ్రి నెప్పుడూ చూడలేదు. ఆయన తాను పుట్టకముందే చచ్చిపోయాడు. మూడువందల మైళ్ళ దూరంలో జైల్లో చచ్చిపోయాడు. దేశానికి స్వాతంత్ర్యం కావాలని ఉద్యోగం మానుకుని, సర్వస్వం పోగొట్టుకుని సత్యాగ్రహాలు, నిరాహారదీక్షలు, పికెటింగ్‌లూ చేసి లాఠీదెబ్బలు తిని, అరెస్టయి నెలల తరబడి జైల్లో నిర్బంధించబడి చివరకు నిర్భంధంలోనే చనిపోయాడు. ఆయన జైలుకు వెళ్ళేముందు అమ్మతో అనేవాడట. "మనకు ఆడపిల్ల పుడితే స్వరాజ్యలక్ష్మి అని పేరు పెట్టాలి. మగపిల్లవాడు పుడితే మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ." ఇలా అని వెంటనే జైలుకు పోయాడు. అలా తన పేరు గాంధీ అయింది. ఆయన ఫోటో ఒకటి ఉండేదికాని, అది తనకు ఊహ తెలిసే

నాటికే బాగా పాతబడిపోయి వెలిసి పోయింది. పైగా దాదాపు యాభైమంది విద్యార్థులు కలిసి తీయించుకున్న కాలేజీ గ్రూప్‌ఫోటో అది. "అన్నీ చిన్నచిన్న ముఖాలు... అందులో ఒక చిన్న ముఖం చూపించి "ఇదిగో మీ నాన్నగారు" అని చెప్పింది తల్లి. బహుశా తనకు కలలో కనిపించిన అస్పష్టమైన ముఖం తండ్రిదేనేమో!

తనను మళ్ళీ కోర్టుకి తీసుకువెళ్ళారు. మళ్ళీ ప్రశ్నలు వేశారు. అప్పుడు తానేమి జవాబులు చెప్పాడో తన కసలు గుర్తులేదు. కాని మొత్తానికి మతి చెడిన వాడిలా మాట్లాడటం మాత్రం గుర్తున్నది. 'నేను ఇప్పటికే అన్నీ ఒప్పేసుకున్నాను. నన్నిక వేధించకండి...' అనడం గుర్తున్నది. అదీకాక ఇంకా చాలాచాలా వాగినట్టు గుర్తున్నది. తానే ప్లీడరును ఎదురు ప్రశ్నలు వేసినట్లు గుర్తున్నది. జడ్జి ఏమీ మాట్లాడకుండా లేచి వెళ్ళిపోవడం గుర్తున్నది. తర్వాత పోలీసులు తనను మళ్ళీ జీపులో జైలుకు తీసుకురావడం గుర్తున్నది. తనకప్పుడు కాగితాలూ కలమూ యివ్వడం గుర్తున్నది. తన మెదడు నిండా పేరుకుపోయిన ఈక్వేషన్లూ ప్రాబ్లమ్‌లూ గజిబిజిగా కాగితాల నిండా వ్రాయడం గుర్తున్నది. ఆ రాత్రి నిద్రకుముందు ఇద్దరు పోలీసు అధికారులు తన గదిముందు వరండాలో నిలబడి తమలోతాము సంభాషించుకోవడం గుర్తున్నది.

'పూర్ ఫెలో ? మైండ్ చెడిపోయింది.'

"అంతే... లేకపోతే అంతటి లాయర్ని పట్టుకుని 'నిన్నంతా నువ్వు ప్రశ్నలు వేశావు నేను జవాబు లిచ్చాను. ఇవాళ నేనడుగుతున్నాను. నువ్వు బదులు చెప్పు అంటాడా?"

'ఏమడిగాడేం?'

"మొదట ఏదో సైన్సులో ఈక్వేషన్ అడిగాడు. ఆ తర్వాత 'కాళ్ళజెర్రికి అన్ని కాళ్ళేందుకు?' అని అడిగాడు. దాంతో అందరికి మతి పోయినట్టయింది. చదువెక్కువైతే అంతేనేమో... ఎం.యస్.సి. యూనివర్శిటీ సెకండట పాపం!".

"వచ్చేటప్పుడూ అంతే. మా జీపుకు ఒక ఊరేగింపు ఎదురైంది. అప్పుడు మీకు రోజూ వాడకానికి చిన్నచిన్న ఆటం బాంబులు కావాలి కదా. ఎలా మేనేజ్ చేస్తున్నారు? నాకు కాగితాలు కలం ఇప్పించండి... అదేమంత బ్రహ్మ విద్యకాదు. బోలెడన్ని తయారుచేసి పెడతాను నిక్షేపంగా... అన్నాడు".

వారిద్దరిలో ఎవరో జాలితో చప్పరించారు. వారు వెళ్ళిపోయిన తర్వాత ప్రశాంతంగా నిద్రపోదామని ప్రయత్నించి విఫలుడై తెల్లవార్లూ మేలుకుని కూర్చున్నాడు.

మరునాడు పగలుపదిగంటల వేళ తనను బయటకు రమ్మన్నారు. జీప్ ఎక్కమన్నారు. తానప్పుడు ఏమీ మాట్లాడలేదు. నిశ్శబ్దంగా కూర్చుండిపోయాడు. జీప్ వేగంగా కదిలింది. అంతే... ఆ తర్వాత తనకు ఏమీ గుర్తులేదు... నర్సు అతని పక్కకొచ్చి నిలబడింది. మెత్తని ఆ పదధ్వనికి అతడు కళ్ళు తెరచి చూశాడు. ఆమె పెద్దపెద్ద కళ్ళతో అతని వంకకే చూస్తున్నది. ఆ కళ్ళనిండా సానుభూతి... అతడంతలో చూపులు పక్కకు తిప్పుకుని కిటికీలోంచి బయటకు చూస్తూ పడుకుండి పోయాడు.

...ఇవాళ తనను వెళ్ళిపొమ్మన్నారు. హఠాత్తుగా వెళ్ళిపొమ్మన్నారు. డాక్టరు నడివయసు వ్యక్తి. చాలా నెమ్మదిగా ప్రశాంతంగా... 'యు ఆర్ ఆల్ రైట్ నౌ... కంగారేమీలేదు. కాకపోతే అనవసరపు ఆలోచనలు కొద్దిగా తగ్గించండి... మనసును ప్రశాంతంగా ఉంచుకొనేందుకు ప్రయత్నించండి...విష్ యు ఆల్ దిబెస్ట్...' అన్నాడు.

గాంధీ కాస్సేపు ఆ నర్సుకోసం ఎదురు చూశాడు. ఆమె డ్యూటీకి రాలేదు. రెండురోజులు సెలవు పెట్టిందని చెప్పారు. బహుశా ఏదన్నా ఊరికెళ్ళిందేమో! లేక ఏ జ్వరంతో నయినా బాధపడుతున్నదేమో! ఆమె యిల్లెక్కడో? ఎవరినైనా అడిగి తెలుసుకుందామని ముందు అనిపించింది. కాని తర్వాత అతడా ప్రయత్నం విరమించుకున్నాడు.

....సన్నగా వర్షం మొదలయింది. సన్న సన్నని చినుకులు దీపాలవెలుతురులో తళతళ మెరుస్తూ పడుతున్నాయి. ఇక కొద్ది నిముషాల్లో వర్షం పెద్దదవుతుంది. ఎటయినా పరుగెత్తి ఎక్కడైనా సురక్షితమైనచోట కాస్సేపు తలదాచుకుంటే మంచిది! వర్షం వెలిచాక నెమ్మదిగా గదికి చేరుకోవచ్చు.

"అన్నట్టు గది ఎలావుందో!" అనుకున్నాడతడు.

'ఎలా ఉంటుంది? ఆరోజు రాత్రి ఎలా ఉందో యిప్పుడూ అలాగే ఉండివుంటుంది!' అనుకున్నాడు మళ్ళీ.

ఇల్లుగల ఆయన జగన్నాథం. చాలామంచివాడు. మంచిమనసున్న మనిషి. చేసేది చిన్న గుమస్తా ఉద్యోగమే అయినా పొదుపరి. 'బతికున్నంతకాలం ఎవర్నీ బాధపెట్టకుండా బతకాలి. చనిపోయేటప్పుడు బాధపడకుండా చచ్చిపోవాలి' అని అంటూ వుంటాడప్పుడప్పుడూ. 'నానాగడ్డీ కరిచి నలుగురినోళ్ళు కొట్టి సంపాయించడం ఘోర నేరం. అంతకంటే వచ్చినంతలో ముడుచుకుని గడపడం ఉత్తమం' అని కూడా అంటూ వుంటాడు. తాను నెలల తరబడి గదికి అద్దె యివ్వలేకపోయినా సహించేవాడు. ట్యూషన్ డబ్బు చేతికందగానే తీసుకువెళ్ళి అద్దె యివ్వజూపితే 'నువ్వేమీ యిబ్బంది పడవుకదా?' అంటూనే తీసుకునేవాడు. ఎన్నోసార్లు ఇంటర్వ్యూలకు వెళ్ళేందుకు పైసాకూడా లేక తటపటాయిస్తుంటే పెట్టుబడి పెట్టాడు. తనకెన్నోసార్లు ధైర్యం చెప్పి తన దిగులుపోగొట్టి చేయూత యిచ్చాడు. తాను ఆయనకు చేయగలిగి చేసిన ప్రత్యుపకారమల్లా చిన్నపిల్లలిద్దరికి అప్పుడప్పుడు చదువు చెప్పడమే. ఆయన భార్య శాంతమ్మ నిజంగా శాంతమ్మే...పిల్లలు? రత్న మాణిక్యాలు... 'మామయ్యా,మామయ్యా' అంటూ తనను క్షణం' వొదిలిపెట్టరు.

తన గదిలో పాత ట్రంకు పెట్టె... అందులో రకరకాల సైన్సు పుస్తకాలు... సైన్సు వ్యాసాల పేపరు కటింగులు... తనకు స్నేహితులు వ్రాసిన కొద్దిపాటి ఉత్తరాలు... ఉండాలి. గదిలో గోడకు ఒకపిల్లి బొమ్మ క్యాలెండరు-పాతది-తగిలించబడి వుంటుది. అందులో పిల్లి, నిజం పిల్లిలాగే ఉంటుంది. ఎప్పుడైనా సన్నగా ఈలవేస్తే చాలు క్యాలెండరులోనుంచి దూకి వచ్చేస్తుందేమో అన్నట్టుగా ఉంటుంది. ట్రంకు పెట్టెమీద ఐన్‌స్టీన్ ఫోటో ఒకటి ఉండాలి. గదిలో మూల ఒకచాప. పైన తాటిమీద ఒక పైజమా చొక్కా వుండాలి... అంతే...

...పెద్ద పెద్ద చినుకులు పడడం మొదలు కాగానే గాంధీ ఫైలును భద్రంగా చొక్కా క్రింద దాచుకుని రోడ్డుపక్కనే ఉన్న హోటల్లోకి పరుగెత్తాడు...

ఆ హోటలు చిన్నది. నాపరాతి బల్లలు నూనె కారుతున్నాయి.

గుమ్మం పక్కనే కౌంటర్ ముందు నల్లని లావాటి వ్యక్తి వొంటిమీద కేవలం బనీనుతో కూర్చుని వున్నాడు. ఏమీ తోచనివాడిలా మాటిమాటికి ఒక గుడ్డ ముక్క అందుకుని తనముందు కౌంటరుమీదవున్న గాజుపలకను తుడుస్తున్నాడు. మధ్య మధ్యలో ఆవులించి చిటికె వేస్తున్నాడు.

లోపల అంతా కలిపితే అయిదుగురైనాలేరు. పైన ఒక బల్బు మాత్రం మందంగా అయిష్టంగా వెలుగుతున్నది.

'ఏంకావాలిసార్?' అంటూ వొచ్చాడొక కుర్రవాడు వెనకనుంచి, ఆ ప్రశ్న అడుగుతూనే రెండు మంచినీళ్ళ గ్లాసుల చప్పుడుచేస్తూ గాంధీముందు బల్లమీద ఉంచాడు.

గాంధీ తలతిప్పి చూశాడు!

ఆకుర్రవాడు అంతలో సంభ్రమంగా 'సార్' మీరా? ఎక్కడినుంచి? ఎప్పుడొచ్చారు?" అని అడిగాడు పెద్ద గొంతుకతో.

గాంధీ నవ్వాడు. 'ఇప్పుడే వొచ్చాను. వర్షం మొదలయితేనూ. లోపలి కొచ్చాను. ఎట్లా వున్నావు? ఇక్కడెప్పుడు చేరావు?' అని అడిగాడు.

వాడిపేరు రంగడు. గాంధీ వుంటున్న వీధిలోనే చివరపాకలో ఉంటాడు. వాడి తండ్రికి పనీపాటా ఏమీలేదు. పెళ్లాం కలవారి యిళ్ళలో చాకిరీచేసి. రెక్కలు ముక్కలు చేసుకుని తీసుకొచ్చి పెడుతుంటే తిని పొద్దస్తమానం ఊరిమీద బలాదూరు తిరుగుతూ వుంటాడు. ఏ కొత్త సినిమా అయినా రిలీజయిన రోజున బ్లాకులో టిక్కెట్లమ్మి నాలుగు డబ్బులు సమకూడినప్పుడు సారాదుకాణంలో దూరి పీకలదాకా తాగి తెగ వాగుతూ యింటికొచ్చి పెళ్లాన్నీ, కొడుకునూ అనవసరంగా చావబాదుతూ వుంటాడు.

రంగుడు మొన్న మొన్నటివరకూ ఒక సైకిలుషాపులో పనిచేస్తుండేవాడు.

'అక్కడ మానేశాను, వారం రోజులే అయింది మానేసి, మేస్త్రికి నాకూ బొత్తిగా కుదరలేదు. ఇంతకుముందు ఏదైనా తప్పు చేస్తే కొట్టేవాడు. పడుతూవుండే వాణ్ణి. వాడీమధ్య వుండి వుండీ చుక్కేసుకొచ్చి అనవసరంగా కొట్టడం ఎక్కువైంది. అందుకని మానేసి యిక్కడ చేరాను. మనకెక్కడయితేనేం సార్? పొట్టగడవటం ముఖ్యం' అన్నాడు రంగడు నెమ్మదిగా బల్లమీదికి వంగి.

ఆ తర్వత వెంటనే "ఉండండి మీకు తినడాని కేవైనా తెస్తాను. శుభ్రంగా" అంటూ గాంధీ "ఏమీ అఖ్ఖర్లేదు" అంటున్నా వినిపించుకోకుండా లోపలికి వెళ్ళి పోయాడు.

గాంధీ కనులు ఉన్నట్టుండి చెమర్చగా నిశ్శబ్దంగా కూర్చుండి పోయాడు.

బయట వర్షం ధారలుకట్టి కురుస్తున్నది. ట్యూబులైట్ల వెలుతురులో చూరు నుంచి నీళ్ళు తళతళ మెరుస్తూ పడుతున్నాయి. గాంధీ నిశ్చలంగా ఆ నీటిధారల వంకనే చూస్తూ కూర్చున్నాడు.

....ఆనాడు...అదే ఆగస్టు పదిహేనవ తేదీ....

రాత్రి దాదాపు పది గంటలు దాటివుంటుంది. పగలంతా సంచలనం సృష్టించిన కోలాహలం తగ్గి మామూలుస్థితి ఏర్పడుతున్నది. ఉదయం నుంచి అంతా కేకలతో అరుపులతో మైకుల రొదతో దద్దరిల్లిన నగరం కొంచెం కుదుటపడుతున్నది.

తాను తన గదిలో కూర్చుని వున్నాడు, చాపమీద గోడకానుకుని ఒంటరిగా కూర్చుని వున్నాడు. కాలుమీద కాలువేసుకుని కూర్చుని వున్నాడు. కరెంటు పోవడం వల్ల అయిదారు నిమిషాల క్రిందట చిన్న కొవ్వొత్తి వెలిగించాడు. దానివెలుతురులో పైన తాడుమీద వ్రేలాడుతున్న పైజమా చొక్కాల నీడలు కలసి చిత్రమైన కొత్త తరహా చిత్రంగా ఎదుటి గోడమీద పడుతున్నాయి. చుట్టూ అంతా నిశ్శబ్దం. చేత్తో తాకితే తగిలేంతటి నిశ్శబ్దం....'ఇది ఎంతో మంచి సమయం' అనుకున్నాడప్పుడుతాను. గోడమీద క్యాలెండరులోని పిల్లి తీక్షణంగా చూస్తున్నది. ట్రంకుపెట్టెమీద ఐన్‌స్టీన్ ఫోటో చిన్న ఫ్రేములో బిగించబడివుంది. ఐన్‌స్టీన్ కూడా ఫోటోలోనుంచి తన తీక్షణమైన కళ్ళతో నిశితంగా చూస్తున్నాడు.

గాంధీ పక్కనే ఎర్రరంగు డబ్బా... దాన్లో గొంతుకలోంచి జారగానే క్షణాల మీద ప్రాణాలు హరించగల ద్రవం...ప్రక్కనే చిన్న గాజుగ్లాసు...

తాను ట్రాంకు పెట్టెమీదికి వంగి కాగితం ఒకదాన్ని వెదికి ఆ నాలుగు వాక్యాలూ వ్రాశాడు. చివరకు వచ్చేసరికి కలంలో సిరా బొత్తిగా అయిపోయింది కాబోలు ఎంత విదిలించినా చివరి అక్షరాలు తేలిపోయాయి.

ఆ తరువాత మనసు రాయిచేసుకుని తాను అనుకున్నట్టే చేశాడు. ఆ తర్వాత చాపమీద వెల్లికిలా పడుకుండిపోయాడు.

కాని క్షణంలో అనుకోనిది జరిగిపోయింది.

"సార్! మీరిక్కడే వున్నారా? సాయంకాలం, ఇవాళ నాకు పొద్దుపోతుంది. పాఠం లేదన్నారని యిప్పుడొచ్చాను. మా షాపు ఇప్పుడే కట్టేశారు. ఇంటికిపోతూ ఊరికే మిమ్మల్ని చూసిపోదామని..." అంటూ రంగడు లోపలికి రావడం, పైన బల్బు వెలగడం ఒక్కసారే జరిగాయి.

తానప్పుడు బహుశా బాధతో మెలికలు తిరిగిపోతున్నాడేమో! రంగడు ఒక్క క్షణం చూసి "అమ్మో!" అంటూ పరుగెత్తి వారినీ వీరినీ పిలుచుకొచ్చాడు. ఆ తర్వాత గొప్ప హడావుడి అయింది.

తనను అపస్మారక స్థితిలో ఆటోలో ఆసుపత్రికి చేర్చారు. అక్కడ తనను బ్రతికించారు. బ్రతికి మూడురోజుల తర్వాత డిశ్చార్జి అయి బయటికి రాగానే పోలీసులు అరెస్టుచేసి జైలుకు తీసుకుపోయారు.

రంగడు "తినండి సార్! దగ్గరుండి అద్భుతంగా చేయించాను" అంటున్నాడు.

ఎదురుగా బల్ల మీద చపాతీ ఉంది. మరో ప్లేటులో పంచదార ఉంది.

గాంధీ రంగడి కళ్ళలోకి చూశాడు. ఆ పసివాడు తన మంచితనంతో, చదువు పట్ల అంచంచలమైన ఆసక్తితో, జీవిత పోరాటంలో చిన్నప్పటినుంచీ రాటుదేలిన సైనికుడై తనను ఆకర్షించాడు.

వాడారోజు...ఆ ఆగస్టు పదిహేనవ తేదీ... సరిగా ఆవేళకురాకపోతే...? తాను వాణ్ణి ప్రత్యేకించి ఆరాత్రికి అసలు రావద్దని చెప్పాడుకూడా. అప్పుడేమయి ఉండేది?

గాంధీకి నవ్వువచ్చింది. ఏమయిఉండేది? గాంధీ అనబడే ఈ వ్యర్థజీవి తనువు చాలించి వుండేవాడు. ఈ అనాధ శవాన్ని జగన్నాధంగారు బహుశా మునిసి పాలిటీవారికి అప్పగించేవాడేమో! లేకపోతే శవాన్ని వొదిలించుకోవడం ఈ రోజుల్లో మాటలా? వందల్లో అవుతుంది ఖర్చు. నగర జనుల పట్టీలోనుంచి 'గాంధీ' అనే పేరు కొట్టివేయబడి వుండేది. ఇలాటి శవాలను తీసుకుపోయి మునిసిపాలిటీవారు మాత్రం ఏంచేస్తారు? ఇతర ఏ పద్ధతులైనా డబ్బు ఖర్చుతో కూడుకున్నవే. అందువల్ల ఏమీ ఆలోచించకుండా ఊరికి దూరంగా తీసుకుపోయి శవాన్ని పెంటకుప్పల మీద పారేసి వస్తారు. ప్రాణం పోయినతర్వాత ఈ కట్టె, కట్టెపుల్లమాత్రం కూడా విలువచేయదు. అప్పుడీ కట్టెను పురుగులు తొలిస్తే ఏమి? గద్దలూ రాబందులూ పీక్కుతింటే ఏమి?

"ఆలోచనలో పడ్డారేం? తినండి?" అన్నాడు రంగడు.

గాంధీ చపాతీ తింటున్నంత సేపూ బల్లమీదవున్న ఫైలు తిరగేస్తూ నిలబడ్డాడు రంగడు. ఫైల్లో మొదట్లోవున్న పెద్ద డిగ్రీ చూడగానే వాడికళ్ళు ప్రకాశించాయి. అద్భుతమైన మూడు అక్షరాలు ఎం.ఎస్.సి.

అంతలో ఎవరో కేకవేస్తే దాన్ని అక్కడ భద్రంగాఉంచి పక్కకువెళ్ళాడు.

చపాతీ తిని రంగడు తెచ్చి పెట్టిన టీ తాగి ఎడమచేతి వ్రేళ్ళతో పెదవులు తుడుచుకున్నాడు గాంధీ.

మనసులో "ఈ పూటకు దిగులు లేదింక" అనుకున్నాడు.

బయట వర్షం తగ్గింది. అక్కడక్కడ తలదాచుకున్న వ్యక్తులు నెమ్మదిగా రోడ్డుమీదికి వచ్చి నడక కొనసాగిస్తున్నారు.

గాంధీ లాల్చీజేబులు తడువుకున్నాడు. రూపాయి కాగితం, పైన కొంచెం చిల్లర నాణేలు వున్నాయి.

అతనికి అంతలో ఆ నర్సు గుర్తుకువచ్చింది. ఆమెవి కారుణ్యం నిండిన అద్భుతమైన కళ్ళు... నిర్మలమైన ఆకాశఖండాలవంటి తెల్లని కళ్ళు....

ఆసుపత్రినుంచి వచ్చేముందు తనకు ఆమె కనబడివుంటే బాగుండేది. తాను ఆమెకుచెప్పి సెలవు తీసుకుని వచ్చివుంటే బాగుండేది.

అతడంతలో వ్రేళ్ళు విరుచుకుని స్తబ్ధుగా విగ్రహంలా కూర్చుండిపోయాడు.

రంగడు వచ్చి అతనిముందు బల్లమీదికి వంగి నెమ్మదిగా "ఎమ్మెస్సీ అంటే అన్నిటికన్నా ఎక్కువ కదండీ...?" అని అడిగాడు.

గాంధీ చిరునవ్వు నవ్వుతూ తలవూపాడు. తర్వాత కొద్ది క్షణాలపాటు రంగడు ఎటో చూస్తూ వుండిపోయాడు. ఏమీ మాట్లాడలేదు.

గాంధీ ఉన్నట్టుండి లేచాడు. ఫైలు అందుకున్నాడు. రంగడు అతని వెనకనే నడిచాడు. గాంధీ రూపాయి కాగితం యివ్వబోతే కౌంటరుదగ్గరి వ్యక్తి తీసుకోలేదు. నవ్వుతూ "వొద్దులెండి, రంగడు చెప్పాడు. వాడి ఖాతాఇది" అని మాత్రం అన్నాడు.

రంగడు అతనితో "వీరే మా మేష్టారు....ఎం.ఎస్.సీ" అని చెప్పాడు గొప్పగా.

గాంధీ మరేమీ మాట్లాడదలుచుకోలేదు. ఒక క్షణం ఆగి యివతలికి వచ్చాడు. చినుకులు పూర్తిగా ఆగిపోయాయి. అతడు మెట్లుదిగుతూ రంగడివంక "వెళ్తానన్న"ట్టు చూశాడు.

రంగడు "మేష్టారూ! రోడ్డుమీద జాగర్త. వాళ్ళు తెలీకుండా నడుపుతుంటారు బస్సులూ, లారీలూ..." అన్నాడు.

గాంధీ కళ్ళు చమర్చాయి. చివాలున మెట్లుదిగి రోడ్డుమీదికి నడక సాగించాడు.

రోడ్డు అంతా ఆ కొద్దిపాటి వర్షానికే తడితడిగా చిత్తడిగావుంది. వెలుగు నీడలు తడిరోడ్డుమీద విచిత్రంగా అందంగా పరుచుకుని వున్నాయి. దట్టమైన మబ్బు తెరలనుంచి విముక్తమై పలుచగా మందంగా వెలుగుతున్నది చంద్రబింబం. గాంధీ త్వరత్వరగా నడిచాడు.

"మనసును ఏ ఆలోచనలూ లేకుండా ప్రశాంతంగా ఉంచుకోమ"ని డాక్టరు యిచ్చిన సలహా గుర్తుకు వచ్చింది. అంతలోనే నవ్వుకూడా వచ్చింది. తాను నాలుగేళ్లుగా గడుపుతున్న జీవితానికి అర్థమూ, పరమార్థమూ ఏమీలేదు. యూనివర్శిటీలో చదువుకునే రోజుల్లో మామూలు బాధలు ఎలాగూవుండేవి. ట్యూషన్లు చెప్పడం. డబ్బు సమయానికి అందకపోవడం, జీతాలభయం, తిండిభయం, ఇవన్నీ మామూలే. కాని తన అభిరుచులు, తాను కన్నకలలు ఎంత అందమైనవి! చదువు పూర్తయిన తర్వాత ఈ నాలుగేళ్ళలో తన కలలన్నీ కల్లలైనాయి.

తానెన్నడూ పగటి కలలు కనలేదు. కార్లలో తిరిగే ఖరీదైన జీవితం గడపాలనీ, ఈ దేశంలో అదృష్టవంతులైన కొంతమందివలె లేక ఒక వర్గం వారివలె ఏమీ కష్టపడకుండా ఏ.సి. రూముల్లో మజామజాగా రంజురంజుగా జీవితమంతా రంగుల కలలాగా గడపాలని అత్యాశకు పోలేదు. తన ఆలోచన లెప్పుడూ నేలవిడిచి సాము చేయలేదు. చాలా మామూలు, సాదా జీవితం మాత్రమే కోరుకున్నాడు.

తన తండ్రి, తన తండ్రిలాటి అసంఖ్యాక ప్రజలెందరో ఆనాడు ఏ రామరాజ్యం కోసం తమ సర్వస్వమూ ధారపోసి లాటీదెబ్బలు తిని చిత్రహింసలకు గురై నిర్బంధించబడ్డారో ఆ రామరాజ్యం నెలకొంటుందని ఆశించాడు.

ఆ రామరాజ్యానికి అర్థం, నిర్వచనం, దానిరూపు రేఖలు అన్నీ వేరు. దోపిడి లేని సమాజం, సోమరితనం లేని సమాజం. అందరికీ సమానంగా కష్టించి పనిచేసే హక్కు కష్టఫలితాన్ని అనుభవించే హక్కువుండే సమాజం, భయాందోళనలు లేని భద్ర జీవితాన్ని ప్రసాదించే సమాజం, అన్ని రూపాలలోను వెట్టిచాకిరీని, బండచాకిరీని నిర్మూలించే సమాజం, వ్యక్తుల అభిరుచులను గౌరవించి వారి వారి అభిరుచుల ప్రకారం పెరగనిచ్చే సమాజం కోరుకున్నారు. తన తండ్రివంటి ఎందరో సామాన్యులు ఆనాడు.

కాని. జరిగిందేమిటి?

దోపిడి తన రూపం మార్చుకున్నది. మారువేషంలో మరింత విశృంఖలంగా మరింత శక్తి వంతంగా వ్రేళ్ళు తన్ని వ్యాపించింది. మనిషి-మామూలు మనిషి-గౌరవంగా ఆత్మవిశ్వాసంతో తలెత్తుకుని తిరిగే వ్యవస్థ నెలకొనలేదు. సామాన్యమానవుడికి నిత్యం

భయం, నిత్యం ఆందోళన...'స్వేచ్ఛ' అనేది పుస్తకాలలో మాత్రమే... కష్టాలు హద్దులుగా గల స్వేచ్ఛఅది, ఆ హద్దులు దాట ప్రయత్నిస్తే లాటీలు, జైళ్ళు, శిక్షలూ అన్నీ మామూలే... జీవితమంటే నిత్యమూ కనీసావసరాల కోసం పరుగు పందెంగా తయారైంది. ఆ పరుగు పందెంలో అలసినవారూ, అడుగువారూ, బడుగువారూ, బలహీనులూ వెనకబడిపోతారు. వారికి జీవితమంతా ప్రశ్నార్థకమే. మనిషికి చైతన్యమిచ్చే అసలైన చదువు మూలబడింది. మనుషులను కష్టించే యంత్రాలుగా, గుమస్తాలుగా, మెకానిక్కులుగా, టైపిస్టులుగా, బానిసలుగా మాత్రమే తయారు చేసే చదువు అమలులోకి వచ్చింది. భవిష్యత్తులో మహామేధావి కాగలిగిన, కావలసిన ఒక యువకుణ్ణి నిస్తేజుడిగా, నిర్వీర్యుడిగా చేసి అతని అభిరుచులను సమూలంగా నిర్మూలించి అతని ఆత్మవిశ్వాసాన్ని శిథిలం చేసి, అతని శరీరాన్ని అంతరాత్మనూ కూడా అతి తక్కువ వెలకు అమ్ముకునే స్థితికి దిగజార్చే వ్యవస్థ ఏర్పడింది. వంచన, దోపిడీ, దగా,మోసం ద్రోహం, అవినీతి ఇవన్నీ జీవితంలో అతి సహజమైన విషయాలుగా చలామణి అవుతున్నాయి.

గాంధీకి మళ్ళీ డాక్టరు మాటలు గుర్తుకువచ్చాయి. "మనస్సును ప్రశాంతంగా ఉంచుకోండి... ఏ ఆలోచనలూ లేకుండా..."

అతడు నవ్వుకున్నాడు.

నెమ్మదిగా నడుస్తూనే ఏమీ ఆలోచించకుండా ఉందామని ప్రయత్నించాడు. కాని అంతలోనే 'అసలు ఏమీ ఆలోచించకుండా ఉండటం సాధ్యమేనా?' అని అనుమానం వచ్చింది.

ఇంతపెద్ద మెదడున్నది మనిషికి. వేలాది కంప్యూటర్లకంటే శక్తి గల మెదడున్నది. అసలు ఆలోచించకుండా ఎవడైనా ఉండగలడా! అంటే దాని అర్థం?

అతి చిన్న మెదుడున్న జంతువులు, లేక అసలు మెదడు లేని జంతువులు ఆలోచించలేవు. ఏమీ ఆలోచించకుండా ఉండమని ఆంక్షపెడితే మనిషిని జంతువులా ఉండమనే కదా అర్థం!

గాంధీ పాదరసంలా పాకిపోతున్న ఆలోచనా ధోరణిని అరికట్టే ప్రయత్నంగా సన్నగా ఈలవేస్తూ నడవసాగాడు.

అతనికి అంతలో ఆ పెద్ద పెద్ద కళ్ళు గుర్తుకు వచ్చాయి. తెల్లని కలువరేకులాంటి కళ్ళు... కరుణ అనే దేవత రెండు గూళ్ళు కుట్టకుని కాపురం ఉంటున్న దేమో అనిపించే రెండుకళ్ళు...మెత్తని మృదువైన కంఠస్వరం...ఆమె పేరేమిటో? బహుశా కరుణ అయివుంటుంది. కాకనూపోవచ్చు. సూర్యకాంతం, సుగుణ నాగమణి, సుగుణమణి, అహల్య, శబరి ఇలాటి ఏ పేరైనా కావచ్చు. అన్నట్టు ఎవరైనా 'శబరి' అనే పేరు పెట్టుకుంటారా? ఏమో, తెలీదు.

అంతలో అతని ఎడమ కన్ను అదిరింది. ఎడమకన్ను అదిరితే ఏదో కీడు మూడుతుందంటారు. అది నిజమో కాదో తెలియదు. ఒక్కొక్కప్పుడు నిజం కావచ్చు ఒక్కొక్కప్పుడు నిజం కాకపోవచ్చు. కాని అనుమానం మాత్రం తప్పదు. అదే ప్రమాదకరం.

గాంధీ మలుపు తిరిగాడు. పలుచని వెన్నెల చెట్ల కొమ్మల మధ్య నుంచి రోడ్డుమీద చారికలు చారికలుగా పడుతున్నది. రాత్రివేళ విహరించే పక్షి ఏదో, 'క్రీక్' మని అరుస్తూ అతని తలపైగా ఎగిరిపోయింది,

తనను ఇప్పుడు చూసి ఇల్లుగలాయన బహుశా ఆశ్చర్యపోతాడు. ఆనందిస్తాడో లేదో చెప్పలేము. బహుశా కొంచెం బాధపడవచ్చు. తనమీద సానుభూతి వెల్లడిస్తూనే 'అలాటి వెధపని ఎందుకు చేశావ'ని మెత్తగా చివాట్లు వేయవచ్చు, మా యింట్లో అంతటి అఘాయిత్యానికెందుకు పాల్పడ్డావ'ని నిందించవచ్చు.

ఆ విధిలో ఆ యింటి ముందు మున్సిపాలిటీవారి దీపం మందంగా, సామాన్యుడి జీవితంలా వెల తెలా పోతూ వెలుగుతున్నది.

చిన్న పెంకుటిల్లు... ముందు కొంచెం ఖాళీస్థలం... ఏ మొక్కా చెట్టూ లేని ఖాళీ స్థలం... చిన్న వరండా... కుడివైపు ముందుగది తనది. వసారాలో లైటు వెలుగుతున్నది. కాని ఎవరూ లేరక్కడ.

గాంధీ చేతిలో ఫైలుతో కాస్సేపు ఇంటి ముందే నిలబడ్డాడు. తర్వాత నెమ్మదిగా నడిచి వీధి గుమ్మం దాటి లోపలికి వెళ్ళాడు. వరండా ముందు కొద్ది క్షణాలు నిలబడ్డాడు ఆకాశంలోకి చూస్తూ.

అంతలో లోపలినుంచి 'ఎవరది'? అన్న ప్రశ్న వినిపించింది.

ఆమె యింటి యజమానురాలు. తాను తిండి మానేసి మూడంకె వేసుకు పడుకుంటే ఎన్నోసార్లు పిల్లలచేత కబుర్లు పెట్టి బలవంతం చేసి తిండి పెట్టిన ఉత్తమ యిల్లాలు.

ఆమె మళ్ళీ 'ఎవరిది' అనిఅడిగింది మరింత పెద్దగా.

మరుక్షణంలో 'ఎవరూ?' అంటూ జగన్నాథం వరండాలోకి వచ్చాడు.

గాంధీబొమ్మలాగా నిశ్చలంగా నిలబడివుండి 'నేను...నేనేనండి...' అన్నాడు. కాని అతని గొంతు అతనికే వినిపించలేదు. గుండె గొంతుకలో కొట్లాడి నట్లయింది.

చేతివ్రేళ్ళు వణికాయి... కాళ్ళు వణికాయి...

ఆయన వెంటనే 'అరె! నువ్వా?' అని 'ఏమేవ్! గాంధీ... గాంధీ వచ్చాడు! భార్యనుద్దేశించి కేకపెట్టాడు.

మరుక్షణంలో శాంతమ్మ... ఆమెవెంట నిద్రకళ్ళు నులుముకుంటూ పిల్లలూ, వరండాలోకి వచ్చారు.

ఆయన గాంధీ భుజంమీద చేయివేసి 'రా...లోపలికి రా...' అన్నాడు ఆర్ద్రంగా. తర్వాత ఒక్కడుగు ముందుకు వేసి 'ఇప్పుడేనా రావడం? ఎప్పుడు డిశ్చార్జి చేశారు? నేను కనుక్కుంటే రెండు మూడురోజులు పడుతుందని చెప్పారే అన్నాడాయన.

'ఇందాకే, సాయంకాలమే వెళ్ళిపొమ్మన్నారు, దారిలో వర్షం వచ్చింది.ఆలస్యం అయింది. అన్నాడు గాంధీ పొడిగా.

ముందు గదిలోకి తీసుకు వెళ్ళారు అతన్ని, జగన్నాథం టవలుతో మొహం తుడుచుకుంటూ 'అన్నట్టు... రాజారాం గారు ఇవాళ నిన్ను గురించి అడిగారయ్యా! నువ్వు రాగానే ఒకసారి వాళ్ళ యింటికి రమ్మని చెప్పమన్నాడు. చాలా వర్రీ అయిపోతున్నట్టున్నాడు పాపం... రేపువెళ్ళి ఒకసారి కనిపించిరా... కూర్చో... అలా నిలబడ్డావెందుకు?' అన్నాడు.

మళ్ళీ భార్యనుద్దేశించి 'శాంతా! అతనెప్పుడు తిన్నాడో ఏమో! ఆ పని చూడు కాస్త' అని కేక వేశాడు.

గాంధీ 'ఇప్పుడేమీ వొద్దండి... దోవలో హోటల్లో కొంచెం తిన్నాను. ఇక ఏమీ వొద్దు. మీరు శ్రమపడవద్దు...' అన్నాడు వారిస్తూ.

శాంతమ్మ శ్రమ ఏమీ లేదు... రెండు నిముషాల్లో వడియాలు రెండు వేయిస్తాను. అన్నీ వున్నాయి.' అంటూ లోపలకు వెళ్ళింది.

గాంధీ తర్వాత ఏమీ మాట్లాడలేదు. జగన్నాధం కూడా ఏమీ మాట్లాడకుండా కుర్చీలో బాసిపటు వేసుకుని కూర్చుని వ్రేళ్ళు విరుచుకుని కూర్చుని తర్వాత ఎడుమ చేత్తో తలసవరించుకున్నాడు.

పిల్లలిద్దరూ దూరంగా నిలబడి కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తుంటే వారిని దగ్గరికి పిలిచి "ఏమిట్రా చూస్తారు? మామయ్యేగా?..." అన్నాడు. అప్పుడు వాళ్ళిద్దరూ నవ్వుతూ కొంచెం బిడియ పడుతూ అతని దగ్గరికి వచ్చారు.

పది నిముషాల తర్వాత గాంధీ భోజనం ముగించుకుని ముందు గదిలోకి వచ్చాడు.

అతడు భోజనం చేస్తున్నంత సేపూ జగన్నాధం ముందు గదిలో పేపరు చూస్తూ కూర్చున్నాడు.

గాంధీ రాగానే ఆయనలేచి 'ఇక వెళ్ళి హాయిగా పడుకో. ప్రశాంతంగా నిద్రపో, అనవసరమైన ఆలోచనలేవీ పెట్టుకోకు.' అన్నాడు.

గాంధీకి నవ్వు వచ్చింది. అతనికి డాక్టరు చెప్పిన మాటలే గుర్తుకు వచ్చాయి.

'నవ్వుతావెందుకు?' అన్నాడు జగన్నాధం కళ్ళు పెద్దవి చేసుకొని గాంధీవంక చూస్తూ.

గాంధీకి కొంచెం భయం వేసింది. 'ఏంలేదు. సాయంకాలం డాక్టరుకూడా ఇలాగే అన్నాడు.' అని చెప్పాడు.

'ఏవన్నాడు?'

'మెదడును ఖాళీగా ఉంచుకోమని...ఏ ఆలోచనలూ పెట్టుకోవద్దనీ...' 'కరెక్ట్... ఇదుగో దానికి మందు...' అంటూ జగన్నాధం బీరువా తీసి అందులో ఒక పుస్తకం ఇవతలికి లాగాడు.

ఏ భగవద్గీతనో పారాయణం చెయ్యమనడు కదా, మనశ్శాంతి కోసం కంగారుపడ్డాడు గాంధీ.

జగన్నాధం అది పసిగట్టినట్టు 'అవును' ఇది భగవద్గీతే. ఇందులో మొదటి పేజిలోనే ఉంది నీ మనశ్శాంతికి మందు. చిన్న చిన్న ట్రబుల్స్ ఉంటే అవి నాకొదిలేయ్!' అన్నాడు దాన్ని గాంధీకి అందిస్తూ.

గాంధీ దాన్ని అందుకున్నాడు వెంటనే. జగన్నాధం 'పద... ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. వెళ్ళి హాయిగా ప్రశాంతంగా నిద్రపో. భగవద్గీత చదవడం మానకు... మొదటి పేజీ...' అని గాంధీని తొందర పెట్టాడు.

గాంధీ శాంతమ్మ గారివంక తిరిగి 'వస్తానండి' అని చెప్పి వరండాలోకి వచ్చి గది గొళ్ళెం తీసి చేతికందిన స్విచ్ నొక్కాడు. లైట్ వెలిగింది. గదిలో ఎక్కడా ఏమీ మార్పులేదు. ట్రంకు పెట్టె, దాని మీద ఐన్స్టీన్ ఫోటో, గోడమీద పిల్లిబొమ్మ క్యాలెండరు. పైన తాడు మీద వ్రేలాడుతున్న పైజామా, చొక్కా...అన్నీ అలాగే వున్నాయి.

గాంధీ తలుపుమూసి ఫైలూ పుస్తకం ట్రంకు మీద వుంచి చొక్కావిప్పి చాప పరుచుకుని నడుం వాల్చాడు. అతనికి ఆవులింతలు వరసగా వచ్చాయి. మనసు ప్రశాంతంగా వుంది కాని నిశ్చింతగా మాత్రంలేదు.

అతడు కళ్ళు మూసుకున్నాడు, అప్రయత్నంగా చేయి జాపితే పుస్తకం చేతికి అందింది. అందులో మొదటి పేజీలోనే ఉందిట మనశ్శాంతికి మందు. అతడు కళ్ళు తెరిచి పుస్తకం తెరిచి చూశాడు. పేజీలమధ్య నుంచి జారి వాళ్ళోపడిందొక కవరు. ఉత్కంఠతో దాన్ని విప్పి ఇవతలికి తీసి చదువుకున్నాడు. ఇంటర్వ్యూ...రేపులేదు ఎల్లుండే... అదేవూళ్ళో... జూనియర్ లెక్చరర్ పోస్టు... ఒక్కక్షణం ఆశల తేనెటీగల తుటె కదిలినట్టయింది. కాని అంతలోనే నిరాశ ఆవహించింది. కవరూ పుస్తకమూ అవతలవుంచి సర్దుకుని పడుకుని కళ్ళు మూసుకున్నాడు.

ఈ సారి ఇంటర్వ్యూకు వెళితే...ఇది ఎన్నోసారివెళ్ళడ మో లెక్కపెట్టలేదు... విజయం తప్పదు... సెలెక్ట్ కావడం తప్పదు... ఈ సారి గురి తప్పదు... తప్పదుగాక తప్పదు...

అతనికి ఆ కళ్ళు రెండూ గుర్తుకువచ్చాయి. అద్భుతమైన ఆ కళ్ళు...శరన్మేఘ శకలాలవంటి ఆ కళ్ళు...వాటిలో ఆర్ద్రత....

అతనికి అంతలో నిద్రపట్టింది....ప్రశాంతంగా నిద్రపట్టింది.

◆ ◆ ◆ ◆ ◆ ◆ ◆

గాంధీ నడుస్తున్నాడు ఉదయం తొమ్మిదిగంటల వేళ...వాతావరణం ప్రశాంతంగా, హాయిగా వుంది. కలకలలాడుతూ సూర్యుడు మెత్తగా మృదువుగా ఆకాశంలో వెలుగుతున్నాడు. పలుచని బంగారు రంగు ఎండ హృద్యంగా మంచివాడి మనసులా మెత్తగా వుంది. కాని బహిరప్రకృతి అంత హాయిగా లేదు. రోడ్లు అన్నీ గోతులుపడిరొచ్చు రొచ్చుగా అసహ్యంగా ఉన్నాయి.

బస్టాపులన్నీ చాకిరీ చెయ్యడానికి మైళ్ళకొద్దీ దూరం వెళ్ళవలసిన ఉద్యోగులతో, ఉద్యోగినులతో, ఉద్యోగాన్వేషణలో బయలు దేరిన ఉద్యోగార్థులతో, అమాయకులైన స్కూలు పిల్లలతో, ఇంకా రకరకాల వ్యక్తులతో కిటకిటలాడుతున్నాయి. బస్సులు వొస్తూ పోతూనే ఉన్నాయి. కాని అవి అన్నీ బస్టాపుల వలెనే కిటకిటలాడుతున్నాయి.

సామాన్య మానవులు అప్పటికే ఆ నాటి జీవితమనే పరుగు పందెం ప్రారంభించారు.

రోడ్డుపక్క హోటళ్ళలో రద్దీ ఎక్కువగా ఉంది. హోటళ్ళ ముందు కూడా రద్దీ ఎక్కువగా వుంది. హోటళ్లలో రద్దీ తిండికోసం చేరిన వారిదయితే, హోటళ్ళ ముందు రద్దీ అడుక్కుని బ్రతికే వారిది.

రోడ్డుకటూ యిటూ షాపులు... ఖరీదైన షాపులు... అద్దాల బీరువాలు... బీరువాలలో ఖరీదైన వస్తుజాలం... ఆ షాపులలోపట్టపగలే లైట్లు వెలుగుతుంటాయి. షాపులముందు అక్కడక్కడ ఖరీదైన కార్లు....

ఆ కారుల తళతళలలో తమాషాగా కనిపిస్తున్న తమ ప్రతిబింబాలు చూసుకుంటూ ఆనందిస్తున్న అనాధలైన పిల్లలు... అడుక్కునే పిల్లలు... వాళ్ళు చాలా మంది వున్నారు. వాళ్ళలో కొందరు చిన్నపిల్లలే అయినా వారి చంకలలో ఇంకా చిన్న పిల్లలున్నారు. వారిలో కొందరికి శరీరాలమీద ఎటువంటి ఆచ్ఛదనాలేదు.

ఈ బట్టల దుకాణం పెద్దది. లోపల మార్కెట్‌లా వుంటుంది. లైట్లు నిరంతరం వెలుగుతూనే వుంటాయి. పగలూ రాత్రీ అనిలేదు... ఉదయం మొదలు రాత్రి బాగా పొద్దుపోయే వరకూ గొప్పసందడీ... కోలాహలం...

రకరకాల ఖరీదైన మనుషులు కార్లలోదిగి ఆ షాపులోకి వెళ్ళి బరువైన ప్యాకెట్లతో మెట్లు దిగివస్తూ వుంటారు.

ఆ మెట్లమీద, క్రిందనూ వున్నారు వేరే తరగతి మనుషులు...చింకి పాతలు ధరించినవారు... గోచీలవారు... పీలికలైన పాత గౌనుల వారు, అవికూడా లేని దిసమొలలవారు... లెక్కలేనంత మంది... మెయిన్ బజారునిండావారే... వారికళ్ళలో ముందు ప్రస్ఫుటంగా కనిపించేది అసూయ. తరువాత దైన్యం. దిగులు...బాధ...చివరకు ఆకలి... పిల్లల కళ్ళలో... పెద్దల కళ్ళలో... పిల్లల తల్లుల కళ్ళలో ఆకలి...ఒకటే ఆకలి...

గాంధీకి ఆకస్మాత్తుగా దాహం వేసింది, విపరీతంగా దాహం వేసింది. నాలుకతో పెదవులు తడుపుకుంటూ త్వరత్వరగా ముందుకు సాగాడు.

గాంధీ ఇప్పుడొక హోటల్ ముందు నడుస్తున్నాడు. అతన్ని ఆకస్మాత్తుగా నీరసం ఆవహించింది. ఒక్క క్షణం నిలబడ్డాడు.

అదొక పెద్ద హోటలు అటూ ఇటూ పెద్ద పెద్ద కిల్లీషాపులు... లోపల వెలుతురు... వెలుతురు వంట....

క్రింద మెట్ల దగ్గర నలుగురైదుగురో ఎడెనిమిది మందో నిలబడి అడుక్కుంటున్నారు. వచ్చే వారిని పోయేవారిని దగ్గరగా చేతులు చాపి అడక్కుంటున్నారు–ఉండి–ఉండి వాళ్ళు హోటల్ లోపలికి చూస్తున్నారు. లోపలి నుంచి వచ్చేవారు వీరిని చీదరించుకుంటున్నారు. వారికి దూర దూరంగా తొలగి పోతున్నారు. హోటల్ ముందున్న "సైకిల్ స్టాండు" కాపలావాడు ఉండి ఉండి చేతిలో బెత్తంతో వారిని దూరంగా తరుముతున్నాడు. వాడు బెత్తం విదిలిస్తూ వెంట బడగానే వారు అటూ ఇటూ పారిపోయి మళ్ళీ అంతలోనే కొత్త చర్మం మీదికి ఈగలు చేరినట్టు అక్కడే మూగుతున్నారు. హోటల్లో నుంచి పాటలు నిర్విరామంగా వినిపిస్తున్నాయి.

గాంధీ నీరసంగా అలాగే నిలబడ్డాడు. అంతలో ఒకచిత్రం జరిగింది. హోటల్లో నుంచి వచ్చిన ఒక వ్యక్తి ఏదో నాణేన్ని రెండు పైసలో మూడుపైసలో, కాక ఐదుపైసలో–ఎవరి వైపూ చూడకుండా అక్కడ మెట్లమీద కూర్చున్న అడుక్కుంటున్న వారివైపు విసిరి హడావిడిగా వెళ్ళిపోయాడు.

అక్కడ ఒక వైపు మొండిచేతుల పడుచుపిల్ల ఒకతె, తలపండి నడుంవంగిపోయిన ముసిల్దొకతె కూర్చుని వున్నారు. బక్కచిక్కి గానుగ పుల్లలా వున్న పసివాణ్ణో, పసిదాన్నో చంకన వేసుకుని వున్న నడివయస్కురాలు ఎటూకదల్లేని కాళ్ళు లేని కుంటివాడు, స్థిరంగా కదల్లేకుండా కూర్చుండిపోయిన పుట్టు గుడ్డివాడు ఇందరున్నారు. ఆ చుట్టు పక్కలనే.

దాని గుణం, మానవత్వం, జాలిగుండె, కరుణ, దయ వగైరా అద్భుత గుణాలన్నీ పుష్కలంగా వున్న ఆ పెద్ద మనిషి విలాసంగా విసిరిన ఆ నాణెం నాజూగ్గా గాలిలో ఎగురుతూ వచ్చి మొండి చేతుల పడచు పిల్లకూ, తలపండి నడుం వంగిపోయిన ముసలిదానికీ మధ్య పడింది. మొండి చేతుల పడుచుపిల్ల వెంటనే కాలు చాపి ఆ నాణెంపైన ఉంచింది. ముసిల్ది 'ఆ బాబు నా మీదికే ఏశాడు. నేనడిగితేనే ఏశాడు, తియ్యి కాలు... అని అరుస్తూ మొండి చేతుల పిల్ల కాలుపట్టి లాగుతున్నది.

మొండి చేతుల పిల్లకాదు ఆ బాబు నా మీదికే ఇసిరాడు డబ్బులు. అంటూ తన శక్తి కొద్దీ కాలును నాణెంమీద నొక్కిపెట్టి వుంచింది.

ముసలిది అరచింది. కేకలు పెట్టింది. ప్రత్యర్థిని అటు ఏడుతరాలూ, యిటు ఏడుతరాలూ శాపనార్థాలు పెట్టింది.

"నీ చేతులందుకే ఇరిగిపోయినాయి" అన్నది.

"నువ్వు కుక్కసావు సస్తావు!"

"నువ్వు పందిలాగ సస్తావు."

"నువ్వేపందివి. కాలొదులు ముందు."

"వదల్నే... అదినాది..."

"అమ్మబాబోయ్... ముసల్లంజ... కాళ్ళు రక్కుతున్నది."

ముసల్దానికి పడుచుపిల్ల కాలులాగే శక్తిలేదు. కాని తన ప్రయత్నం మానలేదు. గిచ్చింది. రక్కింది. తర్వాత లేచి ఆ పిల్లమీద పడి దాని జుట్టు పీకింది. మొండి చేతులపిల్ల స్థిరంగా కూర్చొని అన్నీ సహించింది. వీలయినప్పుడల్లా రెండో కాలితో ముసిల్దాన్ని లాగిలాగి తంతున్నది. నాణెం మీద ఉంచిన కాలును మాత్రం బెసకనీయలేదు.

గాంధీ కడుపులో దేవినట్టయింది. అతడలాగే చూస్తూ నిలబడ్డాడు. ఒక్క నిమిషం గడిచింది. రెండు నిమిషాలు గడిచాయి. వాళ్ళు ఇంకా అలానే అరుచుకుంటున్నారు. కొట్టుకుంటున్నారు. తోసుకుంటున్నారు. కుక్కల్లాగా\కొట్లాడుకుంటున్నారు.

అంతలో పడుచువాడొకడు వచ్చి కలగజేసుకున్నాడు. వాళ్ళ దగ్గరికి వచ్చి ముందు అసలేం జరిగిందో వివరం తనకు చెప్పమన్నాడు. ఇద్దరూ ఒకేసారి 'గంయ్' మని చెప్పడం మొదలు పెట్టారు. వాడు విసుక్కుని ఒక్కొక్కళ్ళే చెప్పండహె" అన్నాడు. వాళ్ళు ఒకరితర్వాత ఒకరు చెప్పగా అంతా విన్నాడు. అంత సేపూ మొండి చేతుల పడుచుపిల్ల మెడక్రిందనే చూపులు నిలిపి శ్రద్ధగా విన్నాడు. ఆ పిల్ల రంగు నలుపే అయినా, చేతుల్లేక పోయినా, మనిషి గట్టిగా బిగువుగా వుంది.

అంతావిని వాడు ముసలమ్మను నాలుగుతిట్టి "దానికి చేతుల్లేవు. నీకేంరోగం? ఈ సారి వొదిలెయ్'. అని న్యాయంచెప్పి అక్కడే కూర్చున్నాడు. వాడు అప్పుడప్పుడు రిక్షా వేస్తుంటాడు. ఎవడో బద్ధకించిన వాడి దగ్గరో, వొంట్లో బాగులేనివాడి దగ్గరో నైటు బాడిగ బండి అడిగి తీసుకోడమో, లేకపోతే "రెండు గంటలు నాకియ్యి బండి. నాలుగు రూపాయలిస్తాను." అనో బేరమాడి రిక్షా వేస్తాడు. లాడ్జింగులకు రెండు ట్రిప్పులు పడితేచాలు వాడికిక రెట్టింపు గిట్టుబాటు అవుతుంది. కొత్త సినిమా రిలీజయిననాడు హాల్లో టిక్కెట్లిచ్చే వాళ్ళతో ఒప్పదం కుదుర్చుకొని టిక్కెట్లు బ్లాకులో అమ్ముతాడు. చిన్న చిన్న దొంగతనాలు

చేస్తాడు. బక్కవాళ్ళకు పంచాయితీలు పెట్టి న్యాయమూర్తిగా వ్యవహరించి లాభం చేసుకుంటాడు. కొంచెం పెద్ద మొత్తం అవసరమైతే హోటళ్ళ ముందుండే సైకిళ్ళు దొంగిలిస్తూ వుంటాడు. పోలీసు జవాను కనిపిస్తేచాలు పరమ వినయంగా ఉత్తమ పౌరుడిలా "విష్" చేస్తాడు. వాడిప్పుడు అక్కడే నిలబడి మొండిచేతుల పిల్లవంక ఉండి ఉండి చూస్తూ "ఇదెక్కడిదో కొత్త పిట్ట... పిట పిట లాడుతున్నది." అనుకుంటున్నాడు. ఇవాళ వాడి జేబులో మ్యాట్నీ సినిమాటిక్కెట్లు బ్లాకులో అమ్మిన లాభంబాపతు పదిహేను రూపాయలు పైనేవుంది. వాడు సన్నగా ఈలవేస్తూ అక్కడే నిలబడిపోయాడు. మొండిచేతుల పిల్లకూడా ఉండి ఉండి వాడివైపే చూస్తున్నది. వ్యవహారం అనుకున్నట్టే సాయంకాలం లోపుగా సజావుగానే జరిగేట్లున్నది. కాకపోతే ఆ ముసల్ది మాత్రం కడుపు మంటతో తన కన్యాయం జరిగిపోయిందని గట్టిగా కాకపోయినా లోపల్లోపల వాళ్ళిద్దర్నీ జమిలిగా శాపనార్థాలు పెడుతూనే వుంది.

గాంధీని ఎక్కడలేని నిస్సత్తువ ఆవహించింది. కదలి ముందుకు అడుగు వెయ్యబోతే కాళ్లు వణికాయి.

'హలో' అని ఒక కంఠం వినిపించింది. మృదువుగా-నెమ్మదిగా.

అతడు తటాలున ఆగి తల తిప్పి చూశాడు.

తనతో పాటుగా యూనివర్శిటీలో చదువుకున్న వత్సలాదేవి కనిపించింది. అతడామెను గుర్తు పట్టి నవ్వాడు.

ఆమె అంతలో మెల్లిగా 'నన్ను గుర్తు పడతారనుకో లేదు' అన్నది.

'అవును. నాలుగేళ్ళు పైగా అయింది కదా? ఎక్కడ ఉన్నారిప్పుడు? ఏం చేస్తున్నారు?'

ఆమె నవ్వి 'చేసేందు కేముంది? చదువు ఊరికే అలంకార ప్రాయమే అయింది. మావారు బరోడాలో ఉంటారు. అక్కడే ఉద్యోగం బ్యాంకులో. ఇద్దరు పిల్లలు అప్పుడే, ఇక్కడకు బావగారి యింటికి చుట్టపు చూపుగా వచ్చాము. మరో రెండు గంటల్లో ప్రయాణం. ఈ పక్క వీధిలో ఒక స్నేహితురాలుంటే చూసి వెడదామని వచ్చాను. అన్నట్లు మీరేం చేస్తున్నారు.' అన్నది.

గాంధీ నవ్వుదామని ప్రయత్నించాడు. కాని నవ్వకుండా గంభీరంగా, చేసేందుకేమీ లేదు. "అడ్డమైన ఉద్యోగాలకూ అప్లయి చేయడం, ఇంటర్వ్యూలకు వెళ్ళడం ఇది మామూలై పోయింది. విసుగుపుట్టి పోతున్నది. అపుడప్పుడు మహా విరక్తి కలుగుతూ వుంటుంది జీవితం మీద' అని ఊరుకున్నాడు. ఆమె బాధ పడ్డట్టు కనిపించింది.

అతడంతలో నవ్వి 'అయితే మీ ఎం.ఎస్.సి కెమిస్ట్రీ ఫస్టుక్లాసు విజ్ఞానం అంతా కాఫీ తయారు చెయ్యడంలో వంట చేయడంలో వినియోగ మవుతున్న దన్నమాట....' అన్నాడు.

ఆమె నెమ్మదిగా నవ్వింది.

'ఈ ఉద్యోగాల వేట ఎప్పటికి అంత మవుతుందో! మళ్ళీ రేపు ఈ ఊళ్ళోనే ఇంటర్వ్యూ వుంది. జూనియర్ లెక్చరరు పోస్టు. అదీ పర్మనెంటు కాదు, లీవ్‌వేకెన్సీ.

'ఎక్కడ? ఎం.జి.ఎం.కాలేజీలోనా?'

'అవును. ఎక్కడయినా ఏ సిఫార్సులూ పలుకుబడులూ లేకుండా ఏదీరాదు. మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అంటారు. అలాగే ఇప్పుడు జాబ్స్ ఆర్ ఆల్సో మేడ్ ఇన్ హెవెన్ అనాలి'.

ఆమె ఒక్కక్షణం ఆలోచించి 'అయితే ఒకపని చెయ్యండి. ఆ కాలేజీ సెక్రటరీ, కరస్పాండెంట్, వగైరా సర్వాధికారి మా బావగారే. ఐమీన్ మావారి అన్నగారు, నేను ఉత్తరం వ్రాసి యిస్తాను, ఇంటికి వెళ్ళగానే ప్రయాణం కదా! ఆయనతో చెబుతాను కూడా. సాయంకాలం నాలుగు గంటలవేళ ఆయన ఇంట్లోనే ఉంటారు. కలుసుకుని ఉత్తరం యిచ్చి మాట్లాడండి ముందుగా. చూద్దాం ఏమవుతుందో' అన్నది.

గాంధీకి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టయింది. ఇది మొదటిసారి యిలాటి సిఫార్సు లభించడం. ఇంతకు ముందంతా తాను గాలిలో దీపం పెట్టి 'దేవుడా! నీ దయ' అనుకున్నాడు. ఈసారి ఈ మాత్రం ఆధారం దొరుకుతున్నది. చాలు, అతడెంతో ఆనందించాడు.

కృతజ్ఞత తెలుపుతూ నవ్వి 'థ్యాంక్సండీ!' అని మాత్రం అనగలిగాడు.

ఆమె ఎదురుగా వున్న షాపులోకి వెళ్ళి ఒక కాగితం అడిగి తీసుకుని పెద్ద ఉత్తరమే వ్రాసింది. చాలా జాగ్రత్తగా ఆలోచించి మరీ వ్రాసింది. దాన్ని ఒక కవరులో పెట్టి అతికించి చిరునామా వ్రాసి గాంధీకి యిచ్చింది.

తర్వాత ఒక్క క్షణం ఆగి 'ఈసారి మీకీ ఉద్యోగం రావాలి. ఆయనకు నా మాటంటే గురీ గౌరవం ఉన్నాయనుకుంటున్నాను. రెండుమూడురోజుల్లో ఫలితం ఏమయిందీ నాకు ఉత్తరం వ్రాయండి! అని తన బరోడా చిరునామా వ్రాసి యిచ్చింది.

'ఆ తర్వాత 'వస్తాను' అంటూ టాక్సీ పిలిచి అందులో ఎక్కి వెళ్ళిపోయింది. టాక్సీ కదిలే ముందు గాంధీ కొద్దిగా కంపిస్తున్న కంఠస్వరంతో 'కృతజ్ఞుణ్ణి' అని మాత్రం అనగలిగాడు. అంతలో అతనికి ఆ నర్సు కళ్ళు గుర్తుకొచ్చాయి. కరుణ కురిసే అద్భుతమైన ఆ కళ్ళు, తనను నడిపించగల కళ్ళు.

ఇప్పుడతనిలో నీరసం లేదు. నిస్సత్తువ లేదు. హుషారుగా ఈల వేసుకుంటూ ముందుకు నడిచాడు. వత్సలాదేవి ఉత్తరం జేబులో కొండంత బలం యిస్తున్నది. అవతల వీధిలో మూలగా ఒక చిన్న హోటలున్నది. అది తనకు, తన ఆప్త మిత్రులిద్దరు ముగ్గురికీ అలవాటయిన స్థలం. తెల్లవారి లేస్తే ఏ పనీ పాటా ఉండదు తమకు. అక్కడ చేరడం గంటల కొద్దీ కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేయడం, అప్పుడప్పుడు టీ తాగడం.

ఆ హోటలు ప్రొప్రయిటరు ఒక మళయాళీ. సరసుడు. అతడూ చదువుకున్నవాడే. అందువల్ల ఈ మిత్ర బృందం అంటే అతనికి ఆప్యాయత. వాళ్ళు టీ డబ్బులు అరువు పెట్టనా ఏమీ అనుకోడు. 'కానివ్వండి. మీకు ఒక్కొక్కరికే ఉద్యోగాలు రావాలి. అప్పుడు నాకు డిన్నర్ ఇస్తారు కదా!' అంటూ వుంటాడు. రెండు సంవత్సరాల కిందట రామేశానికి అయిదేళ్ళు నిరీక్షణ అనంతరం విద్యుచ్ఛక్తి శాఖలో గుమాస్తా ఉద్యోగం వచ్చినప్పుడు అతడు చిన్న పార్టీ చేశాడు. అంతే. మళ్ళీ నాయర్ కోరుకున్న డిన్నర్ దొరకనే లేదు.

కాని అతడు ఆశావాది. 'ఏమీ ఫరవాలేదు. మీకు ఉద్యోగాలు రావడం ఖాయం. నేను డిన్నర్ తీసుకోవడం ఖాయం అంటూ వుంటాడు.

హోటల్లో మూలగా చేరి కూర్చుని వున్న ముగ్గురూ గాంధీని దూరం నుంచే చూశారు. సంభ్రమంగా, గాంధీ, వస్తున్నాడు నాయర్! స్పెషల్ టీ అర్జంటు అని అరిచారు సమిష్టిగానూ, విడివిడిగానూ.

అందులో ఒకడు నెల్సన్. ఇరవై అయిదేళ్ళ పోస్టు గ్రాడ్యుయేట్. ఇంగ్లీషులో నిధి చేసిన ప్రయత్నం చేయకుండా, వెళ్ళిన ఇంటర్వ్యూకు వెళ్ళకుండా విశ్వ ప్రయత్నం చేశాడు. ఫలితం మాత్రం శూన్యం. అప్పు డప్పుడు ఇంటర్వ్యూల విషయం మాట్లాడుతూ కొద్ది రోజుల్లో సెంచరీ కొడతాను. అప్పుడది వరల్డు రికార్డుల పుస్తకంలోకి ఎక్కి తీరుతుంది.' అంటూ వుంటాడు. ఒక ఫ్యాక్టరీలో పని చేసే అన్నగారే ఆధారం. రెండోవాడు వరప్రసాద్. తెలుగు ఫస్టుక్లాస్ పోస్టుగ్రాడ్యుయేట్. మూడేళ్ళయింది డిగ్రీ పుచ్చుకుని. అప్పుడప్పుడు ఆవేదన ఎక్కువైన సందార్భాలలో కవిత్వం వ్రాస్తూ వుంటాడు. ఛందో బద్ధకవిత్వమూ, వచనకవిత్వం కూడా సమాన ప్రతిభతో వ్రాస్తాడు. కాని వ్రాసిన వాటిని ఏ పత్రికలకూ పంపడు. అతని కవిత్వం ఏ పత్రికల వారు వేసుకోరుకూడా. అతని కవిత్వంలో మామూలు పాఠకులకు కావలసిన ఆనందానుభూతి,రమణీయకం, ఆహ్లాదం, మధురిమ వగైరా లేవీ ఉండవు. జ్వాలలు, ఆవేదనలు, సంక్షోభాలు, తపనలు, యాతనలు ఇత్యాది ఎక్కువగా ఉంటాయి. అందువల్ల మొదట్లో అతడు పంపినా పత్రికల వారు సగౌరవంగా శరవేగంగా తిప్పి పంపడంతో అతనికి విరక్తి పుట్టింది. ఇక తన కవిత్వం తన తర్వాతనే వెలుగు చూస్తుందని నమ్మకంతో వ్రాస్తున్నాడు. ఉద్యోగ ప్రయత్నాలు మాత్రం మామూలే. ఇంటి దగ్గిర తండ్రి సతాయింపు భరించలేడు. తల్లి లేనేలేదు.

మూడో వాడు రాజశేఖరం, ఎం.ఎస్.సి. మ్యాథ్స్. బాడీబిల్డర్. చిన్నప్పటి నుంచి క్రమబద్ధంగా వ్యాయామం చేయడం వల్ల కండలు తిరిగిన శరీరంతో చూడ ముచ్చటగా ఉంటాడు. మనిషి మితభాషి. ఎక్కువ నవ్వడు.

గాంధీ నెమ్మదిగా మెట్లెక్కి కౌంటరు ముందు ఆగాడు. నాయర్ అతన్ని చూసి అప్యాయంగా నవ్వుతూ 'రా స్వామీ,' ఎప్పుడొచ్చావు?' అని అడిగాడు.

గాంధీ 'నిన్న సాయంకాలం వచ్చాను' అంటూ మూలగా మిత్ర బృందం దగ్గరికి నడిచాడు.

ముగ్గురు మిత్రులూ కళ్ళతోనే ఆనందంగా పలుకరించారు. గాంధీ కుర్చీలాక్కుని బల్లమీద మోచేతులు ఆన్చుకుని కూర్చున్నాడు. కొద్దిక్షణాలు అందరూ మౌనంగా ఉన్నారు.

నెల్సన్ కొద్దిగా కంపిస్తున్న వ్రేళ్ళతో చార్మినార్ పెట్టెలో నుంచి ఒక సిగరెట్ ఇవతలికి తీసి నోట్లో వుంచుకుని అగ్గిపుల్ల గీసి వెలిగించుకున్నాడు.

ఒక్కసారి పొగ పీల్చి వదిలి నెమ్మదిగా వణికే కంఠంతో చాలా అన్యాయం చేశావు బ్రదర్! అన్నాడు.

గాంధీ తలఎత్తి చూశాడు.

అవును!నువ్వు చేసింది అన్యాయమే. మనందరం ఒక్కలాంటి వాళ్ళమే కదా! రోజూ కలుసుకుని స్నేహంగా ఉంటున్నాముకదా. బాధల్లో సుఖాల్లో అన్నిటిలో అందరం

పాలుపంచుకోవలసినవాళ్ళమే కదా! మరి నువ్వొక్కడివే నీఅంతట నువ్వు ఎండ్రిన్ తాగి చచ్చిపోదామనుకోవడం స్వార్థం, అన్యాయం కదూ! మమ్మల్ని అలా మర్చిపోతావా!'

గాంధీ వొణికి పోయాడు. లేదు నెల్సన్, లేదు ఫ్రెండ్స్ నా మాట నమ్మండి. ఆ బలహీనత ఎట్లా నాలో ప్రవేశించిందో తేలీదు. నేనంత పిరికివాణ్ణి కాను. కాని, ఆ రోజు మరీ పిచ్చెక్కి పోయినట్టయి పోయింది. మతి చెడినట్టయింది. మీరెవరూ కలవలేదు. ఒంటరినై పోయాను. పిచ్చిపట్టినవాడిలా వీధులన్నీ తిరిగాను. చివరకు... చివరకు డెవిల్ ఆవేశించి నట్టయింది' అన్నాడు కళ్ళు చెమర్చగా.

నెల్సన్ 'ఊరికే అన్నాను బ్రదర్! మరిచిపో అంతా మరచిపో. పీడకలగా మరిచిపో. లెటజ్ బి హాపీ. నాయర్! ఎక్కడ మన వసంతన్? త్వరగా రమ్మను' అని అరిచాడు.

వరప్రసాద్ 'ఎన్ని కష్టాలు రానీ, నష్టాలురానీ జయమ్ము నిశ్చయమ్మురా అని బల్లమీద తాళం వేస్తూ పాట పాడాడు.

రాజశేఖరం 'అన్నట్టు మన నెల్సన్, వరప్రసాద్ ఇద్దరూ యిప్పుడొక బృహత్తర కార్యక్రమం చేపట్టారు గాంధీజీ' అని వారిద్దరి వంక తిరిగి "చెప్పండయ్యా! రోజూ మీ ప్రణాళికలతో ప్లానులతో నా ప్రాణం తీస్తున్నారుగా? ఇప్పుడు చెప్పరేం?' అన్నాడు.

'తొందరపడకు శిష్యా! చెప్తాం చెప్తాం. ముందు వేడివేడి టీ రానీ' అన్నాడు నెల్సన్.

వరప్రసాద్ జేబులో నుంచి ఏవో కాయితాలు తీసి సిద్ధంగా కూర్చున్నాడు.

వసంతన్ అనబడే కుర్రవాడు ఎల్లప్పుడూ నవ్వుతూనే వుంటాడు. అది వాడి ప్రత్యేకత. వాడిప్పుడు కూడా అనవసరంగా నవ్వుతూ టీలు తెచ్చి బల్లమీద ఉంచాడు.

మిత్రులు తలా ఒక కప్పు అందుకుని తాగడం ప్రారంభించారు.

నెల్సన్ 'నాయర్! థ్యాంక్సు ఫర్ ది టీ. అద్భుతంగా వుందనుకో' అని అరిచాడు.

నాయర్ కౌంటర్ ముందునుంచి పక్కకు తిరిగి చూసి అందంగా నవ్వి ఊరుకున్నాడు.

టీ తాగడం పూర్తి కాగానే నెల్సన్ తన కుర్చీలో ఉన్న ఒక పుస్తకం తీశాడు. తీసి దాన్ని ఎదురుగా బల్లమీద ఉంచుతూ చాలా గంభీరంగా గాంధీ వంక చూస్తూ నెమ్మదిగా స్పష్టంగా అన్నాడు.

"మనం మనలాటి వాళ్ళం ఇక ఇలా ఊరుకుంటే లాభం లేదు. మన బాధ, లేమిటో సమస్యలేమిటో సమాజానికి తెలియ జెయ్యాలి. చదువే ఒక సమస్య అసలు చిన్నప్పటి నుంచి పుస్తకాలకూ జీతాలకూ ఇతరత్రానూ మన మీద మన పెద్దలు పెద్ద పెద్ద మొత్తాలు ఖర్చు పెట్టారు. ఎందుకూ? మనల్ని చిన్నప్పుడే ఏ హోటల్లోనో, ప్రెస్సులోనో మరేదన్నా ఆఫీసులో చాకిరీ చేసేందుకు పడేసి వుంటే కథ వేరుగా వుండేది. కాని వారు మన మీద పెద్దపెద్ద ఆశలు పెట్టుకున్నారు. మనం చదివి మంచి ఉద్యోగాలు సంపాదించి వారిని పెద్ద తనంలో సుఖపెడతామని సహజంగా ఆశించివుంటారు. మనమూ వారి కోరిక మేరకు జాగ్రత్తగానే చదివి 'క్వాలిఫై' అయినాము. కాని ఉద్యోగాలు దొరకడం లేదు. జీవితం అంతా యాతనగా తయారైంది.

"బి బ్రీఫ్... ఉపోద్ఘాతం తగ్గించు..." మధ్యలో ఇద్దరు అన్నారు సమిష్టిగా. వస్తున్నా... వస్తున్నా...అసలు విషయానికే వస్తున్నా... దేశంలో అందరికీ సంఘాలున్నాయి. యూనియన్లున్నాయి. ఎందుకు? కలిలో సంఘబలమే బలమన్నారు. సంఘమంటే ఏమిటి? యూనియన్. ఏ వర్గానికైనా యూనియన్ అవసరం. వారి హక్కుల రక్షణకు, కోర్కెల సాధనకు తోడ్పడుతుంది. వ్యక్తి ఏకాకిగా ఏమీ సాధించలేడు. అతని ఏకైక గొంతు ఎవరూ వినిపించుకోరు.

"ఏకైక గొంతు ఏమిటి? ఘోరంగా ఉంది సమానం" మధ్యలో వరప్రసాద్

"సరేలేవోయ్... పెద్ద...అసలు విషయం చెప్పనియ్. ఒకే విధమైన సమస్యలు కలవారు ఒక వర్గం... మన సమస్య నిరుద్యోగం...అందువల్ల మనలాటి విద్యావంతులైన నిరుద్యోగులందరూ సంఘటితమై ఒక సంఘంగా యూనియన్‌గా ఏర్పడాలి. ముందు సమాజానికీ ప్రభుత్వానికీ మన శోచనీయ స్థితిగతులను తెలియజేయాలి."

గాంధీ చిరునవ్వు నవ్వుతూ అంతా విన్నాడు. తర్వాత ఏదో ఆలోచిస్తూ పైన సీలింగ్ ఫ్యాను వంక చూస్తూ ఉండిపోయాడు.

కొద్ది నిమిషాలాగి "ఈ ఐడియా ఎవరిది?" అని అడిగాడు.

నెల్సన్ నిస్సంకోచంగా "నాదే... ఇందులో తప్పులూ ఒప్పులూ అన్నీ నావే. నేనే వీరిద్దరి నెత్తినా ఈ పథకం రుద్దాను. అనేదేమైనా ఉంటే నన్నే అను." అన్నాడు.

"నేను తప్పు పడతానని ఎందుకనుకున్నావు?" అని అడిగాడు గాంధీ.

"నాలుగైదు రోజులనుంచీ జరుగుతున్నదిదే. ఎవరెవరో రావడం అడ్డమైన ప్రశ్నలు వేయడం... విసిగించడం... ఎవరికీ నేను చెప్పేది అర్థంకాదు. అర్థం చేసుకునే ప్రయత్నం కూడా చెయ్యరు?"

"మమ్మల్ని మాత్రం వారితో కలపకు. మేము బాగా అర్థం చేసుకున్నాము." అన్నాడు వరప్రసాద్.

'వాళ్ళూ వీళ్లూ అంటున్నారు...అదేమిటి?

నెల్సన్ తన పుస్తకంలోనుంచి ఒక చిన్న పేపరు కటింగ్ తీసి గాంధీకి అందించాడు. అందిస్తూ మా వీధిలో ఒక ప్రెస్ రిపోర్టర్ ఉన్నాడులే...అతనితో మాటల సందర్భంలో నా పథకం చెబితే 'న్యూస్ ఐటమ్'గా యిచ్చాడు. దాంతో కొంత సంచలనం ప్రారంభమైంది!' అన్నాడు.

న్యూస్ ఇంగ్లీష్‌లో ఉంది. ప్రకటన పూర్తి పాఠం ఇది. 'దేశంలో రోజు రోజుకూ భయంకరంగా తయారవుతున్న నిరుద్యోగ సమస్య తీవ్రతను ప్రజల దృష్టికీ, ప్రభుత్వం దృష్టికీ తీసుకువచ్చే ప్రయత్నంలో భాగంగా 'నగర నిరుద్యోగ విద్యావంతుల యూనియన్' స్థాపించేందుకు'ఫలానా' చోట కృషి జరుగుతున్నది. ఆసక్తి గలవారు సంప్రదించవచ్చును' అది అయిదు రోజులనాటి సంగతి.

'తర్వాత ఏమయింది?' అని అడిగాడు గాంధి ఉత్సుకతతో.

'మొదటి రోజు మాయిల్లు వెతుక్కుంటూ ఎనిమిదిమంది వచ్చారు. వాళ్ళతో మాట్లాడాను. సమస్యను కూలంకషంగా చర్చించాను. వారిలో అయిదుగురు గ్రాడ్యుయేట్లు... ఇద్దరు పోస్టుగ్రాడ్యుయేట్లు... ఒకడు మాత్రం టెన్త్ ఫెయిలయినవాడు...

రెండోరోజూ మూడోరోజూ నిన్నా అలాంటివారి సంఖ్య పెరుగుతూ వచ్చింది. అందరికీ కలిపి నిన్న సాయంకాలమే ఈ హోటల్‌లోనే మీటింగ్ పెట్టాము'.

'దేనికి మీటింగ్'?

'అసలు సంఘంగా ఎలా ఏర్పడాలి? ఏందుకేర్పడాలి? మనం చేయవలసిన కృషి ఏమిటి? సంఘం ఏర్పడ్డ తర్వాత ఏం చేయాలి? వగైరా వివరాలన్నీ చర్చించాం... అందరూ చర్చలో పాల్గొన్నారు.'

రాజశేఖరం గాంధీతో, మీరు ఉండవలసింది నిన్న సాయంకాలం. మొదట్లో తను అంత సీరియస్‌గా తీసుకోలేదుగాని నిన్న అంతమంది మాట్లాడిన తర్వాత అసలు సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థమైంది. ఒక్కొక్కళ్ళది ఒక్కొక్క కథ. అంతా అయ్యేసరికి చాలా డిస్టర్బ్ అయ్యాను' అన్నాడు గంభీరంగా.

'ఏం నిర్ణయాలు చేశారు?" అని అడిగాడు గాంధీ

'ఇదిగో...' అంటూ పుస్తకం తీశాడు నెల్సన్ 'ఇవి తీర్మానాలు. ఒకటి సంఘానికి పేరు. నగర నిరుద్యోగ విద్యావంతుల సంఘం...

రెండు... సంఘ కార్యకలాపాలకు ధన సేకరణ....సభ్యులే తలా రెండు రూపాయల వంతున ముందు చెల్లించాలి. తర్వాత పోరాట ఉధృతిని బట్టి నెలనెలా ఇంత అని వసూలు చేయాలి.

మూడు, సంఘానికి ప్రస్తుతానికి ఒక కార్యదర్శి. ఒక ఛైర్మన్. ముగ్గురు సభ్యులు గల కార్యవర్గం ఉంటుంది.

నలుగు కార్యాచరణ... మొదట ఒక ఊరేగింపు... నగర వీధులలో సభ్యులందరూ చేతులలో ప్లేకార్డులు ధరించి నినాదాలిచ్చుకుంటూ వెళ్ళి ముఖ్యమంత్రిని కలిసి మెమొరాండం సమర్పించాలి. ఈలోగా స్థానిక పత్రికలలో ఉత్తరాల శీర్షికలలో ఆర్టికల్స్ రూపంలో ఈ సమస్య తీవ్రతను గురించి ప్రజలకు... తెలియజేయాలి... ప్రజానీకాన్ని ఈ విషయమై ఎడ్యుకేట్ చేయవలసిన అవసరం ఎంతో వుంది..."

నెల్సన్ అంతా చదివి వినిపించి పుస్తకం బల్లమీద ఉంచి సిగరెట్టు తీసి వెలిగించుకున్నాడు. తర్వాత గాంధీ వంక ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఎంతమంది సభ్యులుగా చేరారు?'

"ఇప్పటికి నలభైమందికి పైగా ఉన్నారు."

"మైగాడ్. ప్రోగ్రెస్ అద్భుతంగా ఉంది. అయినా...." అంటూ ఆగాడు గాంధీ.

ఒక్కక్షణం ఆగి, "మనం ఇవన్నీ చెయ్యగలమనే నమ్మకం ఉందా? అని అడిగాడు.

"లేకేం?ఆఫ్టరాల్ ఒక ఊరేగింపు నిర్వహించలేమా? ఆ స్వేచ్ఛ మనకు లేదా?" అని అడిగాడు కొంచెం ఉద్రేకంగా నెల్సన్.

"తప్పకుండా నిర్వహించవచ్చు. విజయవంతంగా నిర్వహించవచ్చు. తర్వాత ఊరేగింపు జయప్రదంగా నిర్వహించామనీ, మంత్రికి మహజరు సమర్పించామనీ సంతృప్తి పడవచ్చు... ఆతర్వాత?"

"తర్వాత ఏమిటి?"

"మహజరు సమర్పించిన తర్వాత? అర్జంటుగా ఏమీ జరగదు.. అంత అర్జంటుగా పనులు జరిగే వ్యవస్థ కాదు మనది. అట్టహాసంగా నగర వీధుల్లో నినాదాలిచ్చుకుంటూ వెళ్ళేందుకు స్వేచ్ఛ ఉంది. మెమొరాండం ఇచ్చేందుకు స్వేచ్ఛ వుంది. దాన్ని మంత్రివర్యులు జాగ్రత్తగా స్వీకరిస్తారుకూడా! పరిశీలిస్తాం... చూస్తాం.... చేస్తాం...' అంటారు. మనం వచ్చేస్తాం... అంతవరకూ బాగానే వుంది. తర్వాత? పనులు తొరగా జరగవు... అప్పుడేం చేస్తాం?"

"అబ్బే! అదేం కుదరదు" అన్నాడు విసురుగా నెల్సన్. "మనం మెమొరాండం లో సమస్యల పరిష్కారానికి గడువు నిర్ణయిస్తాం. ఆలోపల మన కోర్కెలు సెటిల్ చెయ్యకపోతే..."

"చెయ్యకపోతే...నిరాహారదీక్షకు పూనుకుంటామని హెచ్చరిస్తాం అంతేనా?"

"అంతే... అంతే...ఒట్టి నిరాహారదీక్ష కాదు. ఆమరణ నిరాహారదీక్ష.... దాంతో సింహాసనాలు కదలిపోతాయి.

గాంధీ తలపంకించాడు. తర్వాత నెమ్మదిగా "బాగుంది...చాలాబాగుంది...అలాగే చేద్దాం..." అన్నాడు చేతివ్రేళ్ళు విరుచుకుంటూ.

నెల్సన్ హర్షాతిరేకంలో తలమున్కలైనాడు. అతనికి అకస్మాత్తుగా కళ్ళ వెంట నీళ్ళు వచ్చాయి. గాంధీ చేతులు రెండూ పట్టుకుని "మీరుండండీ నాతో... ఊరికే మా పక్కనే ఉండండి చాలు... ప్రళయాలను సృష్టిస్తాను... అటో యిటో తేల్చిపారేస్తాను" అన్నాడు డగ్గుత్తికతో.

గాంధీ అతని ఆవేశానికి ఆశ్చర్యపోయి అతనివంకనే చూస్తూ ఉండిపోయాడు.

నెల్సన్ మళ్ళీ "జీవితం పోరాడి అయినా సరే జీవించడానికి... యూ కాంట్ డై వితవుట్ ఫైటింగ్..." అన్నాడు.

అంతలో మరి నలుగురైదుగురు వచ్చారు. అక్కడే కుర్చీలో కూర్చున్నారు.

మళ్ళీ ఆవేశపూరితమైన చర్చలు... వాదోప వాదాలు కొనసాగాయి... మళ్ళీ మళ్ళీ టీలు వచ్చాయి.

అలసిపోయినవారూ వెలిసిపోయిన సుఖసంతోషాలవారూ, జీవితం సమస్యగా బ్రతుకే బరువుగా తయారైనవారూ అందరూ ఉత్సాహంతో, ఉద్రేకంతో ఊగిపోతున్నారు. శుష్కించిన శరీరాలతో, కొద్దిగా మాసిన బట్టలతో, మాసిన గడ్డాలతో, కళ్ళజోళ్ళతో అందరూ బల్లచుట్టూ కూర్చుని మాట్లాడుకుంటూవుంటే బుల్లి బుల్లి అగ్నిపర్వతాలు సమావేశమైనట్టున్నది.

వరప్రసాద్ ఉన్నట్టుండి లేచి రెండు చేతులు ఎత్తి అందర్నీ నిశ్శబ్దంగా ఉండమని సైగచేశాడు.

ఉన్నట్టుండి నిశ్శబ్దం వ్యాపించింది. అందరూ అతడేమి చెబుతాడో అని ఉత్కంఠతో అతనివంక చూస్తున్నారు. గాంధీ కూడా ఉత్సుకతతో ముందుకు వంగి కూర్చున్నాడు.

వరప్రసాద్ గొంతు పెద్దదిచేసి "మిత్రులారా! నిన్నటివరకూ మీరెవరో. మేమెవరమో! ఇన్నాళ్ళూ ఎవరిపాటికి వారు తాపత్రయ పడ్డారు. నిన్నటివరకూ ఎవరి ప్రయాస వారిది.

కాని ఇవాళ మనం సంఘటిత శక్తిగా రూపొందాము. ఇక మనపోరాటం వ్యక్తిగత పోరాటంకాదు. గడ్డిపోచలం ఇన్నాళ్ళుగా మనం. గడ్డి పోచకు విడిగా బలం ఉండదు. అయితే దాన్నే తాడుగా పేనితే ఏనుగునే బంధించవచ్చు. ఈ సందర్భంగా నేను వ్రాసిన ఒక గేయం చదివి వినిపిద్దామనుకుంటున్నాను" అన్నాడు జేబులోనుంచి ఒక కాగితం తీసి.

ఎవరో అసహనంగా "కవిత్వాలెందుకు బ్రదర్ ఇప్పుడు"? అన్నారు.

మరెవరో "కాదు కాదు. అదికూడా అవసరమే. అది మన ఆవేదనను ప్రజలకు తెలియజేస్తుంది. వ్యాసాలు, ఉత్తరాలు, ఎంత అవసరమో కవిత్వం కూడా అంతే అవసరం... చదవండి... చదవండి..." అన్నారు.

మళ్ళీ అంతా సద్దుమణిగింది.

వరప్రసాద్ కళ్ళజోడు సర్దుకుని కాగితంలోకి చూస్తూ ప్రసిద్ధ కవులవలె తన గేయాన్ని చరణం రెండేసి సార్లుగా చదివాడు. ఒక్కొక్క చరణం పూర్తికాగానే శ్రోతలలో నుంచి 'వహ్వా'లూ, 'శభాష్' లూ వినిపించడంతో మరింత ఉత్సాహంగా చదివాడు.

"కాలుతున్నది... కాలుతున్నది...
గులాబీలతోట..." అని మొదలుపెట్టాడు.

'శభాష్,'శభాష్' అన్నారిద్దరు ముగ్గురు. వరప్రసాద్ వినయంగా తలవంచుకుని మళ్ళీ చదివాడు.

"కాలుతున్నది...కాలుతున్నది
గులాబీలతోట...
నలిగిన, కమిలిన గులాబీల ఆత్మలు
మరణించవు... మరణించవు...
ఆ ఆత్మలు ఒక్కొక్కటిగా
ఒకచోట ఎక్కడో
గూమికూడుతున్నాయి...
ఘనీభవిస్తున్నాయి.
ఘనీభవిస్తున్నాయి... వజ్రసమాన లోహంగా...
అచిరకాలంలోనే ఆ లోహంలోనుంచి
శిరస్త్రాణాలు...
కవచాలు...
ఈటెలు...
బాకులు...
వెలువడి సిద్ధం అవుతాయి దాడికి...
సిద్ధంగా ఉండండి మరణించేందుకు...
గులాబీతోటకు నిప్పుపెట్టిన దుష్టులార!
గులాబీల ఆత్మలను నలిపివేసిన

దుష్టశక్తులారా!

సిద్ధంగా ఉండండిమరణించేందుకు...

ఇదికాలం మీపేర వ్రాసిన వీలునామా!

కొద్దిమంది చప్పట్లు కొట్టి తమ ఆనందాన్ని తెలియజేశారు.

వరప్రసాద్'ఇంతేకాదు...మనం నిర్వహించబోయే ఊరేగింపులో మనం వాడేందుకు నినాదాలు కూడా వ్రాస్తాను? వాటన్నిటినీ అట్టలమీద వ్రాసి ముందుగా ప్లేకార్డులు తయారుచేసుకుందాం.' అన్నాడు.

అంతే... అలాగే చేద్దాం' అన్నారెవరో,

గాంధీ నిర్లిప్తంగా చూస్తూ ఉండిపోయాడు. అతనికి అంతలో ఏదో గుర్తుకొచ్చింది. పక్కనున్న అతన్ని 'టైమెంత అయింది?' అని అడిగాడు.

అతడు వాచీ చూసుకుని 'మూడు దాటింది' అన్నాడు.

'బాప్‌రే' అనుకున్నాడు గాంధీ. ఈ హడావిడిలో పడి ఏమీ గమనించలేదు. సమయం గటిచినట్లే అనిపించలేదు. ఇక ఇప్పుడు బయలుదేరితేకాని రెండుబస్సులు మారి వత్సలాదేవి చెప్పిన చోటికి చేరుకోలేడు తాను.

అతడంతలో లేచి నెల్సన్‌కు, వరప్రసాద్‌కు చెప్పి హోటల్‌నుంచి రోడ్డుమీదకి వచ్చాడు.

బయట ఎండ చిటచిటలాడుతున్నది. వర్షాకాలపు వృద్ధ సూర్యుడు తన చివరి శక్తులన్నీ కూడదీసుకుని వెలుగుతున్నాడు.

గాంధీ విసవిస నడిచి కొద్ది దూరంలో ఉన్న బస్‌స్టాపును చేరుకుని నిలబడ్డాడు. ఏవేవో బస్సులు వస్తున్నాయి... పోతున్నాయి... కొన్ని బస్‌లక్కడ ఆగటమేలేదు. చివరకు పావుగంటపైగా నిరీక్షించిన తర్వాత అతనికి కావలసిన బస్సు వచ్చింది. గాంధీ ఆలస్యం చేయకుండా చివాలున ఎక్కి లోపలికి దూసుకుపోయాడు. పైన ఇనుపకడ్డీ పుచ్చుకుని కండక్టరు దగ్గర టికెట్టు పుచ్చుకున్నాడు. రెండు మూడు నిమిషాల ప్రయాణం...ఒక సెంటరులో దిగాడు.

మళ్ళీ అక్కడ బస్‌స్టాప్‌లో నిరీక్షణ... మరొక పదిహేను నిముషాలు... మళ్ళీ మరొక బస్సు... దాని కడుపున పడి చివరకు చేరవలసిన చోటుకి చేరుకున్నాడు.

వత్సలాదేవి చెప్పిన ప్రకారం ఇల్లు వెదుక్కుంటూ నడక సాగించాడు. మధ్యలో ఇద్దరిని ముగ్గురిని అడగవలసి వచ్చింది. చివరకు ఆ యింటిని చేరుకున్నాడు.

అతి నవీనంగా ఆధునికంగా కట్టబడిన పెద్దయిల్లు... ముందు ఆవరణ... దోవ కటూయిటూ రకరకాల రంగు రంగుల క్రోటను మొక్కలు. పెద్ద వరండాలో అటూ యిటూ స్వేచ్ఛగా తిరుగుతున్న పెద్దపులిలాంటి అల్సేషియన్ కుక్క గేటు తీసుకుని లోపలకు వస్తున్న గాంధీని చూసి అది అరవలేదు కాని అసహ్యంగా 'గుర్రుని' సవ్వడి చేసింది. అంతలో పక్కవరండాలోంచి నౌకరు కాబోలు ఒకడు వచ్చి గాంధీవంక కనుబొమలు మడిచి వికృతంగా చూస్తూ అంతకన్నా వికృతమైన గొంతుతో 'ఎవరికోసం'? అని అడిగాడు.

గాంధీ వత్సలాదేవి చెప్పిన పేరుకు పునశ్చరణ చేసుకుని 'సచ్చిదానందమూర్తిగారి కోసం. ఆయన వున్నారా యింట్లో !' అని అడిగాడు.

'ఆ!' ఉన్నారు. వస్తారు కూచోండి' అన్నాడు.

గాంధీ మెట్లెక్కి వరండాలోకి వెళ్ళి నిలబడ్డాడు. వరండాలో ఒక పక్క పెద్ద టీపాయ్ చుట్టూ మెత్తని దిండ్లున్న ఖరీదైన కుర్చీలున్నాయి. అయిదో... ఆరో... కాని గాంధీ కూర్చోలేదు? వరండా అంచున నిలబడ్డాడు. వత్సలాదేవియిచ్చిన కవరు జేబులోనుంచి, తీసి చేతిలో ఉంచుకున్నాడు.

రెండు నిముషాలు గడిచాయి. అంతలో గుమ్మంలో తెరకదలి పలుచగా గంటలు మృదువుగా గలగలమని శ్రవణపేయంగా మ్రోగాయి,నలభై, నలభైఅయిదు సంవత్సరాల వయసుగల వ్యక్తి వరండాలోకి వచ్చాడు. వచ్చీరావడంతో వరండాలో నిలబడివున్న గాంధీవంక 'ఏమిటన్నట్లు చూశాడు.'

గాంధీ తడబడుతూ 'సచ్చిదానందమూర్తిగారంటే....' అన్నాడు.

నేనే, నేనే ఏం కావాలి" అన్నాడాయన.

గాంధీ ఆయనకు నమస్కారం చేసి 'నాపేరు గాంధీ... వత్సలాదేవిగారు చెప్పే వుంటారు. ఈ ఉత్తరం మీకిమ్మన్నారు...' అన్నాడు.

ఆయన భ్రుకుటి ముడిచి 'వత్సల నాకేమీ చెప్పలేదే...' అంటూనే కవరు అందుకుని నెమ్మదిగా నడిచివెళ్ళి కుర్చీలో కూర్చుని కవరు విప్పి ఉత్తరం తీసి చదవడం ప్రారంభించాడు.

ఆయన పచ్చగా బలంగా ఏపుగా వున్నాడు. నున్నగా తళతళలాడుతున్నాడు. పలుచని లాల్చీ, ఖరీదైన గ్లాస్కోపంచె ధరించి ఉన్నాడు. చేతికి బంగారు గొలుసున్న అందమైన వాచీవుంది. మెడలో సన్నటి ఒంటిపేట బంగారు గొలుసుంది. చూడగానే బంగారుచంచా నోట్లో ఉంచుకుని పుట్టినబాపతు వ్యక్తి అని తెలుసుకోవచ్చు. ఆయన చాలా శ్రద్ధగానే వుత్తరం చదివాడు. ఆ తర్వాత దాన్ని ఎదురుగా ఉన్న టీపాయ్ మీద పడేసి అనవసరంగా కళ్ళు తుడుచుకున్నాడు. ఆ తర్వాత చేతులు రెండూ తలవెనక పెట్టుకుని కుర్చీలో వెనక్కువాలాడు.

ఉన్నట్టుండి 'నీపేరేమిటి?' అని అడిగాడు.

"గాంధీ అండి... డి.యంకె. గాంధీ... ఎం.యస్.సి. ఫస్టుక్లాసులో పాసయ్యాను. వత్సలాదేవిగారు మా క్లాస్‌మేట్‌సార్! నాలుగేళ్ళయింది...ఇంతవరకూ ఎక్కడా జాబ్ రాలేదు."

ఆయన అనవసరంగా హఠాత్తుగా నవ్వాడు. అంతలోనే మళ్ళీ గంభీరంగా మౌనంగా కూర్చుండిపోయాడు.

'ఊ' అన్నాడు ఉన్నట్టుండి.

గాంధీని మళ్ళీ నిస్సత్తువ ఆవహిస్తున్నది. కళ్ళముందు చీకట్లుకమ్ముతున్నాయి. కాళ్ళు కొద్దిగా వొణుకుతున్నాయి.

ఆయన హఠాత్తుగా ఎందుకో కుడిచేయి విదిలించాడు. ఏదో మాట్లాడేందుకు సిద్ధపడుతున్నట్లు కనిపించాడు.

'ఊ! ఏవీ ఉద్యోగాలు? ఎక్కడున్నాయి ఉద్యోగాలు? ఘోరంగా ఉంది పరిస్థితి ఒక్క వేకెన్సీ కోసం ఎడ్వర్టయిజు చేస్తే ఎనభయి అయిదు అప్లికేషన్లు వచ్చాయి. అందులో ఎనిమిదిమంది డాక్టరేట్ పొందినవాళ్ళున్నారు. పదిమందివరకూ బి.యిడీ.గాళ్లున్నారు.

యాభయిమందికిపైగా ఫస్టుక్లాసులు... ఏం చెయ్యాలి?' ఆయన లేచాడు. మళ్ళీ అందుకున్నాడు.

'వంద రికమండేషనులు... మినిష్టర్ల దగ్గర్నించీ, కలెక్టర్ల దగ్గర్నించీ, యాక్టర్ల దగ్గర్నించీ, చివరకి గవర్నర్ దగ్గర్నించీ సిఫారసులు... ఏం చెయ్యాలి?'

ఆయన మళ్ళీ కూర్చున్నాడు.

ప్చ్! దేశం తగలబడిపోతున్నది. అందరూ చదువుకోవడమే... అందరికీ డిగ్రీలే... అందరికీ ఉద్యోగాలు కావాలి... ఉద్యోగాలేమన్నా చెట్లకు కాస్తున్నాయా? అందరికీ ఎక్కణ్నించి వొస్తాయి ఉద్యోగాలు? ఏం చెయ్యాలి?

ఆయన ఇంకా ఏదో మాట్లాడుతూనే ఉన్నాడు. మధ్యమధ్యలో ఆవేశంగా చేతులు గాలిలోకి విసురుతున్నాడు. ఉండి ఉండి తలపట్టుకుంటున్నాడు.

గాంధీ కళ్ళార్పకుండా ఆయన వంకనే చూస్తున్నాడు. అంతలో అతని కళ్ళముందు ఆశ్చర్యకరమూ విచిత్రమూ అయిన దృశ్యము కనిపించింది.

నున్నని గచ్చుమీద ఖరీదైన టీపాయ్...దానిమీద ప్లాస్టిక్ పూలున్న ఫ్లవర్ వాజ్ చుట్టూ ఖరీదైన ఫేమ్ కుర్చీలు, వాటిల్లో దిండ్లు.

ఆ పెద్ద కుర్చీలో కూర్చుని వున్న దెవరు?

ఒక పెద్ద తోడేలు

పొడుగాటి మూతితో వొంటినిండా నల్లని రోమాలతో, రక్తనయనాలతో పారపళ్ళతో భయంకరంగా కూర్చుని వుండి చెయ్యి విసురుతున్నది. ఉండి ఉండి చేతులతో తల పట్టుకుంటున్నది.

అంతలో గాంధీ ఉలిక్కిపడి ఇహంలోకి వచ్చాడు. ఆయన పెద్దగా నిన్నేనయ్యా! ఎందుకలాగా బిగుసుకుపోయావు... ఈ లోకంలో లేవా ఏమిటి?" అన్నాడు.

గాంధీ "ఏమండీ ఏమంటున్నారు" అన్నాడు తడబడతూ.

ఏమి అనలేదు. ఉత్తరం ఇచ్చావు కదా! ఇక వెళ్ళు అన్నాడు.

గాంధీ నీళ్ళు నములుతూ 'మరి" అని ఏదో చెప్పబోయాడు.

ఆయన విసుగుతో 'అర్థమైందికదా నాకు! చూస్తాను...వెళ్ళిరా... పైగా నేనొక్కణ్ణేకాదు... ఈ విషయం చూసేది...ఇంకా బోలెడుమంది ఉన్నారు...అయినా చూస్తానంటున్నానుకదా? వెళ్ళిరా....అన్నాడు...

గాంధీ "వస్తానండీ" అని మళ్ళీ ఆయనకు నమస్కరించి వరండామెట్లు దిగి ఆవరణదాటి, గేటుదాటి వీధిలోకి వచ్చాడు.

మళ్ళీ నడక... మళ్ళీ రెండు బస్సులు మారడం... మళ్ళీ మళ్ళీ నిరీక్షణ. జీవితమంతా ఈ నిరీక్షణతోనే కరిగిపోయేట్టున్నది.

అతడు అరగంట తర్వాత నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ రాజారాంగారి యింటి వైపు నడుస్తున్నానడు. టైమ్ ఎక్కువ కాకపోయినా వర్షాకాలం కావడం వల్లనూ ఆకాశంలో నల్లని మబ్బులు గుమికూడి గర్జిస్తూ ఉండడంవల్లనూ బాగా పొద్దుపోయినట్టున్నది.

గాంధీకి ఆకలివేస్తున్నది. విపరీతంగా దాహంకూడా వేస్తున్నది. పొట్టలో ఒక భయంకర రాక్షసుడు కాపురముండి 'తిండి...తిండి...' అని అరుస్తున్నట్టుంది. అతనికి

అంతలో హాస్పిటల్లో తాను చూసిన నర్సు గుర్తుకు వచ్చింది. ఆకర్షణీయమైన ఆ విగ్రహం... అందమైన ముఖం... పెద్దపెద్ద కళ్లు... కరుణార్ద్రమైన అందాలకళ్ళు...

అతడు త్వరత్వరగా అడుగులు వేశాడు.

రాజారాంగారు ఇంట్లో ఉన్నారో లేరో! ఆయన లేకపోయినా ఫరవాలేదు. ఇవాళ వారింట్లో తనకు వారమే, అయితే ఈ మధ్య వెళ్ళడం లేదు. ఆ యింట్లో ముందు గదిలో రాజారాం గారి తండ్రి–ముసలాయన–మంచంలో పడివుండి నిరంతరంగా దగ్గుతూ వుంటాడు. నిద్రపట్టక బాధపడుతూ వుంటాడు. అయితే ఆయన దగ్గర ఒక గొప్ప సుగుణం ఉంది. తనబాధ ఏదో తానే పడతాడుగానీ ప్రాణంపోయినా కూతుర్ని కాని, కొడుకునుగాని పిలవడు. ఇక రాజారాంగారికి నెలలో ఎక్కువరోజులు క్యాంపులు. ఆయనకు ముప్ఫయి అయిదేళ్ళుంటాయి. పెళ్ళిచేసుకోలేదు... ఎందుకోమరి... బహుశా తండ్రి అనారోగ్యం కారణం కావచ్చు. లేదా చెల్లెలి దయనీయమైనపరిస్థితి కారణం కావచ్చు. మొత్తానికి ఆయన పెళ్ళి చేసుకోలేదు. మనిషి అందంగా నీటుగా ఉంటాడు. చక్కని సంపాదన...దురభ్యాసాలు ఏమీలేవు... సిగరెట్లు తప్ప... ఆయన చెల్లెలు శకుంతల అతి చక్కనిది...కాని నుదుటివ్రాతే చెడింది. ఎంతో సుఖపడుతుందని రాజారాం తన ప్రాణస్నేహితుడికి ఆమెనిచ్చి పెళ్ళిచేశాడు. కాని విధి కొండచిలువలాగా అతన్ని మింగివేసింది. దాంతో గ్రహణం పట్టిన జీవితమైంది ఆమెది...

గాంధీ నడుస్తూనే వున్నాడు. మెయిన్ బజారు హడావిడి ఈ వీధిలో లేదు. దీపాలు మందంగా వెలుగుతున్నాయి. ఆకాశంలో మబ్బులు సన్నద్ధమవుతున్నాయి. ఉండి ఉండి ఉరుముతున్నాయి. గర్జిస్తున్నాయి.

ఆ యింటి తలుపు తీసేవుంది. గుమ్మంలోనుంచి లోపల హాల్లో వెలుగుతున్న లైటు తాలుకూ కాంతి వరండాలోకి వెడల్పాటి గీత గీచినట్టు పడుతున్నది. వరండా కుడిపక్క గదిలో ముసలాయన నిద్రపోతున్నట్టున్నాడు. ఎక్కడా ఏ అలికిడీ లేదు.

గాంధీ గుమ్మందగ్గర నిలబడి "ఏమండీ" అని పిలిచాడు.

వెంటనే సమాధానం రాలేదు.

అతడు తలుపుతోసుకుని ముందుహాల్లోకి వెళ్ళి నిలబడ్డాడు.

మళ్ళీ గొంతు హెచ్చించి "ఏమండీ" అని పిలిచాడు. ఇప్పుడూ ఏ సమాధానమూ రాలేదు.

అతనికి అంతలోనే నీరసం ముంచుకొచ్చింది. కళ్ళముందు లైటు వెలుతురులో ఏవేవో నల్లని గుండ్రని మచ్చలు రింగులు రింగులుగా తమాషాగా కదలడం ప్రారంభించాయి.

ముందుహాలు మరీ పెద్దది కాకపోయినా శుభ్రంగా, అందంగా ఉంది.

ఎదురుగా చక్కనిబల్ల... దాని మీద పెద్ద రేడియో... రేడియో పక్కన అందమైన పూలకుండీ...

పక్కన అద్దాల బీరువాలో బుల్లి బుల్లి అందమైన కొండపల్లి బొమ్మలు...

రేడియో బల్ల పక్కన గోడవారగా సోఫా...దానిముందు నగిషీలు చెక్కబడిన అందమైన టీపాయ్–దానికటూ యిటూ రెండు చక్కని కుర్చీలు...

అంతా ఎక్కడికక్కడ నీటుగా శుభ్రంగా అందంగా సర్దినట్టున్నది.

గాంధీ "ఏమండీ" అని మళ్ళీ పిలిచాడు. ఇప్పుడూ సమాధానంలేదు.

అతడు తలుపును అనుకుని నిలబడి నీరసంతో కళ్ళుమూసుకున్నాడు. మళ్ళీ అంతలోనే కళ్ళుమూసుకుంటే అలాగే నిద్రపడుతుందేమోనని అనుమానంతో మూసుకుపోతున్న కనురెప్పలను బలవంతంగా తెరుచుకుని చూశాడు. అంతలో ఆవులించాడు.

కళ్ళకు పనిచెప్పడం కోసం హాల్లోవున్న వస్తుసామాగ్రిని అద్దాల బీరువాలో వున్న బొమ్మలు మినహాయించి, లెక్కపెట్టాడు.

సోఫా ఒకటి... ఆవులింత... కుర్చీలు మొత్తం ఎక్కడుంటేనేం నాలుగు టీపాయ్-ఒకటి... మళ్ళీ ఆవులింత... బల్ల ... దానిమీద రేడియో... రేడియో పక్కన ఫ్లవర్‌వాజ్... అన్నట్టు అందులో వున్న పువ్వులు నిజమైనవా లేక ప్లాస్టిక్ పూలా? మళ్ళీ ఆవులింత... ఇంకా బల్లమీద సన్నగా టిక్కు టిక్కు మంటున్న అలారం గడియారం... రెండుమూడు పుస్తకాలు.... బొమ్మల బీరువా... దానిలో ఒక అరలో నిండుగా పేర్చబడిన పుస్తకాలు...ఇంకా? అతడు చుట్టూ చూశాడు. ఈ మూల కిటికీలో దినపత్రికల దొంతర. ఇంకేమున్నాయబ్బా? ఇదుగో పైన సీలింగ్ ఫ్యాను. ఇంకా... ఇంకా... మళ్ళీ ఆవులింత.

గాంధీ బలవంతాన విప్పార్చుకుని చూశాడు. అప్పుడు కనిపించిందతనికి ఆ ఫోటో... బీరువా పక్కన గోడకు వ్రేలాడుతున్న ఒకేఒక్క ఫోటో. అతడు ఇన్నాళ్లుగా దాన్ని చూడనేలేదు.

అతడు నెమ్మదిగా నడిచి గోడదగ్గరికివచ్చి ఫోటోలోకి చూశాడు.

అది పెళ్ళిఫోటో...

భార్యాభర్తలిద్దరూ హాయిగా నవ్వుతూ కెమెరావైపు చూస్తున్నారు. ఇద్దరి మెడలలోనూ దండలున్నాయి. చెమ్కీదండలు. హాయిగా ఆనందంగా ఉన్నారిద్దరూ. ఫోటో దిగేముందు చాలా సేపటినుంచి నవ్వుతూనే వుండివుంటారు. ఫోటో దిగడం అయిన తర్వాతకూడా నవ్వుతూనే వుండి వుంటారు. అప్పుడే ఆ పక్కనే చుట్టాలు, పక్కాలు, స్నేహితులు అంతా గుమికూడి వుంటారు.

పెళ్ళికొడుకు... ఇప్పుడులేడు... ఫోటోలో చాలా హుషారుగా చాకులాగున్నాడు. జుట్టు పైకిదువ్వుకుని నవ్వుతూ అందంగా భవిష్యత్తులోకి చూస్తున్నాడు. ఫుల్ సూటులో ఠీవిగా ఉన్నాడు.

ఇక పెళ్ళికూతురు అన్నట్టు ఈమె ఇన్నిసార్లు పిలిచినా పలకలేదు, ఏంచేస్తున్నది చెప్మా

ఆమె ఫోటోలో కొద్దిగా తలవంచుకొని నవ్వుతూనిలబడివుంది. నవ్వినప్పుడు బుగ్గలు కొద్దిగా సొట్టలు పడ్డాయి... పెదవులు పలుచగా తడితడిగావున్నాయి. ముక్కు సన్నగా కొనదేలి అందంగా ఉంది. మెడలో చెమ్కీ దండతోపాటు ఇంకా కొన్ని నగలున్నాయి. గుత్తంత వొంటి నంటిపెట్టుకుని వున్న జాకెట్టు, పెద్ద భోర్డరున్న ఖరీదైన చీర ధరించి వుంది, ఆమెకూడా పెద్ద పెద్ద కళ్ళతో భవిష్యత్తులోకి చూస్తున్నది. అప్పుడామెకు భవిష్యత్తు ఎలా కనిపించి ఉంటుంది? అంతా వెలుతురు... ఆనందం... నవ్వులు... పువ్వులు...

వికసించిన పువ్వుల్లా నవ్వుతున్న పిల్లలు...చల్లని పిల్లగాలి...అది మోసుకువచ్చే సుగంధాలు... గంధపుచెట్ల చల్లని నీడలు... ఇవన్నీ కనిపించి వుండాలి.

గాంధీ మళ్ళీ ఈసారి సోఫా దగ్గరికి వచ్చాడు. దాన్ని చూడగానే పడుకోవాలనిపించింది. అతడు మరేమీ ఆలోచించకుండా అందులో సర్దుకుని పడుకుని కుడిచెయ్యి తలక్రింద పెట్టుకుని మళ్ళీ ఆవులించాడు. అంతలో అతని కళ్ళు మూతలు పడ్డాయి. మగతగా నిద్రపట్టింది... నిద్రలో ఆకళ్ళు అద్భుతమయిన ఆ కళ్ళు... సుభ్ర హిమాలయాలలో అక్కడక్కడ కరిగిన మంచు చెలమలవంటి ఆ కళ్లు కనిపించాయి.

ఎంతసేపు గడిచిందో తెలియదు. అతనికి అకస్మాత్తుగా మెలకువ వచ్చింది. కళ్లు తెరిచేసరికి చాలా దగ్గరలో నిలబడి వంగి అతని ముఖంలోకి చూస్తున్నదామె. అతని నుదటిమీద చెయ్యివుంచి చూస్తున్నది. ఆమె అతనికి కదిలితే తగిలేంత దగ్గరగా వుంది.

అతడు కళ్ళు తెరవడంతో నుదుటిమీదినుంచి చెయ్యితీసి కొంచెం దూరంగా జరిగి 'ఎంత సేపయింది వచ్చి?' అని అడిగింది.

అతడు లేవబోతూ 'ఇప్పుడే వచ్చాను. రెండు మూడుసార్లు పిలిచాను... మీరు పలకలేదు. ఏదో నీరసంగా వుంది...అలా కూర్చోగానే నిద్ర పట్టింది' అన్నాడు.

"భలేవాడివే...హడలగొట్టేశావు. పక్కయింటి ఆవిడ పిలిస్తే యిప్పుడే వచ్చేద్దాంకదా అని వెళ్లాను. ఆమె పావుగంటసేపు కబుర్లు వేసింది. వొచ్చి చూద్దును కదా? అట్లా పడుకునివుంటే భయం వేసింది. జ్వరంగాని లేదుకదా? అయినా ఎందుకలా ఉన్నావు?"

"ఏమీలేదు. చెప్పానుగా? కాస్త నీరసం అంతే. మరేంలేదు. రాజారాంగారు లేరా?"

"ఇందాకే క్యాంపు కెళ్లారు. రేపుగాని రారు. నీగొంతు మరీ నీరసంగా ఉంది. ఎప్పుడు తిన్నావో ఏమో! లేచి కాళ్ళుకడుక్కో భోజనం చేద్దువుగాని"

గాంధీ నెమ్మదిగా "మీకు శ్రమ..." అని నసిగాడు.

ఆమె "శ్రమాలేదు. ఏమీలేదు. అన్నయ్య ఊళ్ళోనే వుంటాడుకదా అని మామూలుగా వంటచేశాను. వాడు ఇందాకే హడావిడిగావచ్చి సామాన్లు సర్ధుకుని వెళ్ళిపోయాడు. ఊ! లే. లే" అంటూ లోపలికి వెళ్ళింది.

గాంధీ అలాగే నిర్లిప్తంగా సోఫాలో బాసిపట్టు వేసుకుని కూర్చున్నాడు. రేపు ఇంటర్వ్యూ ఆ విషయం అనుకుంటే ఏ మాత్రమూ ఉత్సాహంగాలేదు. పైగా చిరాకు కలుగుతున్నది. సాయంకాలం సచ్చిదానందమూర్తి కుర్చీలో కూర్చుని మాట్లాడుతూ వుండగా తనకు కనిపించిన విచిత్ర దృశ్యం గుర్తుకు వచ్చింది. తన కెందుకలా తోచింది? తన ఆలోచనలలో, మెదడులో ఎక్కడో తీవ్రమైన లోపం ఉండి వుండాలి. బహుశా ఆలోచన లెక్కువై తనకు పిచ్చెక్కుతున్నదేమో! అంతలో డాక్టరు మాటలు గుర్తుకు వచ్చాయి. "మనసును ఏ ఆలోచనలూ లేకుండా ప్రశాంతంగా ఉంచుకోండి..." అతడు తనలో తాను నవ్వుకున్నాడు.

ఆమె మళ్ళీ ముందుహాల్లోకి వచ్చింది. వస్తూనే "ఏమిటి, ఇంకా బుద్ధభగవానుడి పోజులో కూర్చుండిపోయావు. చాలా పొద్దుపోయింది" అన్నది.

గాంధీ వెంటనే లేచాడు. తూలి పడబోయి తమాయించుకుని ఆమె వెనక లోపలికి వెళ్ళాడు.

ఆమె ఎర్రని పలుచని చీరె కట్టుకుని వుంది. తెల్లని అతి తెల్లని జాకెట్టు వేసుకుని వుంది. తల చుట్ట చుట్టుకొని పిన్నులు పెట్టుకుని వుంది. మెడలో ఒంటిపేట గొలుసు మాత్రం ఉంది. చెతులకు గాజులు లేవు...

గాంధీ పెరట్లో అరుగు మీద సిద్ధంగా ఉన్న చెంబులో నీళ్ళు కాళ్ళ మీదపోసుకున్నాడు. ఆమె వంటగది గుమ్మంలో నిలబడి అందించిన టవల్‌ను 'ఎందుకండీ?' అంటూనే అందుకుని చేతులు మాత్రం తుడుచుకున్నాడు.

ఆమె టేబుల్ మీద అరిటాకు పరిచి సిద్ధంగా నిలబడి వుంది. గాంధీ వెళ్ళి కూర్చున్నాడు. ఆమె వడ్డన ప్రారంభించింది.

గాంధీ "అమ్మో! ఇన్ని తినాలా?" అన్నాడు.

"ఏమున్నాయి? మామూలేగా? అయినా నీ మొహం చూస్తేనే తెలుస్తున్నది ఇవాళ అసలు ఏమీ తినలేదని. నెమ్మదిగా కూర్చో...తొందర ఏమీలేదు..."

గాంధీ ఆమె కళ్ళలోకి చూశాడు. అతని కళ్ళు చెమర్చాయి...తల వంచుకుని అన్నం కలపడం ప్రారంభించాడు.

రెండు నిమిషాలు గడవగానే ఆమె దేని కోసమో పక్క గదిలోకి వెళ్ళింది.

గాంధీ కళ్ళార్పకుండా ఎదురుగా తెల్లని గోడ వంకనే కొద్దిక్షణాలు చూశాడు ఆగోడ మీద ఇందాకటి దృశ్యం...

అందమైన ఖరీదైన కుర్చీ... ఎదురుగా టీపాయి... దానిమీద పూలకుండీ... ఆ కుర్చీలో వికృతమైన నోటితో, పారపళ్లతో, వొంటి నిండా రోమాలతో రక్తనయనాలతో చేతులు విదిలిస్తూ కూర్చుని వున్న తోడేలు.

అతనికి నవ్వు వచ్చింది. పైకే నవ్వేశాడు.

ఆమె లోపలికి వస్తూ భ్రుకుటి ముడిచి "ఎందుకు నవ్వుతున్నావు?" అని అడిగింది. అతడు తడబడి అంతలోనే మళ్ళీ నవ్వు ముంచుకురాగా పెద్దగా నవ్వాడు. "ఏమిటయ్యా? చెప్పి నవ్వు..." అన్నదామె.

అతడు నవ్వుతూనే "అదే! ఆ వరండాలో..." అన్నాడు.

ఆమె ఆశ్చర్యంగా "ఏ వరండాలో!" అని అడిగింది.

"అదే... ఆయన పేరేమిటి? ఆం సచ్చిదానందమూర్తి...ఆ యింటి వరండాలో... ముందేమో పెద్ద కుక్క కనిపించింది. అది అరవదనుకోండి...ఆ తర్వాత ఏమో... అక్కడ నాలుగైదు కుర్చీలున్నాయిగా? అందులో మెత్తని దిండ్లు... ఒక కుర్చీలో... అంటూ అతను మళ్ళీ నవ్వడం సాగించాడు.

ఆమె అనుమానంగా చూస్తూ 'ఒక కుర్చీలో... ఎవరున్నారు?' అని అడిగింది.

అతడు నవ్వాపుకుని 'అదే... పెద్ద తోడేలు... నల్లటి భయంకరమైనతోడేలు కూర్చుని చేతులూపుతూ ఉపన్యాసిస్తున్నది. ఉండి ఉండి 'ఏవి ఉద్యోగాలు! ఎక్కడ ఉన్నాయి ఉద్యోగాలు? అంటూ తల పట్టుకుంటున్నది'. అన్నాడు.

ఆమె కంగారు పడ్డట్టున్నది. 'సరే, సరే-ముందు భోజనం కానివ్వు అన్నది. గాంధీ

తర్వాత ఏమీ మాట్లాడలేదు. తలవంచుకుని భోజనం ముగించాడు. తర్వాత పెరట్లోకి వెళ్ళి చెయ్యి కడుక్కుని ముందు హాల్లోకి వెళ్ళాడు.

ఆమె అతని వెనకనే వచ్చి 'కాసేపు విశ్రాంతిగా కూర్చో...మా నాన్నకు జావ యిచ్చి నేనూ నాలుగు మెతుకులు తిని వాస్తాను. అప్పుడు అతడలాగే సోఫాలో కూర్చున్నాడు. కడుపునిండా ఆకలి తీరడంతో సోఫాలో నుండి లేవబుద్ధి కావడం లేదు. అలాగే కూర్చుని కాస్సేపు అటూ యిటూ చూశాడు.

అంతలో 'ఫ్యాను వేసుకుంటే బాగుండు' ననుకున్నాడు. ఆ తర్వాత 'ఛ' ఇదేం మన సొంత యిల్లా? ఫ్యాను వేసుకుని, రేడియో పెట్టుకుని హాయిగా కూర్చునేందుకు అనుకున్నాడు.

కాస్సేపు నడుం వాలిస్తే బాగుండును. అనుకుని సోఫాలో పడుకున్నాడు. అంతలో ఆవులించి చిటికె వేశాడు. పైకి చూస్తూ గుండెల మీద చేతులు పెట్టుకొని వెల్లకిలా పడుకున్నాడు.

ఊరికే కళ్ళు ముసుకుందాం కొంచెం సేపు 'అనుకుని కళ్ళు మూసుకున్నాడు.

మూసిన కళ్ళముందు చీకటి...రెప్పలు గట్టిగా మూసుకుంటే గాఢమైన చీకటి–పైపైన మృదువుగా మూసుకుంటే ఎర్రని కాంతి... అతడు రెప్పల గట్టిగా మూసుకున్నాడు. చిక్కని చీకటిలో ఏదో అరుదైన వింత కాంతి. శూన్యంలో తెల్లగా మెరుస్తున్న మెట్లు...చాలా వున్నాయి. ఒక్కొక్క...మెట్టెక్కిపోతుంటే అంతులేనట్టున్నది...కాని అంతలోనే మెట్లు అయిపోయాయి. మెట్లు చివర ఎత్తుగా పెద్ద సింహాసనం...ఆ సింహాసనం మీద ఎవరది? నెత్తిమీద తళతళలాడే కిరీటంతో చిరునవ్వు వెన్నెలలు కురుపిస్తూ ఎవరది? చేతులు చాపి తనను ఆహ్వానిస్తున్నదెవరు? ఆ నర్సు...ఆమె పేరు కరుణా? సుగుణా? మృదులా? అహల్యా?...

అతడికి నిద్ర పట్టింది.

ఆమె వంట గదిలో తన పనులన్నీ పూర్తి చేసుకునే సరికి చాలా సేపు పట్టింది. ఆ తర్వాత తలుపులన్నీ వేసి ముందు హాల్లోకి వచ్చింది.

సోఫాలో పడుకుని నిద్రపోతున్నాడు గాంధీ. ఆమె అతని వంకని చూస్తూ ముందు తలుపు వేసింది. తర్వాత వెళ్ళి ఫ్యాన్ స్విచ్ నొక్కింది. ఫ్యాన్ మృదువుగా హాయిగా తిరగడం ప్రారంభించింది. చల్లని గాలి అలలు అలలుగా హాలంతా కలయదిరుగుతున్నది.

ఆమె కూనిరాగం తీస్తూ రేడియో బల్లముందు నిలబడి తలలో నుంచి పిన్నులు తీసి బల్ల మీద వుంచింది. పమిట తీసి విదిలించి మళ్ళీ వేసుకుంది. తర్వాత కూనిరాగం ఆపి అమాయకంగా నిద్రపోతున్న గాంధీ వంకనే చూస్తూ నిలబడిపోయింది. అతని గడ్డం కొంచెం మాసి వుంది. పెద్ద నుదుటిమీద గాలికి ముంగురులు కదులుతున్నాయి. అతడు నిద్రలో ఉన్నట్టుండి నవ్వాడు.

ఆమె అతనికి దగ్గరగా వచ్చి నిలబడి అతని మీదికి వంగింది. నెమ్మదిగా నిశ్శబ్దంగా నుదుటి మీద పెదవులు ఆనించింది.

గుండెల మీద బరువు పడటంతో గాంధీ ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు. ముందు అతడికేమీ అర్థం కాలేదు. తానెక్కడ ఉన్నాడో తెలియలేదు. తన గుండెల మీద మృదువైన బరువు – చెవి దగ్గర గుసగుస 'ఇక్కడ ఎంతసేపని పడుకుంటావు లేచి లోపల పడుకో' అని... మెడ క్రింది మెత్తటి చెయ్యి... ఎదురుగా తళతళ మెరిసే కళ్ళు... వెచ్చని ఊపిరి...

అతడు లేవబోయాడు. ఆమె కూడా లేచి లోపల పడుకుందువుగాని... పక్క సర్ది వస్తాను' అంటూ పక్క గదిలోకి వెళ్ళింది.

ఆ గదిలో లైటు వేసి మంచం కిటికీ పక్కకు లాగి కిటికి తలుపు మూసి పరుపు మీద దుప్పటీ దిండూ సర్ది మళ్ళీ హాల్లోకి వచ్చింది.

సోఫాలో గాంధీ లేడు... హాలులో ఎక్కడా లేడు. తలుపు తీసి వుంది. ఆమె త్వర త్వరగా వరండాలోకి వెళ్ళి చివరగా నిలబడి చూసింది, వీధి దీపం వెలుగులో మలుపు తిరిగిపోతూ కనిపించాడతను. విసవిస నడిచిపోతున్నాడు. ఆమె నిట్టూర్చి అక్కడే కొద్ది క్షణాలు నిలబడిపోయింది. ఎదురుగా ఆకాశంలో నక్షత్రాలు రెండు మూడు తళుకు మంటూ వెలుగుతున్నాయి. ప్రహరీ గోడ మీద ఎదో పిట్ట ఇంకా మేలుకొని వుండి సన్నగా సవ్వడి చేసింది.

◆ ◆ ◆ ◆ ◆ ◆

ఉదయం ఎనిమిది గంటలు దాటింది.

గదిలో కుడి వేపున కిటికీలో ఆనించబడి వున్న చిన్న అద్దం ముక్కలోకి చూస్తూ తల దువ్వుకుంటున్నాడు గాంధీ.

క్రిందటి రోజు ఉదయం వాకిట్లో పంపుదగ్గర కష్టపడి ఉతుక్కున్న పైజమా చొక్కా ధరించి వున్నాడు. పక్కనే ట్రంకు పెట్టె మీద సర్టిఫికెట్లున్న ఫైలు సిద్ధంగా వుంది.

జగన్నాధంగారు లోపలికి తొంగి చూసి"తయారవుతున్నావా? వెరీగుడ్-అన్నట్టు ఒకసారి యిటు వొచ్చిపో... కాస్త కాఫీ తాగుదువుగాని, అని పిలిచాడు.

గాంధీ తల దువ్వకోడం పూర్తి చేసి వరండాలోకి వచ్చాడు. జగన్నాధం అతన్ని చూసి 'కూర్చో అని పెద్దగా' శాంతా! కాఫీ కాస్త తొరగా పంపించు అని కేకవేశాడు.

మరు నిముషంలో పిల్లలిద్దరూ చెరొక కాఫీ గ్లాసు పట్టుకొని వచ్చారు.

గాంధీ కాఫీ చప్పరిస్తూ ఏదో చూస్తూ కూర్చున్నాడు.

జగన్నాధం పేపరు అవతల పడేసి కాఫ్ చేతిలోకి తీసుకుని "పరిస్థితి భయంకరంగా వున్నట్టుంది..." అన్నాడు.

గాంధీ ఉలిక్కిపడి "ఏమిటది?" అని అడిగాడు.

"అక్కడెక్కడో నార్త్‌లో ప్రయిమరీ స్కూలు టీచరు పోస్టులకు ఎడ్వర్టైజ్ చేస్తే ఎం.ఏ.లూ,పి. హెచ్.డి.లూ కూడా వచ్చారట..."

గాంధీ నవ్వాడు. "అదేమంత ఆశ్చర్యపడవలసిన విషయంకాదు. గ్రాడ్యుయేట్లూ, పోస్టు గ్రాడ్యుయేట్లూ ఇక్కడకూడా బజార్లలో ప్రతి షాపుచుట్టూ, ప్రతి హోటలు చుట్టూ తిరుగుతున్నారు. ఏదో ఒక చిన్న పని... ఎంత జీతమయినాసరే. యిప్పించమని ప్రాధేయపడుతూ.

కొద్దిక్షణాలాగి జగన్నాధం "నీ విషయంలో ఇవాళ నాకు గొప్ప హోప్ వుంది. ఈ సారి తప్పదు..." అన్నాడు.

గాంధీ ఆ మాటలు విని మ్లానంగా నవ్వాడు. అతనికి అంతలో ఆ యింటి వరండాలో టీపాయ్,ఎదురుగా కుర్చీలు, వాటిలో దిండ్లు...ఒక కుర్చీలో కూర్చుని ఉపన్యసిస్తున్న తోడేలు దృశ్యం గుర్తుకు వచ్చింది. మళ్ళీనవ్వు వచ్చింది.

అతడు లేచి"ఇక బయలుదేరుతాను. చాలాదూరం పోవాలి" అన్నాడు.

జగన్నాధంకూడా లేచి లోపలికి వెళ్ళివచ్చి "ఇదిగోవుంచు...బస్సులకు ఉంటుంది" అన్నాడు ఒక అయిదురూపాయలనోటు అందిస్తూ.

గాంధీ బిడియపడుతూనే దాన్ని అందుకుని "బస్సు చార్జీలకు ఇంత ఎందుకు" అన్నాడు నెమ్మదిగా.

ఆయన "బస్సుచార్జీలకేకాదు అక్కడ ఇంటర్వ్యూ ఆలస్యం అయితే హోటలు ఖర్చుకుకూడా. ఏమీ తినకుండా మాడకు. అన్నట్టు నువ్వీమధ్య తిండి మానేసి మాడటం ఎక్కువయింది" అన్నాడు.

గాంధీ కళ్ళు చెమర్చాయి. తానింకా చాలామందికంటె చాలా అదృష్టవంతుడు. నా అనుకోదగినవారెవరూ లేకపోయినా అభిమానించే పొరుగు ఉంది. మిగిలిన నిర్భాగ్యులను ఇళ్ళలో స్వంత తల్లీ తండ్రీ ఇతరులూ కూడబల్కున్నట్టు నిష్టూరాలాడి అవమానిస్తుంటారు. అక్కడికి ఉద్యోగం రాకపోవడం ఆ నిర్భాగ్యుడి తప్పయినట్టు.

అతడు తల మళ్ళీ దువ్వుకుని ఫైలు అందుకుని ఇవతలకి వచ్చాడు. పిల్లలిద్దరూ చాపమీద కూర్చుని చదువుకుంటున్నారు. అతడు జగన్నాధంగారితో "వస్తానండీ" అని చెప్పాడు అదోరకంగా నవ్వుతూ.

ఆయన "బి చియర్ ఫుల్, దిస్ టైం యు విల్ హిట్ ది బుల్స్ ఐ" అన్నాడు నవ్వుతూ.

గాంధీ కూడా హుషారుగా నవ్వుతూ ఆవరణదాటి రోడ్డుమీదికి వచ్చి నడవటం ప్రారంభించాడు. ఆకాశంలో తెల్లని మేఘాలు పచార్లు చేస్తున్నాయి. ఎండ బాగానే వుంది.

బస్స్టాపు చేరుకుని నిలబడ్డాడు. అప్పటికే ఆఫీసులకు పోయే జనాభా, ఆడామగా, స్కూళ్ళకు వెళ్ళే పిల్లలూ చాలామంది ఉన్నారక్కడ. ఆ చిన్న బస్స్టాప్ ఒక సంతలాగా, చిన్న సైజు మార్కెట్లాగా వుంది.

పది, పదిహేను నిమిషాలు గడిచాయి, రెండు మూడు బస్సులు వచ్చి వెళ్ళాయి. ఒకటి అసలు అక్కడ ఆగనేలేదు. "రివ్వు"న దుసుకుంటూ వెళ్ళిపోయింది.

ఈ లెక్కన మూడు బస్సులు మారి నగరం ఆ చివర ఎక్కడో విసిరినట్టున్న కాలేజీకి చేరుకోవాలంటే యాతన.

అతడు ఫైలు చంకలో ఉంచుకుని చేతివ్రేళ్ళు విరుచుకుని ఆకాశంలోకి చూశాడు. అక్కడ రెండు కళ్ళు కనిపించాయి...కరుణ వెదజల్లే అందాల కళ్ళు.

ఆమె ఎవరు? ఎక్కడ ఉంటుంది? ఆమె పేరేమిటి? ఆస్పత్రిలో కనుక్కుంటే ఆమె ఉద్యోగం వదిలి వెళ్ళిపోయిందన్నారు.

అంతలో మరో బస్సు వచ్చింది. అక్కడ ఆగిందికానీ దానిచుట్టూ బెల్లంముక్కమీదికి ఈగల వలె వాలిన అంత గుంపులోనూ ఇద్దరినో ముగ్గురినో మాత్రం ఎక్కించుకుని వెళ్ళిపోయింది.

'సరే తర్వాత స్టాపు వరకూ నడిచిపోదాం..' అనుకున్నాడతడు. అలా అనుకుని కూడా కొద్ది క్షణాల తర్వాత కాని కదలలేదు.

క్రమంగా నడక సాగించాడు. ఫుట్‌పాత్ మీద నడుస్తూ కలల్లోకి జారిపోయాడు.

"....తాను బస్సులో దూర ప్రయాణం చేస్తూంటాడు. రెండు మూడు సీట్ల ముందు ఒక అందమైన అమ్మాయి కూర్చుని వుంటుంది. అందాలబొమ్మ...రివ్వున వీచే గాలికి నుదుట వాలే ముంగురులను పలుచని వ్రేళ్ళతో పైకి తోసుకుంటూ కూర్చుని వుంటుంది. ప్రక్కన ఇంకెవరో ఉంటారు. ప్రయాణికులంతా ప్రశాంతంగా భరోసాతో హాయిగా కూర్చుని వుంటారు.

అంతలో బస్సు బ్రేకులు ఫెయిలవుతాయి. డ్రయివరు అది గమనించగానే ఎంతో కంగారు పడిపోతాడు. బాగా పల్లంగా వున్నరోడ్డు మీద బస్సు వేగంతో గాలిని చీల్చుకుని దూసుకు పోతూ వుంటుంది... ఆగే వీలులేదు... ఎదురుగా బళ్ళూ, గూడురిక్షాలు. అక్కడక్కడా మనుషులు, సైకిళ్ళు, మేకలు, దూడలూ, గేదెలూ, అన్నీ అప్పుడే అడ్డం వస్తాయి. డ్రయివరు పరిస్థితి ఘోరంగా ఉంటుంది. ఎప్పటిదో గుండె జబ్బు యిప్పుడు బయటపడి భరించరాని బాధతో అతడు మెలికలు తిరిగిపోతాడు. అప్పుడు తాను బస్సులో అందర్నీ తప్పించుకొని త్వరగా పరుగెత్తుకువెళ్ళి సీటులో నుంచి డ్రయివరును ఇవతలికి లాగి స్టీరింగు చేతిలోకి తీసుకుని నేర్పుగా నిపుణంగా బస్సును అన్ని అడ్డంకులూ దాటించి నడిపి ఒక ఎత్తయిన చెరువుకట్ట ఎక్కించి ఆపివేస్తాడు. ఈ లోపల జనం హాహాకారాలూ, ఆర్తనాదాలు చెలరేగాయి. బస్సొక జంగమ నరకంలా తయారైంది. బస్సు ఆగగానే అందరూ గుండెల మీద చేతులు వేసుకుని, 'అమ్మయ్య' అనుకుంటూ కుదుట పడతారు.

'అమ్మయ్య! బ్రతికి బైటపడ్డాం.'

'ఎవరో ఆ అబ్బాయి!'

'ఎవరైతేనేం? బంగారంలాంటి వాడు. ఇందరి ప్రాణాలు రక్షించాడు...'

అభినందనలు! అభినందనలు! అభినందనలు! ఆ అమ్మాయి కళ్ళలో గొప్ప ఆరాధన.

'అయ్యో మీ నుదుటి మీద దెబ్బ తగిలిందే! ఉండండి, కట్టు కడతాను!' అంటూ తన పమిటకొంగు 'పర్రున చించి తన నుదుట కట్టు కడుతుంది."

...గాంధీ వాస్తవంలోకి వచ్చాడు. ఇదుగో ఇదే బస్‌స్టాప్...మళ్ళీ ఇక్కడ మరొక మజిలీ... నిరీక్షణ..

అక్కడ కూడా బోలెడంతమంది బస్సులకోసం వేచివున్నారు! ఇంకా అదృష్టం... వర్షంలేదు అనుకుంటూ అతడు ఆకాశంలోకి చూశాడు. అంతలో అతనికి అనుమానం వేసింది. అంతవరకూ వెలిగిన సూర్యుడేమైనాడు? ఇంతలో ఈ బస్సు లెక్కడివి ? ఈ చల్లని గాలి ఎప్పుడు ప్రారంభమైంది?

ఈసారి గాంధీ బస్సు రాగానే కమ్మీ పట్టుకుని వ్రేలాడుతూ అందర్నీ తోసుకుని లోపలికి ఎక్కాడు. బస్సు కదలగానే లోపలిగుంపును ఛేదించుకుంటూ సహదేవుడిలాగా ముందుకు వెళ్ళిపోయాడు. అతని అదృష్టం పండి పక్కస్టాపులో దిగి పోయేందుకు ఒక వ్యక్తి లేవడంతో సీటు కూడా దొరికింది. అతడు సీటులో కుదురుగా కూర్చుని టిక్కెట్టు తీసుకుని,'ఆహా! ఏమి నా అదృష్టం! ఇవాళ ఇన్నేళ్ళ తర్వాత బస్సులో కూర్చునే యోగం

పట్టింది అనుకున్నాడు. ఆ తర్వాత కళ్ళు మూసుకుని మళ్ళీ కలలోకి జారిపోయాడు కొద్ది క్షణాలలో....

"....తాను బస్సు ప్రయాణం చేస్తుంటాడు. అదొక భయంకరమైన అరణ్య మార్గం... రాత్రివేళ... చిమ్మచీకటి... పిలిస్తే బదులు పలికే చిక్కని చీకటి... తాకితే చేతికి తగిలే ఘనీభవించిన చీకటి... గర్భదరిద్రుడి మనసులో గూడు కట్టుకున్న దిగులులాటి చీకటి... ఆకాశంలో నక్షత్రాలు కూడా లేవు. ఉండి ఉండి పక్కన చెట్ల గుబురులలోనుంచి జంతువుల భీకరమైన అరుపులు... 'రివ్వు'న దూసుకుపోతున్న బస్సులో పిల్లా పాపా, చిన్నా పెద్దా, ఆడామగా అందరూ నిశ్చింతగా నిద్రపోతున్నారు. హఠాత్తుగా బస్సు ఆగింది...తాను ఆ కుదుపుకు కళ్ళు విప్పి 'బస్సెందుకు ఆగిందా?' అని తొంగి చూశాడు. అంతేకాదు.ఎందుకైనా మంచిదని తన సూట్‌కేసులో ఉన్న రివాల్వరు ఇవతలికి తీసి చేతిరుమాలు క్రింద వొళ్ళో పెట్టుకుని కూర్చున్నాడు. బస్సుముందు ఏదో ఘర్షణ జరుగుతున్నది... ఆ ఘర్షణ అంతలో ముదిరింది. బస్సులో జనం ఏమీ తెలియక విస్తుపోతున్నారు... అంతలో ఒక కటువైన కంఠస్వరం మొరటుగా విన్పించింది. 'అందరూ దిగండి...త్వరగా'... ఒకడు లోపలికి ఎక్కాడు. వాడు భుజాల చుట్టూ నల్లని గుడ్డ కట్టుకుని ఉన్నాడు. నల్లగా వున్నాడు. మొహానికి నల్లని ముసుగు వేసుకుని వున్నాడు. నల్లని చీకటి విగ్రహం లాగున్నాడు. చేతిలో తుపాకీ పట్టుకుని వున్నాడు. 'అందరూ లేవండి' అని అరిచాడు. అందరూ వొణికిపోతూ లేచి దిగిపోయారు. వాడు చివరకు తనదగ్గరకువచ్చి 'ఏం? నీకు ప్రత్యేకంగా చెప్పాలా?' అన్నాడు తుపాకీ వూపుతూ.

'నాకు జ్వరం - లేవలేను' అన్నాడు తాను...వాడు నమ్మి 'జ్వరమా? అయితే నా చెయ్యి అందుకుని లేచిరా' అంటూ చెయి అందించాడు. తాను లేవలేనట్టు నటిస్తూ వాణ్ణి వంచి మెడ చుట్టూ చేయి వేసి దగ్గరగా లాక్కుని కుడిచేతిని వాడి పొట్టమీదికి తీసుకువెళ్ళి రివాల్వర్ ట్రిగ్గర్ నొక్కాడు. అంతే... సడీ చప్పుడు ఏమీ లేదు...తన రివాల్వర్‌కు సైలెన్సర్ ఉంది. వాడు అరవలేదు. మూలగనైనా లేదు. కళ్ళు మాత్రం పెద్దవి చేసుకుని చూశాడు. ఆ కళ్ళలోనుంచే వాడి ప్రాణం పోయింది. అలాగే తనమీదికి వొరిగిపోయాడు. వాణ్ణి సీటులోపక్కకు తోసి కిటికీలోనుంచి తొంగి చూశాడు. బైట బస్సు పక్కగా జనం వరసగా నిలబడి వున్నారు. వారిముందు చేతిలో తుపాకితో నిలబడి వున్నాడు నల్లని వాడొకడు...ఆ పక్కనే అంత చీకటిలోనూ, తెల్లగా కనిపిస్తున్నాయి రెండు గుర్రాలు. ఏపుగా బలంగా పెరిగిన ఎద్దుల్లాటి గుర్రాలు... అవి ఉండి ఉండి సకిలిస్తున్నాయి. క్రింద ఉన్నవాడు బస్సులో ఎక్కినవాన్ని ఉద్దేశించి 'ఏరా...ఇంకా దిగి రావేం!' అని అరిచాడు. తాను ఈ లోపల చచ్చిపోయినవాడి దుప్పటితీసి బుజాల చుట్టూ కప్పుకొని బస్సు దిగాడు. క్రింద ఉన్నవాడు మళ్ళీ తల తిప్పి ప్రయాణికులతో 'ఊ! మీ డబ్బు, దస్కమూ,నగానట్రా అంతా కింద పెట్టండి. ఒక్కొక్కళ్ళే... ఎవరైనా పిచ్చి పిచ్చి ప్రయత్నాలు చేశారో?తలలు పేలిపోతాయి'. అని దబాయించాడు పెద్దగా... ప్రయాణికులు అన్నీ వొలిచి యిచ్చేందుకు ఉద్యుక్తులవుతున్నారు. అంతలో తాను వాడి పక్కగా వెళ్ళి ఒక్క క్షణం నిలబడి ఉన్నట్టుండి మెరుపులాగా వాణ్ణి కాల్చిపారేశాడు. ఒకటి... రెండు...

మూడు... బుల్లెట్లు... వాడు ఆశ్చర్యంతో తెరిచిన నోరు అలాగే ఉండిపోయింది. వాడి నోట్లో నుంచే పోయింది ప్రాణం... తర్వాత 'దబ్బు'న నేలమీద పడిపోయాడు. మృత్యువు కడుపు నింపుకుని వెళ్ళిపోయింది. ప్రయాణికులంతా ఆనందం పట్టలేక సంభ్రమముగా తనను ఎత్తుకుని ఊరేగించినంతపని చేశారు... ఆ అమ్మాయి... ఆ అద్భుభతమైన కళ్ళు గల అమ్మాయి. తనను ఆరాధనాభావంతో చూసి అంతలో సిగ్గుపడింది. ఆ బస్సులో ప్రయాణం చేస్తున్న ఒక పెద్ద ఆఫీసరు తన ధైర్య సాహసాలకు మెచ్చి ఇన్ని ప్రాణాలు కాపాడినందుకు అభినందిస్తూ ఒక పెద్ద ఉద్యోగం ఇచ్చాడు. ఆ ఉద్యోగం ఏమిటి? తనకు ఎక్కడికి వెళ్ళేందుకైనా, ఏం చేసేందుకైనా హక్కు ఉంటుంది. సంఘ విద్రోహులనూ, రౌడీలనూ, సాధుజనులను హింసించే గూండాలను, పేదలను దోచుకునే పెద్ద మనుషులనూ, దొంగడబ్బు కూడబెట్టినవారిని, బ్లాక్ మార్కెట్‌దార్లను అందర్నీ పట్టుకుని జైల్లో పెట్టడం..తనకు ప్రతి సంవత్సరమూ బోలెడన్ని మెడల్స్... ఇంట్లో లెక్కలేనన్ని ఫోనులు, తలుచుకున్నప్పుడు ఎవరితోనయినా సరే నేరుగా డయల్ చేసి మాట్లాడే అధికారం...'

కండక్టరు పెట్టిన గావు కేకతో ఈ లోకంలోకి వచ్చాడు గాంధీ. తాను దిగవలసిన స్టాపు వచ్చింది. అతడు హడావిడిగా లేచి మనుషులను దూసుకుని క్రిందికి దిగి నిలబడ్డాడు.

ఇది నగరానికి మరో మూల.

అక్కడనుంచి నడక...రోడ్డుకు దూరంగా కనిపిస్తున్నది కాలేజీ- అన్నీ రేకుల షెడ్లు...కాలిదారి వెంట సుమారు రెండు ఫర్లాంగులు నడవాలి-

తనతోపాటే బస్సులోనుంచి దిగిన మరో యువకుడు కూడా తనతోపాటే నడుస్తున్నాడు. అతడు పొడుగ్గా పలుచగా వున్నాడు. పచ్చని ముఖమేఅయినా కమిలినట్టున్నది. అతడు గాంధీ వంక చూసి "ఇంటర్వ్యూకేనా?" అని అడిగాడు.

గాంధీ తల వూపాడు.

అతడు మళ్ళీ 'మనం ఆలస్యం అయినా మనుకుంటునాను" అన్నాడు.

గాంధీ నవ్వి "అలస్యమైతే కొంప మునగదులెండు-" అన్నాడు.

అతడు కూడా నవ్వి "అంతేలెండి- అంతా మాయ- వాళ్ళకు కావలిసిన వాళ్ళెవరో ముందే నిర్ణమైపోయి వుంటారు- ఇది కేవలం ఒక తంతు, మనల్ని తృప్తి పరిచేందుకు" అన్నాడు.

తర్వాత కూడా అతడు మాట్లాడుతూనే వున్నాడు. అతిని పేరు సత్యమూర్తి. చాలాదూరం నుంచి వచ్చాడు?వచ్చి సంవత్సరం అయింది. క్రిందటి సంవత్సరం ఒక కాలేజీ ఇంటర్వ్యూకు వచ్చినవాడు. మళ్ళీ తన వూరికి పోలేదు. తన స్వగ్రామంలో తల్లి ఒక్కటే ఉంటుంది. వయసు మళ్ళిన తల్లి - ఇంకెవరూ లేరు. ఆస్తిపాస్తులులేవు- ఏమన్నా వుంటే తన ఎం.ఎస్ .సి చదువుకు హరించుకుపోయాయి. అతడు రెండేళ్ళ పాటు రకరకాల ఇంటర్వ్యూలకు హాజరైనాడు. గత సంవత్సరం ఇక్కడికి ఎంతో ఆశతో వచ్చాడు. ఉద్యోగం లేకుండా తిరిగి వెళ్ళేందుకు మనసొప్పలేదు. ఉద్యోగం రాకపోయినా తనకు ఉద్యోగం దొరికిందనీ త్వరలోనే తల్లిని కూడా ఇక్కడికి తీసుకొస్తాననీ ఉత్తరం

వ్రాసాడు. ఆమె నమ్మింది. మాటిమాటికి ఉత్తరాలు వ్రాస్తుంది. తనను ఎప్పుడు తీసుకుపోతావని అడుగుతూ తనకోసం అప్పుడే ఒక సంబంధం కూడా చూసిందట.

ఈ మాటలు చెబుతూ అతడు నవ్వాడు.

గాంధీ కదిలిపోయాడు. "మరి మీరిప్పుడు ఏం చేస్తున్నారు?" అని అడిగాడు.

"హోటల్లో పని చేస్తున్నాను..." అన్నాడతడు పొడిగా.

గాంధీకి తల తిరిగినట్టయింది.

కాలేజీ వరండాలో, ఆవరణలో రకరకాల వ్యక్తులు వేచి వున్నారు. కొందరు సూట్లు ధరించీ మరికొందరు మామూలు దుస్తులలోనూ ఉన్నారు. ఉన్న ఒక వేకెన్సీకి యాభైరెండు మంది అభ్యర్థులు వచ్చారు.

ఆ కాలేజీ ఆవరణలోనే ఒక మూలగా చిన్న క్యాంటీన్ ఉంది. సత్యమూర్తి గాంధీతో "నాటకం యిప్పట్లో ప్రారంభమయ్యేటట్లులేదు. వెళ్ళి కాఫీతాగి వద్దాంరండి" అన్నాడు.

ఇద్దరూ నెమ్మదిగా నడిచి క్యాంటిన్‌కు చేరుకున్నారు. అక్కడ ఇలాటి వారే మరో పదిమంది వరకూ ఉన్నారు. అప్పటికి సన్నగా తుంపర పడడం మొదలైంది. అది చూస్తూవుండగానే పెద్ద వర్షంగా మారి నిలిచి కురవడం ప్రారంభించింది.

"ఏమిటీ వర్షం- శనిలాగా పట్టుకుందే" అన్నారెవరో...

సత్యమూర్తి లోపలికి వెళ్ళి రెండు కప్పులతో కాఫీ పట్టుకొచ్చి "మీరేమైనా తింటారా? అక్కడ ఎప్పుడు చేసిందోగాని ఉప్మా ఉంది మరి-" అన్నాడు.

గాంధీ నొచ్చుకుంటూ "అరె!మీరు తెచ్చారా కాఫీ? భలేవారె?" అంటూ కప్పు అందుకుని 'ఏమీ తినను-ఆకలి చచ్చిపోయింది...' అన్నాడు.

ఇద్దరూ పాకపై నుంచి చూరుమీదుగా పడుతున్న నీటిధార వంక చూస్తూ నిలబడ్డారు.

ఆ తర్వాత మరో పావుగంటసేపు వర్షం వెలిసే వరకూ ఉండి ఇవతలికి వచ్చారు.

అప్పటికి కాలేజీ ఆఫీసు దగ్గర రంగం సిద్ధం అయిందికాబోలు ఇంటర్వ్యూలు ప్రారంభమయ్యాయి. ప్యూన్ ఒకడు ఎక్కడలేని హుందాతనం ప్రదర్శిస్తూ కర్టెన్ తొలగించుకుని ఇవతలికి వచ్చి అభ్యర్థులను ఒక్కొక్కరినే ఏకవచనంలో పిలుస్తున్నాడు.

ఒక్కొక్కరు లోపలికి వెళ్ళి రెండు మూడు నిమిషాలలోనే ఇవతలికి వస్తున్నారు. డీలాపడిపోయి.

సత్యమూర్తి అంతలో వచ్చి వరండాలో స్తంభానికానుకుని కూర్చున్న గాంధీతో నెమ్మదిగా "అంతా తెలుసుకుని వచ్చాను బ్రదర్! కాలేజీ అభివృద్ధికి పాతిక వేలు విరాళం యిస్తానన్న ఒకానొక పెద్ద మనిషి బ్రదరిన్లాకు యిది ఖాయమైపోయిందట" అన్నాడు.

గాంధీ 'ఇలాటివన్నీ మామూలే' అన్నట్టు నవ్వి ఊరుకున్నాడు. ఏమీ మాట్లాడలేదు.

పన్నెండు గంటలవేళ సత్యమూర్తికి పిలుపు వచ్చింది. అతడు గాంధీ వంక ఒకసారి చూసి నవ్వుతూ లేచి 'వెళ్ళొస్తాను' అన్నాడు.

అతడు రెండు నిమిషాల్లోనే తిరిగి వచ్చాడు. అతని ముఖం జేవురించుకుని వుంది.

గాంధీ 'ఏం జరిగింది' అని అడిగాడు.

అతని ముఖం కందగడ్డలా చేసుకుని బాధపడుతూ 'ఏమిలేదు ఇంటర్వ్యూ చేస్తున్న పెద్దమనుషులలో ఒకాయన మా హోటల్‌కు రెగ్యులర్ కస్టమర్. నన్ను చూసి కళ్లు పెద్దవి చేసి 'నువ్వా?' అన్నాడు. తర్వాత పక్క వాళ్ళ చెవుల్లో గుసగుసలాడాడు. అదేదో గొప్ప జోక్ అయినట్టు అన్నాడు.

గాంధీ మనసు చివుక్కుమన్నది. అతడు సత్యమూర్తి భుజంమీద చెయ్యివేసి, 'బాధపడకండి–' అన్నాడు. ఇంకా ఏవో చెప్పాలనీ, అతన్ని ఓదార్చాలనీ అనిపించింది. కాని ఎందుకో ఏమీ మాట్లాడకుండా ఊరుకున్నాడు.

మరో పావు గంటలో ప్యూన్ ఇవతలికి వచ్చి 'గాంధీ– గాంధీ' అని అరిచాడు.

గాంధీ లేచి లోపలికి వెళ్ళాడు.

ఎదురుగా, పెద్దబల్ల–దాని మీద ఆకుపచ్చని మెత్తని గుడ్డ– తళతళ లాడే అద్దం–ఆఫీసు సామాగ్రి...పక్కన ఎర్రని ఫోను– గోడలకు ఏవేవో ఫోటోలు.

బల్ల చుట్టూ అయిదుగురు ఖరీదైన మనుషులు– వారిలో మధ్యగా రివాల్వింగ్ కుర్చీలో సచ్చిదానందమూర్తి...ప్రపంచంలో ఉన్న హుందాతనం ఠీవి అంతా ముద్దచేసి కూర్చోబెట్టినట్టు.

ఆయన తలఎత్తకుండా ఏవో కాగితాలు చూస్తున్నాడు. మిగిలిన వారిలో యిద్దరు తమలో తాము ఏదో వేరే విషయం మాట్లాడుకుంటున్నారు. ఒకాయన మొన్నటి నిన్నటి విషయం ఏదో గుర్తుకువచ్చి కాబోలు అనవసరంగా నవ్వుతున్నారు.

ఒకాయన గాంధీ వంక చూసి కూర్చోమని అతని అప్లికేషను తీసి చూస్తూ అబ్బో! నాలుగేళ్ళయిందే పాసై - ఇంతకుముందు ఎక్కడైనా పని చేశావా? ఐమీన్ టీచింగ్ అనుభవం ఉందా? అని అడిగాడు.

గాంధీ 'లేదండీ ఎక్కడా పని చేయలేదు' అని చెప్పాడు.

ఆయన మరి కాస్సేపు తన అప్లికేషన్, సర్టిఫికెట్ ట్రూ కాపీలు. టెస్టిమోనియల్స్ అన్నీ తిరగేసి దాన్ని బల్లమీద ఉంచి ఆవులించి 'సరే– తర్వాత తెలియజేస్తాము. వెళ్ళిరండి–' అన్నాడు.

గాంధీ నిశ్శబ్దంగా లేచి ఫైలు అందుకుని ఇవతలికి వచ్చేశాడు. సత్యమూర్తి వరండాలో అతని కెదురై'పోదామా' అన్నాడు.

గాంధీ నవ్వి 'పోక?ఇంకెందుకిక్కడ?' అంటూ నడిచాడు.

కాలిబాట అప్పుడే కురిసిన వర్షానికి జారుతున్నది. జాగ్రత్తగా నెమ్మదిగా నడుస్తున్నరిద్దరూ.

సత్యమూర్తి ఉన్నట్టుండి 'అన్నట్టు. ఏదో సంఘం పెట్టారటకదా? పేపర్లో చదివాను... నిరుద్యోగ విద్యావంతుల సంఘం–' అన్నాడు.

గాంధీ 'అవును' అని నెల్సన్ యింటి గుర్తులూ, త్వరలో ఊరేగింపుగా వెళ్ళి మంత్రిగారికి మెమోరాండం యివ్వాలని నిర్ణయించుకోడం వగైరా వివరాలు తెలియజేశాడు.

సత్యమూర్తి గంభీరంగా 'అవును– ఏదో ఒకటి చేయాలి. అలా యిలా కాదు... గట్టిగా చేయాలి. లేకపోతే మన గతి యింతే...' అన్నాడు.

గాంధీ ఏమీ మాట్లాడలేదు. మనసంతా అర్థంలేని ఆలోచనలతో సతమతమై పోతున్నది. అతనికి డాక్టరు చెప్పిన మాట గుర్తుకు వచ్చింది. 'అనవసరమైన ఆలోచనలు మనసులోకి రానివ్వకు... ప్రశాంతంగా ఉండు...'

అంతలో అతని కాలి చెప్పు తెగింది-

నెల్సన్ సిగరెట్టు వెలిగించుకుని నిన్నంతా 'కనిపించలేదేం'? అని అడిగాడు.

గాంధీ రెండు చేతులతో కళ్ళునులుముకుంటూ "లేను- ఇంటర్వ్యూకదా? పొద్దున ఎనిమిది గంటలకు బయలుదేరి వెడితే తిరిగి వచ్చేసరికి బాగా అలిసిపోయానూ, విసిగిపోయాను. రూముకు పోయి నిద్రపోయాను" అన్నాడు.

నెల్సన్ 'ఎలా జరిగింది ఇంటర్వ్యూ?' అని అడిగాడు.

వసంతన్ టీ పట్టుకొచ్చి బల్లమీద ఉంచాడు. కప్పు అందుకుని ఒక్క గుటకవేసి చప్పరించి 'ఎలా వుంటుంది? అంతా మామూలే-పనికిమాలిన డ్రామా-నీకు తెలియనిదేముంది?' అన్నాడు గాంధీ.

నెల్సన్ ఉద్రేకంతో ఊగిపోయాడు.

'అందుకే... అందుకే... మనం ఇక సహించకూడదంటున్నాను. ఎదురుతిరిగి పోరాడితే తప్పు ఏమీ కాదు. అడగనిదే అమ్మయినా పెట్టదంటారు. ఏమీ చెయ్యకపోతే మన బ్రతుకులింతే. మనం చాలా తెలివిగల వాళ్ళమనీ గొప్పవాళ్ళమనీ పిచ్చి భేషజాలు వొదిలెయ్యాలి ముందు. కూలీల కంటే కష్టజీవులకంటె గొప్పవాళ్ళమనే పనికిమాలిన కాంప్లెక్సు వొదులుకోవాలి. మనమూ రోడ్లమీద పడాలి.

ఈ మాటలని నెల్సన్ గాంధీకి ఒక కాగితం అందించాడు. అందులో చక్కని దస్తూరీతో ఎనభై పేరులు వ్రాసి వున్నాయి.

'వీళ్లందరూ మన సభ్యులు. మన తోటే ఉంటారు. తాడోపేడో తేల్చుకోడానికీ, రోడ్డు మీద పడటానికీ వీళ్ళందరూ సిద్ధం...అన్నట్టు ఎల్లుండే ఊరేగింపు అంతా ఫిక్స్ అయిపోయింది. ప్లెకార్డులు తయారవుతున్నాయి-వరప్రసాద్ అదంతా చూస్తున్నాడు'

'ఎక్కడ'? అడిగాడు గాంధీ.

'ఇంకెక్కడ? మా యింట్లోనే-వసారాలో, వస్తావా,పోదాం?'

గాంధీ తలవూపి "పోదాంపద" అన్నాడు టీ తాగడం ముగించి లేస్తూ.

ఇద్దరూ బైటికి వచ్చారు. నిశ్శబ్దంగా రోడ్డుమీద నడక సాగించారు.

నెల్సన్ ఏమీ మాట్లాడటంలేదు. కాని గాంధీకి అర్థమవుతూనేవుంది. అతను లోపల్లోపల ఉడికిపోతున్నాడు. సిగరెట్ పట్టుకున్న అతని వ్రేళ్ళు కొద్దిగా వొణుకుతున్నాయి.

గాంధీ నడుస్తూనే అతని చేయి అందుకుని నొక్కి "అనవసరంగా కంగారు పడకు... అంతా అనుకున్నట్లే జరుగుతుంది..." అన్నాడు.

నెల్సన్ సిగరెట్ విసిరేసి "కంగారేమీ లేదు..." అన్నాడు.

ఇద్దరూ మరో పది నిమిషాలు నిశ్శబ్దంగా నడిచి నెల్సన్ యింటికి చేరుకున్నారు.

అదొక పెద్ద బంగళా పెంకుల యిల్లు. నాలుగువైపులా, వసారాలున్నాయి. ఒకవైపు వసారాలో వరప్రసాద్, మరి అయిదారుగురు యువకులు హడావిడిగా వున్నారు.

వారిలో సత్యమూర్తికూడా ఉన్నాడు. అతడు గాంధీని చూసి పలకరిస్తూ నవ్వాడు. వారందరూ నేలమీద కూర్చుని అట్టలమీద నినాదాలు వ్రాస్తున్నారు. ఇద్దరు ముగ్గురు ఆ అట్టలను పలుచని వెదురు బద్దలకు మేకులతో బిగిస్తున్నారు. తయారైన ప్లేకార్డులు గుట్టగా ఒక పక్కన పడివున్నాయి.

వరప్రసాద్ వీరిద్దరినీ చూసి నుదుట పట్టిన చెమట తుడుచుకుంటూ "అన్నట్టు ఎవరో వచ్చారు. వాకిట్లో ఉంటారు చూడండి..." అన్నాడు.

నెల్సన్ "ఎవరబ్బా?" అనుకుంటూ బైటికి వెళ్ళాడు.

గాంధీ ఒక్కొక్క అట్టనే యివతలికి తీసి చూశాడు. పెద్ద పెద్ద అక్షరాలతో నినాదాలు వ్రాసివున్నాయి. సిరాలో ఏదో పుల్లముంచి వ్రాస్తున్నారు.

"నిరుద్యోగ విద్యావంతుల సంఘం వర్ధిల్లాలి"

అది చదవగానే గాంధీకి నవ్వు వచ్చింది. ఇదేమి నినాదం

"నిరుద్యోగ పిశాచిని మట్టుపెట్టాలి"

"ప్రభుత్వం కళ్ళు తెరవాలి".

"ఇంతకాలం సహించాం- ఇక సహించేది లేదు."

"ఉద్యోగాలు చూపండి- లేదా గద్దె దిగండి."

"ఉద్యోగాలివ్వడంలో అవినీతి నశించాలి."

"ఉద్యోగాల పేరుతో వ్యాపారంచేసే వారిని శిక్షించాలి."

"పనిహక్కు-మా జన్మహక్కు".

ఇవీ, ఇంకా ఇలాటివీ చాలా వున్నాయి నినాదాలు.

రెండు నిమిషాల తర్వాత నెల్సన్ వచ్చాడు. అతని ముఖం గంభీరంగా వుంది.

"ఎవరది?" అని అడిగాడు గాంధీ.

మిగిలినవారు ఉత్కంఠతో చూశారు.

నెల్సన్ కూర్చున్నాడు. "పోలీసులు... ఈ విషయాలు తెలిశాయట.... పేపర్ల ద్వారా... ఊరేగింపు జరపదలుచుకుంటే పర్మిషన్ తీసుకోవాలనీ, ఊరేగింపు వెళ్ళేరూటు ముందుగా స్పెసిపై చెయ్యాలనీ చెప్పారు... అది చాలా సింపుల్ ఫార్మాలిటీ అని కూడా చెప్పారు..."

గాంధీ నిట్టూర్చాడు. "అవును. అది చాలా మామూలు ఫార్మాలిటీ కాయితం రాసిపెట్టుకుంటే పర్మిషన్ యిస్తారు..."అన్నాడు.

ఇద్దరూ చెరి ఒక అప్లికేషన్ తయారుచేశారు. నెల్సన్ దాన్ని శుభ్రంగా వ్రాసి "సైకిల్ తీసుకొస్తాను. ఇద్దరం వెళ్ళి వద్దాం" అన్నాడు.

గాంధీ"సరే"నన్నాడు.

పదినిమిషాలలో పోలీసు ఆఫీసుకు చేరుకున్నారు. నెల్సన్ ఒక చీటీ మీద తమ పేర్లు వ్రాసి ఫ్యూన్ చేత లోపలికి పంపించాడు.

ఆ ఫ్యూన్ రెండు నిమిషాల్లో వచ్చి "దొరగారు లోపల మాట్లాడుతున్నారు. కాస్సేపు కూర్చోండి..." అని చెప్పాడు. ఇద్దరూ అక్కడ బల్లమీద కూర్చున్నారు.

ఆ హాల్లో ఎవరెవరో అటూఇటూ తిరుగుతున్నారు.

అంతటా నిశ్శబ్దంగా ఉంది. గోడమీద గుమ్మానికి పైగా గాంధీజీ ఫోటో ఒకటి వ్రేలాడుతున్నది. నగరం మ్యాపు ఒకటి – పెద్దది –ఉంది మరో పక్క.

అయిదు నిమిషాలు గడిచాక ప్యూన్ వచ్చి "దొరగారు రమ్మంటున్నారు" అన్నాడు. అలా అని తలుపు తెరిచాడు.

ఇద్దరూ లోపలికి వెళ్ళారు.

గదిలో చల్లగా ఉంది. పెద్ద బల్లకు అటువైపు రివాల్వింగ్ కుర్చీలో కూర్చుని ఏదో ఫైలు తిరగవేస్తున్నాడాయన. మనిషి లావుగా బలంగా ఉన్నాడు. నడివయసు దాటి వుంటుంది. కొద్దిగా బట్టతల వస్తున్నది. టోపీ బల్లమీద ఒక పక్కగా వుంది.

ఆయన ఫైల్లోకి చూస్తూనే వారు రావడం గ్రహించిన వాడిలా తలవూపి "కూర్చోండి" అన్నాడు. ఆ కంఠం బరువుగావుంది. ఇద్దరూ కూర్చున్నారు.

ఆయన అంతలో బెల్ మోగించి ప్యూన్ రాగానే ఫైలు అతనికి అందించి "లోపలయివ్వు" అన్నాడు.

తర్వాత అరచేతులతో కళ్ళు నులుముకుని అలసిపోయినవాడిలా కుర్చీలో వెనక్కువాలి వారి వంక చూశాడు.

"ఆ ! చెప్పండి...ఏమిటి సంగతి?"

నెల్సన్ నెమ్మదిగా "మేము ఒక ప్రొసెషన్ తియ్యాలనుకుంటున్నాము సార్! ఎల్లుండి సాయంకాలం... అయిదు గంటలకు... ఊరేగింపుగా వెళ్ళి మినిష్టర్ గారికి మెమోరాండం ఇవ్వాలని..." అన్నాడు.

ఆయన చెయ్యిఎత్తి "ఆగండాగండి... మీలో నెల్సన్ ఎవరు? మీరేనా?

ఎడ్యుకేటెడ్ అన్ ఎంప్లాయిడ్ యూనియన్...రైట్... పేపర్లో రాగానే మా వాళ్ళు వివరాలు కనుక్కున్నారు... దానికేం? దివ్యంగా ఊరేగింపు జరుపుకోండి... ఎన్నివేలమంది ఉంటారు ఊరేగింపులో?" అని అడిగాడు.

"ఎన్నివేలా?" అని ముందు ఆశ్చర్యపోయి తర్వాత నవ్వాడు నెల్సన్. "అబ్బే! నలభైయాభై మందికి మించి ఉండరండి."

ఆయన "రైట్...అలాగే..." అంటూ ఆ అప్లికేషన్ అందుకుని చూశాడు. తర్వాత "బాగుంది" అన్నాడు.

మళ్ళీ అంతలోనే ముందుకు వంగి"మీరందరూ బాగా చదువుకున్నవాళ్ళు... మీకు వేరే చెప్పనక్కరలేదు. ఊరేగింపు. ప్రదర్శన చాలా ప్రశాంతంగా వెళ్ళి పోవాలి... ఎక్కడా అల్లరీ ఆగడమూ పనికిరాదు. ఆ విషయం గుర్తుంచుకోండి... అన్నాడు.

"చాలా ప్రశాంతంగా జరుగుతుంది సార్! అందరూ చదువుకున్నవాళ్ళే... గ్రాడ్యుయేట్లు... పోస్టు గ్రాడ్యుయేట్లు అందరూ... ఏదో ఖర్మం చాలక మా బాధలు పట్టించుకునే నాథుడు లేక ఇలా రోడ్లమీద పడుతున్నాం..." అన్నాడు. నెల్సన్ బాధపడుతున్నవాడిలా.

"ఎవరి బాధలు వారివి" అంటూ చప్పరించాడాయన.

"ఈ నిరుద్యోగం అనేది చాలా ఘోరం..దుర్భరం సార్... కష్టపడి చదువుకున్నాం... ఫస్టుక్లాసులో పాసయ్యాం... ఏళ్ళ తరబడి ఉద్యోగాల్లేక పోతే ఎలా బ్రతకాలిసార్? మేము ఎంత బాధపడుతున్నామో..."

"ఆల్‌రైట్... ఆల్‌రైట్"అన్నాడాయన ఇకవినడం యిష్టం లేనట్టు.

"ఇకవెళ్ళిరండి... కాని నేను చెప్పింది మాత్రం బాగా గుర్తుంచుకోండి...ఏ విధమైన గొడవా జరగకూడదు..."

"జరగదుసార్."

ఆయన ఉన్నట్టుండి వ్రేళ్ళు విరుచుకుంటూ "అంత గట్టిగా నమ్మకంగా చెప్పకుబాబూ! మేమిలాంటివి ఎన్నో చూశాము, వీటితో తల పండిపోయింది. మీరేం గొడవచెయ్యరు. చెయ్యాలని మీకు ఉండదు. కాని కొన్ని యాంటీసోషల్ ఎలిమెంట్స్‌కు ఇలాంటివి చక్కని అవకాశాలు... వాళ్ళు మీలో దూరి మిమ్మల్ని ఎక్జయిట్ చేస్తారు. ఉన్నట్టుండి ఎక్కడినుంచో రాళ్ళు పడతాయి! పరిస్థితి మీచేతులు దాటిపోతుంది. అదుపు తప్పుతుంది. అప్పుడు మా చావుకొచ్చి పడుతుంది... ఎనీ హౌ, వెళ్ళిరండి... విష్ యు ఆల్ ది బెస్ట్..." అన్నాడు.

ఆయనకు "థ్యాంక్స్" చెప్పి యిద్దరూ యివతలికి వచ్చారు.

రోడ్డుమీదికి వచ్చి సైకిలు తాళం తీస్తూ నెల్సన్ ఆనందంగా"ఇంత తేలికగా ఈ పని అవుతుందనుకోలేదు. ఆయన చాలా మంచివాడిలాగున్నాడు...." అన్నాడు.

గాంధీ జాలిగా నిట్టూర్చి "అవును, తేలికగానే అయింది" అని మాత్రం అని వూరుకున్నాడు.

"...కాకపోయేందుకు ఇందులో ఏముంది?నువ్వు అనుమతి అర్థించింది దేనికి? ప్రశాంతంగా మామూలు ఊరేగింపు నిర్వహించుకోవడానికి. దానికి నీకు స్వేచ్ఛ ఉంది. నీ ఊరేగింపును పోలీసులు వెంట ఉండి చాలా ప్రశాంతంగా జయప్రదంగా ముగిసేట్టు చూస్తారుకూడా. నువ్వు ఊరేగటానికీ, గొంతుచించుకుని జయజయధ్వానాలు చేసుకోవడానికీ! నినాదాలివ్వడానికీ, మహాజర్లివ్వడానికి చివరకు రోడ్డుమీద ఎగరడానికీ తందనాలాడేందుకు కూడా అనుమతి యిస్తారు. కాని చెప్పాడుగా? అంతా అతి ప్రశాంతంగా జరిగిపోవాలి... నీ కోర్కెలు తీరడం తీరకపోవడం వేరే సంగతి...నువ్వు గొప్పగా ఊరేగింపు నిర్వహించానని బోలెడు ఆనంద పడిపోవచ్చు. అందుకు కావలసిన ఏర్పాట్లన్నీ పుష్కలంగా పకడ్బందీగా చేస్తారు... కాని అంతా ప్రశాంతంగా...అత్యంత శాంతియుతంగా జరిగిపోవాలి దానికి భిన్నంగా చిన్న రభస, చిన్న గొడవ అయిందనుకో అప్పుడు తెలుస్తుంది... ఎవరి మంచితనం ఎటువంటిదో..." అనుకున్నాడు గాంధీ.

నెల్సన్ మాత్రం హుషారుగా ఈలవేసుకుంటూ సైకిలు తొక్కాడు. అతనికి అంతమాత్రానికే కొండెక్కినంత సంతోషంగా ఉంది.

ఇంటికి వెళ్ళగానే - అంతకుముందు అక్కడున్న అయిదారుగురుకాక మరి కొంతమంది చేరుకున్నారక్కడికి - అందరూ వీరిని చుట్టుముట్టి ఆదుర్దాగా "ఏమయింది? ఏమయింది?" అని అడిగారు.

నెల్సన్ హుషారుగా "అప్లికేషన్ ఇచ్చాము. 'సరే' అన్నారు" అని చెప్పాడు.

"అయితే ప్రదర్శన మాత్రం చాలా ప్రశాంతంగా జరగాలి... ఎక్కడా ఏ గొడవా జరగకూడదు... అలా అని గట్టిగా హెచ్చరించారు" అన్నాడు గాంధీ నెమ్మదిగా.

అందరూ తేలికగా నిట్టూర్చారు.

"మనం ఎవర్నయినా కొడుతున్నామా? చంపుతున్నామా? అల్లరెందుకవుతుంది? మనం అల్లరెందుకు చేస్తాం?"

"మనల్ని రౌడీమూక అనుకున్నారేమో కొంపదీసి..."

"ఏమీ చేతకాని చవట నిరుద్యోగులం. రైడీతనం, జులుం, అల్లరిచెయ్యటం, చేతనయితే ఎలాగో ఒకలాగ బ్రతక గలిగేవాళ్ళం ఈపాట్లు తప్పేవి..."

గాంధీకి ఆ చివరి మాట నచ్చింది. ఆమాటలన్నదెవరా అని చూశాడు. అతనిపేరు శ్యామసుందర్. సన్నగా బక్కపలచగా పచ్చగా, ఉంటాడు. కళ్ళకు సన్నని ఫ్రేమున్న జోడు. సన్నని ముక్కుమీదికి జారుతూ వుంటుందెప్పుడూ? దాన్ని మాటిమాటికి చూపుడు వ్రేలితో పైకి నెట్టుకుంటూ వుంటాడు. మాత్స్ ఎం.ఎస్.సి. చాలా తెలివిగలవాడు. గోల్డు మెడలిస్టు.

గాంధీ కాస్సేపు అక్కడే కూర్చున్నాడు. మిగిలిన అందరూ ఏదో ఒక పని చేస్తూ హడావిడిగా వుంటే తాను ఊరికే కూర్చోవడం నేరమనిపించి వెదురుబద్దలు అందుకున్నాడు.

అంతలోనే నెల్సన్ అతని దగ్గరకు వచ్చి "ఆపని మీకొద్దులే...ఇలారా...ఆ గదిలో కూర్చుందాం... మనం మెమోరాండం తయారుచేద్దాం..." అని పిలుచుకుపోయాడు.

ఇద్దరూ తీరికగా కూర్చుని మంత్రిగారి కివ్వవలసిన మహజరు తయారుచేశారు. అతి శ్రద్ధగా అతి నిపుణంగా మాటలు ఏరికూర్చి రెండు పేజీల మహజరు తయారుచేశారు. తమలోతాము చదువుకుని తృప్తి చెందారు. అప్పుడు అవతల వసారాలోకి వచ్చారు. అప్పటికి పని ముగించుకుని కూర్చునివున్న మిగిలినవారినందరినీ చేర్చి దానిని చదివి వినిపించారు.

అందరూ 'భేష్...బాగుంద'న్నారు.

శ్యామసుందర్ మాత్రం ఒక క్షణం ఆగి చప్పరించి 'ప్చ్..బొత్తిగా చప్పగా ఉంది...' అన్నాడు.

'అంటే'?

అతడు వ్రేళ్ళు విరుచుకుని అసంతృప్తిగా 'అంటే...ఏమీలేదు...అందులో 'ఫైర్ తక్కువయిందని నా అభిప్రాయం...' అన్నాడు.

'ఫైర్ అంటే?'

'అంటేనా? మహజరునిండా అంత వినయమూ మృదుత్వమూ వొలకబోయ నక్కరలేదు. గట్టి మాటలు పడాలి..మన కోర్కెలు నెరవేరకపోతే దుష్పరిణామాలు సంభవిస్తాయనీ అప్పుడు మనం వాటికి బాధ్యులం కామనీ ప్రభుత్వమే బాధ్యత వహించవలసి వుంటుందనీ గట్టి హెచ్చరిక ఉండాలి.

కొందరు భయంభయంగా చూశారు. నెల్సన్ గాంధీ వంక చూశాడు.

"అవును... ఆయన చెప్పిందీ నిజమే..కాని అది యిప్పుడేకాదు... ఇప్పుడే అంత గట్టి పద్ధతులు అవలంబించకూడదు... రియాక్షన్ కోసం వెయిట్ చెయ్యాలి. కాని ఒక్కటి మాత్రం నిజం... మనం ప్రారంభించింది మామూలు ఉద్యమంకాదు. మనకు హంగులూ ఆర్భాటాలూ మందీ మార్బలమూ ఇప్పుడేమీలేవు. ఈ ఊరేగింపుతోటే నీళ్ళు కారిపోతే చెప్పలేము కానీ ఇది దీర్ఘకాలిక పోరాటం... ఈ ఊరేగింపుతో మన కోర్కెలు సిద్ధించి నిరుద్యోగులందరికీ ఉద్యోగాలు వస్తాయనీ, అలా అని ప్రభుత్వం గ్యారంటీ యిస్తుందని భ్రమపడవద్దు ఎవరూ... మామూలు వాగ్దానాలు... 'చూస్తాం..వేచి వుండండి...' వంటి మాటలు తప్ప ఇప్పట్లో ఏమీ జరగదు... అసలేమీ జరగకపోవచ్చుకూడా...కాని మనం ఇలాటివాటికి కొత్త...అనుభవములేదు... కాబట్టి ముందు యిలా నెమ్మదిగా వినయంగా అర్థించడమే ఉచితమైన పద్ధతి..." అన్నాడు గాంధీ.

ఈ వివరణతో మిగిలిన వారిలో సంతృప్తి కనిపించింది. కాని ఆలోచన మాత్రం తప్పలేదు. అందరూ చాలాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయారు.

అంతలో లోపలినుంచి నెల్సన్ తమ్ముడు టీలు తెచ్చి అందరికీ అందించాడు. మరో అరగంటలో అందరి మనసులలోనూ ప్రశాంతత నెలకొన్నది.

నెల్సన్ టీ ముగించి "ఫ్రండ్స్...ఇక పోదాం... మేము దీన్ని టైపు చేయించి ఉంచుతాము. ఓకే?" అన్నాడు.

"ఓకే" అన్నారందరూ. బిలబిల లాడుతూ ఇవతలికి వచ్చారు.

గాంధీ అన్యమనస్కంగా నడుస్తున్నాడు. శ్యామసుందర్ అతని పక్కగా వచ్చి కళ్ళజోడు పైకి సర్దుకుని "మీరన్నది యదార్థం...వీళ్ళకు కొత్త కాబట్టి ఏదో అనుకుంటున్నారు కాని, ఈ ప్రదర్శన, ఊరేగింపు, మహజరు యివ్వడం. గాలిలో వాగ్దానాలు... ఇవన్నీ శుష్క దండగ..." అన్నాడు.

గాంధీ అతని కళ్ళలోకి చూస్తూ "మరి మనం ఇప్పుడు ఇంకేమి చెయ్యగలం?" అని అడిగాడు.

అతడు ఎటో చూస్తూ "ఏమీ చెయ్యలేము...అదీ నిజమే..." అన్నాడు నిరాశగా.

"...ఎందుకని? ఏమీ ఎందుకు చెయ్యలేము? చాలాచెయ్యగలం... పెద్ద ఎత్తున పోరాటం ప్రారంభించి ప్రజాశక్తిని సమీకరించి పీడితులను బాధితులను ఒక్క తాటిమీదికి చేర్చి అస్తవ్యస్తమైన అపభ్రంశపు పాతక భూయిష్టమైన ఈ వ్యవస్థను మార్చగలం...

కాని మనం పోరాడవలసింది ఎవరితో...? స్థిరంగా నెలకొనివున్న అధికార యంత్రాంగంతో... వ్రేళ్ళుతన్ని వ్యాపించిన కుళ్ళు యంత్రాంగంతో. అది పైకి అసమర్థంగా నీరసంగా కనిపిస్తుందే తప్ప వాస్తవం అదికాదు. ఎదురు తిరిగిన శక్తులను నిర్దయగా క్రూరంగా వేగంగా అణిచివేయడానికి అవసరమైన అంగబలం. అర్థబలం, యంత్రబలం,మంత్రబలం, ఆయుధబలం ఆ యంత్రానికి ఉన్నాయి. ఇప్పుడు మనకు వాటి నెదుర్కొనే శక్తి లేదు. మనకు తుపాకులులేవు. తూటాలులేవు. మనలో ఐక్యతలేదు. మనలో లెక్కలేనన్ని పొరలు... ఒకదానితో మరొకటి కలవదు... అతకదు... భావ సమైక్యతా, దీక్ష, విశ్వాసం. ఏవీలేవు మనకు. అసలు అన్యాయానికి ఎదురు తిరగవలసిన శక్తులకు ఒక రూపం ఏర్పడలేదు. అవి బలపడలేదు. వాటికొక రూపం రాకుండా బలపడకుండా ఇన్నేళ్ళనుంచీ పైవర్గంవారు జాగ్రత్తపడ్డారు. వారికి కావలసింది కుక్కలవలె

విశ్వాసంతో, తక్కువ వేతనాలకు వెట్టిచాకిరీచేసే మామూలు మనుషులు..చైతన్యం, వికాసం ఉన్న తెలివిగలవారు ఉండకూడదు. ఉన్నవారిలో సమైక్యత పెంపొందకూడదు వారు బలపడకూడదు. అలాటి జాగ్రత్తలు పైవారు తీసుకున్నారు.

ఇలాటి పరిస్థితుల్లో మనం నిరాశా నిస్పృహలకు లోనుకావడం జరుగుతున్నది... మహాఅయితే మన అసంతృప్తిని ఆవేదనను ఇలాటి ఊరేగింపులు నిర్వహించి గొప్పగా నిర్వహించామనీ ఏదో సాధించామనీ పిచ్చి ఆనందంతో వెర్రెత్తిపోదాం... అంతే..." అనుకున్నాడు గాంధీ.

◆ ◆ ◆ ◆ ◆ ◆

ఊరేగింపు ప్రారంభం అయ్యేముందు సెంటరుకు చేరుకున్నారు అందరూ. మొత్తం మప్ఫయి అయిదుమంది మాత్రం వచ్చారు. వచ్చిన ఆ కొద్దిమందీ ఏదో ఘనకార్యం చేయబోతున్న వారిలా హుషారుగా ఉన్నారు.

వారా సెంటరుకు చేరుకుని అట్టలు తలా ఒకటీ పుచ్చుకుని గుమికూడారు' నెల్సన్ వారిని ఉద్దేశించి ఏయే నినాదాలివ్వాలో చెప్పి చివరకు "మనం ప్రశాంతంగా ఉండాలి... అంతా శాంతియుతంగా జరిగిపోవాలి" అని రెండుమూడు పర్యాయాలు హెచ్చరించాడు.

అప్పటికి ఆ సెంటరుకు పోలీసు బలగం కూడా చేరుకుంది. రెండు వ్యాన్లనిండా సాయుధులైన పోలీసులు అక్కడికి చేరుకున్నారు.

ఒక పోలీసు అధికారి వచ్చి నెల్సన్‌ను ఉద్దేశించి "రెడీయేనా?" అని అడిగాడు.

నెల్సన్ తల ఊపాడు.

ప్రదర్శకులందరూ రెండు వరసలుగా నిలబడ్డారు. చేతుల్లో అట్టలతో.

చుట్టూ జనం చోద్యం చూస్తున్నారు. కొందరు వీరిచుట్టూ చేరి అట్టలమీద వ్రాసివున్న నినాదాలు చదువుతున్నారు.

నెల్సన్ పెద్దగా 'బ్రదర్స్! ఇక చదవండి' అన్నాడు.

మరుక్షణంలో గొంతు పెంచి 'లాంగ్‌లివ్...ఎడుకేటెడ్ అనెంప్లాయ్డ్ యూనియన్' అని అరిచాడు.

'లాంగ్‌లివ్' అన్నారందరూ పెద్దగా.

ఆ మాటవిన్న గాంధీకి నవ్వు వచ్చింది. ప్రయత్నంమీద ఆపుకున్నాడు.

ఊరేగింపు కదిలింది. ముందొక పోలీసు వ్యాను... మధ్యలో ప్రదర్శకులు... వెనుక మరో పోలీసు వ్యాను... రెండు మోటారు సైకిళ్ళమీద పోలీసు అధికారులిద్దరు....

రెండు మైళ్ళు నడిచారు నగరం ముఖ్యవీధులగుండా... సెంటర్లో ప్రదర్శన సాగిపోయేవరకూ ట్రాఫిక్ ఆపుచేయబడింది.

ప్రదర్శకులు అట్టలు గాలిలోకి ఎగురవేస్తూ పట్టుకుని నినాదాలు చేసుకుంటూ నడిచారు. నినాదాల ఉధృతి కొంతదూరం వెళ్ళేసరికి కొంచెం తగ్గింది. కాని నెల్సన్, శ్యామసుందర్, వరప్రసాద్ మరికొందరు పెద్దగా అరుస్తూనే వున్నారు.

జనం వీధుల్లో షాపుల్లోనుంచి ఇవతలికి వచ్చి చూశారు.

'ఏమిటిది?'

'నిరుద్యోగుల ప్రదర్శన'

'ఎందుకు?'

'ఎందుకేమిటి? ఉద్యోగులకోసం'

'ఎవరిస్తారు ఉద్యోగాలు?'

'ఇంకెవరిస్తారు? ప్రభుత్వమే చూపించాలి...'

'ఆహా! అల్లాగా?'

'అంతా చదువుకున్న వాళ్ళలాగున్నారే'

ఊరేగింపు మంత్రిగారి బస ముందుకు వచ్చి ఆగింది. అందరూ ఆవరణలోకి ప్రవేశించారు. ముందుగా పోలీసు అధికారి లోపలికి వెళ్ళాడు.

లోపల మంత్రిగారికి ముందే ఎవరో చెప్పారీ సంగతి... ఆయన పోలీసు అధికారిమీదా, తనచుట్టూవున్న వారిమీదా మండిపడ్డాడు.

"ఎందుకిట్టా చిన్నచిన్న విషయాలు నాగొంతుమీదకు తెస్తారు?' అని ఎగిరిపడ్డాడు. ఆ తర్వాత చల్లని గోల్డుస్పాట్ అందుకుని తాగి చల్లబడి పది నిముషాల తర్వాత వరండాలోకి వచ్చాడు అందరికీ నమస్కరిస్తూ.

పోలీసు అధికారి ప్రదర్శకులను ఉద్దేశించి "కూర్చోండి... కూర్చోండి... అందరూ నిశ్శబ్దంగా కూర్చోండి... కేకలు వేయవద్దు..." అని చెప్పాడు.

అందరూ వరండా క్రింద పచ్చికమీద కూర్చున్నారు.

నెల్సన్, వరప్రసాద్ మరి యిద్దరుముగ్గురు వరండా మెట్లెక్కి వెళ్ళి మంత్రిగారికి నమస్కరించి మెమోరాండం సమర్పించారు.

మంత్రిగారు చిరునవ్వు నవ్వుతూ దాన్ని అందుకుని జేబులోనుంచి కళ్ళజోడు తీసి తగిలించుకుని అటూయిటూ తిప్పి చూశాడు. చూస్తూఉండగానే ఆయన గంభీరుడైనాడు. అక్కడక్కడ చదువుతూ మాటిమాటికీ తల పంకించాడు. తర్వాత దాన్ని తన సెక్రటరీ చేతికిచ్చి అందరూ వినేట్టుగా "జాగ్రత్తగా ఫైలుచెయ్యి..." అని చెప్పాడు.

ఆ తర్వాత గొంతు సవరించుకుని వరండా చివరకు వచ్చి అందరికీ మళ్ళీ నమస్కరించి యిలా ప్రసంగించాడు.

"మీరు చాలా శ్రమపడి యింత దూరం వచ్చారు. కృతజ్ఞుణ్ని. మీ బాధ మీ ఎగోనీ నేనర్థం చేసుకుంటున్నాను. మీ బాధలో పాలు పంచుకుంటున్నాను. ఇంతంత చదువులు చదివి ఉద్యోగం సద్యోగం లేకుండా ఉండటం ఎంత బాధో నాకు తెలుసు. అసలు ఇది మీ ప్రాబ్లెమ్ కాదు...ఇది నేషనల్ ప్రాబ్లెమ్. మనదేశానికీ, దేశాభివృద్ధికి ఇది మీ ప్రాబ్లెమ్ కాదు. ఇది నేషనల్ ప్రాబ్లెమ్. మనదేశానికీ, దేశాభివృదిధికి ఇది ఎంత నష్టమోకూడా మీ అందరికంటే నాకు ఎక్కువ తెలుసు. దేశం ముందుకు పోవాలంటే మీవంటివారి చదువు సద్వినియోగం కావాలి. మీ తెలివితేటలు యిలా వేస్ట కాకూడదు.మీలో ఐన్‌స్టీన్‌లూ, నల్లేకర్‌లూ, భోరానాలూ కావలసినవారుంటారు...కాని

కాస్త ఓపిక పట్టండి... ఇది అర్జంటుగా తేలే విషయముకాదు అవకాశాల మేరకు మేమూ పాటు పడుతూనే వున్నాము... పదేళ్ళలో నిరుద్యోగాల్ని నిర్మూలించేందుకు కంకణం కట్టుకున్నాం... నిరుద్యోగం ఒకటేకాదు.. పేదరికం... కట్నాలు... కులమత భేదాలు... అస్పృశ్యత... ఇవన్నీ సమస్యలే... ఒక్కొక్క దాన్ని పరిష్కరించుకుంటూ రావాలి... అప్పుడే రామరాజ్యం ఏర్పడుతుంది. మీరు వేరు మేము వేరు కాదు.

మీరే మేము...మేము మేమే మీరు...మీరెన్నుకుంటేనే మేము పరిపాలిస్తున్నాం... అంటే మీరే పరిపాలిస్తున్నారన్నమాట. మనదేశం గొప్ప అదే... ప్రజలే ఇక్కడ పరిపాలకులు. ప్రజలే సర్వాధికారులు. మీరు కాదన్ననాడు మేమిక్కడ ఉండం... మనదేశం ఆధ్యాత్మికంగా ఎంతో గొప్పది. శాంతి, సహనం ఇవి మన సంస్కృతి ముఖ్య లక్షణాలు. వాటితోనే మనకు మహాత్ముడు స్వాతంత్ర్యం సంపాయించి పెట్టాడు.

ఇక మీరిచ్చిన మెమొరాండం... చదివాను... మళ్ళీ జాగ్రత్తగా చదువుతాను. స్టడీ చేస్తాను. మీరు మీ కష్టాన్ని చెప్పుకున్నందుకు కృతజ్ఞుణ్ణి. ప్రజలు ఏ వర్గం వారయినా సరే తమతమ కష్టసుఖాలు చెప్పుకుంటేనే కదా మాకు తెలిసేది? మీరు మంచి పనిచేశారు. ఈ మహజరు మీ అభ్యర్థనకాదు, ఆదేశం. కొందరు ఈ మహజర్లను మేము పట్టించుకోమనీ అవతల నిర్లక్ష్యంగా పారేస్తామనీ అనుకుంటూ వుంటారు. దయచేసి మీరలా అనుకోవద్దు. వీటిని జాగ్రత్తగా పరిశీలించి చర్యలు తీసుకుంటాం. మహజర్లను జాగ్రత్త చేసేందుకు ఈ మధ్యనే పాతిక లక్షల రూపాయల ఖర్చుతో ఒక... గోడవున్ నిర్మించాం... అక్కడ ఇవి భద్రంగా ఉంటాయి. ఆందోళన పడవద్దు. సెలవు..."

ఆయన మళ్ళీ అందరికీ నమస్కరించి కృతజ్ఞత తెలియజేసి లోపలికి వెళ్ళిపోయాడు. ఆయన వెనకనే ఆయన మనుషులూ అధికారులూ కూడా లోపలికి వెళ్ళారు.

ఆయన లోపలికి వెళ్ళి కండువాతీసి కుర్చీమీద విసిరిపారేసి మళ్ళీ చుట్టూవున్న వారిమీద మండిపడి ఎవరో యిచ్చిన చల్లని గోల్డ్‌స్పాట్ అందుకుని కొద్దినిమిషాల తర్వాత శాంతించాడు.

ప్రదర్శకులు చేతిలో అట్టలతో తిరుగుముఖం పట్టారు. నెల్సన్ పోలీసు అధికారికి థ్యాంక్స్ చెప్పి వచ్చాడు. ఆయన నవ్వుతూ నేనే మీకు థ్యాంక్స్ చెప్పాలి. మీ చదువుకు తగ్గట్టు అంతా ప్రశాంతంగా నిర్వహించారు." అన్నాడు.

అందరూ గుంపులు గుంపులుగా విడివిడిగా రోడ్డుమీదకివచ్చి ఎవరిదోవన వారు వెళ్ళిపోయారు. విజయవంతంగా ప్రదర్శన ముగిసినందుకు అందరూ ఆనందించారు.

శ్యామసుందర్ గాంధీ పక్కన నడుస్తూ. 'ప్చ్'! లాభంలేదు. ఇదేమీ లాభం లేదు... ఇంకేదీకూడా లాభం లేదు..." అన్నాడు నిర్వేదంతో.

గాంధీ అతనివంక చూశాడు. ఏమీ మాట్లాడలేదు.

సత్యమూర్తి వచ్చి గాంధీతో. "నేను బస్సుమీద పోతానండీ...హోటల్ డ్యూటీ టైం అయింది." అని చెప్పి వెళ్ళిపోయాడు.

గాంధీ. శ్యామ్‌సుందర్ భుజంమీద చేయివేసి నడిచాడు.

♦♦♦ ♦♦♦

నెలరోజుల తర్వాత....

గాంధీ, శ్యామసుందర్, నెల్సన్ ముగ్గురూ బస్సులో ప్రయాణం చేస్తున్నారు. నూట యాభై మైళ్ళ ప్రయాణం.

అక్కడ ఒక జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో ముగ్గురూ ఇంటర్వ్యూకు హాజరు కావాలి. గవర్నమెంట్ ఉద్యోగాలు...

మొత్తం ఉన్న ఖాళీలు నలభై ఒకటి.

ముగ్గురికీ మనస్సులో ఆశగానే వుంది.

అంత దూరపు ప్రయాణం కబుర్లతో హాయిగా గడిచిపోయింది.

అక్కడికి చేరుకునే సరికి చీకటి పడింది. బస్‌స్టాండ్‌లో విచారిస్తే దగ్గరలోనే ఒక ధర్మసత్రం ఉన్నదని తెలిసింది. ముగ్గురూ అక్కడికి వెళ్ళారు.

సత్రం గుమాస్తా బల్లమీదికి వంగి నిద్రపోతున్నాడు. కరెంటు లేదేమో పక్కనే ఒక హరికెన్ లాంతరు వెలుగుతున్నది.

"ఏమండీ..." అని పెద్దగా కేక పెడితే ఉలిక్కిపడి లేచి "గదులు ఖాళీ లేవు" అని ఆవులించి మళ్ళీ పడుకున్నాడు. ఇంతలో లేచే సూచనలు లేవు.

"ఇట్లా కాదు" అన్నాడు శ్యామసుందర్.

జేబులోనుంచి రెండు రూపాయల కాగితం ఒకటి ఇవతలికి తీసి గుమాస్తా చెవి దగ్గర పెట్టి వ్రేలితో కొట్టి శబ్దం చేశాడు.

ఆ ధ్వనికి అతడు లేచాడు. ఆవులించి చిటికె వేసి రెండు రూపాయల కాగితం వంకనే చూస్తూ "ఏం కావాలి?" అని అడిగాడు.

"గది... ఒక్కటి చాలు... ఈ రాత్రికి... రేపు సాయంకాలంవరకూ... అంతే. ముగ్గురం ఒక్క గదిలో సర్దుకుంటాము..." అన్నాడు శ్యామసుందర్.

"కుదరదు... ఖాళీలేదు."

శ్యామసుందర్ మరో రెండు రూపాయల కాగితం తీశాడు. రెంటినీ కలిపి రెపరెపలాడించి "మీ ఇష్టంమరి...మీరు కాదంటే ఏదన్నా లాడ్జికిపోయి ఉంటాం" అన్నాడు.

"సరే" అని చేయి చాపాడు గుమాస్తా.

రెండు నోట్లూ అందుకుని ఆవులిస్తూ లేచి "చాలా పొద్దుపోయినట్టుంది..." అంటూ దీపం చేతిలోకి తీసుకుని పైకి నడిచాడు.

చెక్కమెట్లు... అడుగుల బరువుకు కిర్రుకిర్రుమంటున్నాయి. పై అంతస్థులో చివరిగది తలుపులు తెరిచాడు. ఒక మోస్తరు గది. లోపల ఈతాకుల చాప-వుంది. కూజా గ్లాసు ఉన్నాయి కిటికీలో.

నీళ్ళు సాయంకాలం పట్టినవే" అని మాత్రం చెప్పి కిందికి వెళ్ళిపోయాడు గుమాస్తా.

ఎక్కడినుంచో వస్తున్న మసక వెలుతురులో ముగ్గురూ ఈతాకుల చాపమీద సర్దుకున్నారు.

శ్యామసుందర్ నవ్వి "అదండీ సంగతి... పేకుకు ధర్మసత్రం... అసలు తీరుయిది. డబ్బు కేంద్రం మన జీవితాలకు... ఇక ఏ విలువలూ లేవు, కాగితం రెపరెపలాడితే కొండ మీది కోతిఅయినా దిగివస్తుంది. లేకపోతే ఏమీలేదు..." అన్నాడు.

నెల్సన్ "అంతే... అంతే" అన్నాడు.

గాంధీ ఏమీ మాట్లాడకుండా గోడకానుకుని కూర్చున్నాడు.

నెల్సన్ లేచి కూజాలోనీళ్ళు గ్లాసులోకి వంచుకుని తాగి మళ్ళీ వచ్చి కూర్చుని "అన్నట్టు మనం మెమొరాండం యిచ్చాముకదా; మంత్రిగారు దానిమీద చర్య తీసుకుంటానన్నారు... ఎప్పుడో..." అన్నాడు.

శ్యామసుందర్ "మీకింకా ఆ పిచ్చి వదల్లేదా మహానుభావా? ఇక ఆమాట వదులుకోండి...ఏమీ జరగదు..." అన్నాడు ఖండితంగా.

నెల్సన్ బాధాగా "అదేమిటి? అలా అనకండి. ఏదో చేస్తాడు..." అన్నాడు. శ్యామసుందర్ మళ్ళీ పెద్దగా నవ్వాడు.

గాంధీ ఉన్నట్టుండి "ఆయనే చెప్పాడుగా ఆ రోజున...అర్థం చేసుకోలేకపోతే అది మన తప్పు..." అన్నాడు.

"ఏమని చెప్పాడు?" అని అడిగాడు నెల్సన్ ఆశ్చర్యంగా.

"ప్రజలిచ్చే మహజర్లన్నిటినీ భద్రపరిచేటందుకు పాతిక లక్షల రూపాయల ఖర్చుతో గోడవున్ నిర్మించామని చెప్పాడుగా; అవి అన్నీ అక్కడే పది కాలాల పాటు భద్రంగా ఉంటాయి. చెక్కుచెదరకుండా, భావి కాలపు చరిత్ర పరిశోధకులకు ఉపయోగపడతాయి బహుశా..."

శ్యామసుందర్‌కు నవ్వలేక కళ్ళ నీళ్ళ పర్యంతం అయింది...

గాంధీకి కాస్సేపటిలో నిద్రపట్టింది.

శ్యామసుందర్ కూడా తలక్రింద చెయివుంచుకుని నిద్రలోకి జారిపోయాడు. నెల్సన్ మాత్రం వంటరిగా చీకటిలో మేలుకుని కూర్చున్నాడు చాలాసేపు.

♦ ♦ ♦ ♦ ♦ ♦

మరునాడు ఉదయం పదిగంటలవేళ...

ఆకాశంలో పలుచని మబ్బులు...

పెద్ద బంగళా...

బంగళాముందు పెద్ద ఆవరణ...

ఆవరణలో చేరిన ఉద్యోగార్థులను చూడగానే గాంధీకి మిగిలిన యిద్దరికి మతిపోతుంది. అంతటా అభ్యర్థులే. వరండాలో అన్నివైపులా, ఆవరణలో చెట్లక్రింద, గోడల పక్కన, ఎదురుగా హోటళ్ళలో...అంతటా మానవ సముద్రంలాగున్నది.

మొత్తం నాలుగువేల మందికి పైగా వచ్చారు.

ఉన్న ఖాళీలు నలభై ఒకటి...

అంతలో మరొక చిత్రం జరిగింది. అంతకుముందు కొన్ని నెలలుగా ఆ ఖాళీలలో తాత్కాలికంగా పని చేసిన వారున్నారు. వారు జనంలో జొరబడి చాలా విషయాలు ప్రచారం చేశారు. "ఈ ఇంటర్వ్యూలు చాలా అన్యాయమనీ తాము అంతకుముందు ఆ వేకెన్సీలలో పనిచేసి ఉన్నారు. కనుక తమను ఖాయం చేయడం న్యాయమనీ" వగైరా వివరాలు వ్యాపింపజేశారు. అవి అభ్యర్థులలో కార్చిచ్చులాగా వ్యాపించాయి. గుంపులు గుంపులుగా చేరి అందరూ దీన్ని గురించే మాట్లాడుకోవడం ప్రారంభించారు. దూర ప్రదేశాలనుంచీ వచ్చిన వారిలో అసహనం పెరగడం మొదలయింది.

పై అంతస్థులో ఎక్కడో ఇంటర్వ్యూల ప్రహసనం ప్రారంభం కాబోయే ముందే క్రింద ఆవరణలో వరండాలలో ఉద్రేకాలు హెచ్చాయి. కొందరు ఆఫీసు లోపలికి వెళ్ళి వారితో మాట్లాడి పై వివరాలు నిజమే అని నిర్ధారణ చేసుకువచ్చారు.

"ఇదంతా ఘోరం..."

"అన్యాయం...అక్రమం..."

కేకలు...అరుపులు...కొనసాగాయి.

"దీనికి కారకులెవరు?"

"ఇంకెవరు? ఆఫీసులో పైన కూర్చున్న పెద్దలే అయివుంటారు..."

ఉన్నట్టుండి ఒక రాయి రివ్వున విసురుగా వెళ్ళి రెండో అంతస్థులో గాజుకిటికీ 'భళ్ళు'న పగలగొట్టి లోపల పడింది. కిటికీ పక్కన సీటులో కూర్చునివున్న గుమస్తా పక్క లోబాంబు ప్రేలినట్టుగా అదిరిపడి "బాబోయ్" గావుకేక వేసి అవతలికి పరుగెత్తుకుపోయాడు వొణుకుతూ.

అంతా గుంపుగా ఆఫీసు గుమ్మంముందు చేరారు. వేలాది అభ్యర్థులు...ఎంతో వ్యయప్రయాసల కోర్చి అమాయకంగా ఉద్యోగం వస్తుందనే ఆశతో తలలు తాకట్టు పెట్టి విపరీతమైన వడ్డీలకు అప్పుచేసి నానాబాధలుపడి గుండెలనిండా ఆశలతో వచ్చిన అభ్యర్థులు... గ్రాడ్యుయేట్లు... పోస్టు గ్రాడ్యుయేట్లు...

అందరూ రక్తం సలసల కాగిపోతుంటే ఉద్రేకంతో ఊగిపోతూ ఘనీభవించిన ప్రజాశక్తిలా గుంపుగా చేరారు. ఆఫీసులో వారు బైటికి రావడానికి వీలులేదు. బయటి వారు ఆఫీసులోకి వెళ్ళేందుకు వీలులేదు.

మళ్ళీ అంతలో రాళ్ళు పడ్డాయి. ఈసారి విడివిడిగా కాదు. రాళ్ళవర్షం కురిసింది. కొత్తగా బిల్డింగ్ కట్టేందుకు ఆవరణలో తోలించిన కొండరాయి గుట్ట తరిగి పోయింది. అన్ని అంతస్తులలో గాజు కిటికీలు 'భళ్ళు భళ్ళు' న పగిలి పోయాయి.

అంతలో ఎవరో 'పదండి పైకి' అన్నారు.

అంతే. అంత సమూహమూ మెట్లెక్కి పైకిచేరుకున్నది. దారిలో ఎదురైన ప్రతి వస్తువూ ధ్వంసమై పోయింది. కుర్చీలు, బల్లలు, ఫ్యానులు, టైపు మెషీన్లు అన్నీ ధ్వంసమైనాయి. అక్కడ పనిచేసే ఉద్యోగులు పెద్దా చిన్నా అనే భేదం లేకుండా అందరూ ప్రాణ భయంతో పరుగెత్తుకుపోయి మూల మూలలా దాక్కున్నారు.

ఫైళ్ళన్నీ గుట్టలుగా పడ్డాయి.

మంటలు రేగాయి.

శ్యామసుందర్ వరండాలో ఒక పక్కగా నిలబడివున్న గాంధీ, నెల్సన్‌ల దగ్గరికి హడావిడిగా ఆయాసంతో వగర్చుతూ పరుగెత్తుకు వచ్చాడు.

'అంతా ధ్వంసం బీభత్సం అలాగే జరగాలి, లేకపోతే అన్యాయానికి అంతులేకుండా పోతున్నది'

బైట నిలబడివున్న మరికొందరి దృష్టి ఆవరణలో ఎదురుగా నిలబడివున్న ఆఫీసు జీపు మీద పడింది. హోలోమంటూ అందరూ దానిమీద పడ్డారు. నిముషాల వ్యవధిలో జీపు భస్మీపటలమై పోయింది. పక్కనే వున్న స్కూటర్లు, సైకిళ్ళూ అన్నీ ధ్వంసమై పోయాయి.

అప్పుడు దిగింది పోలీసు బలగం. బూట్లు టకటక లాడించుకుంటూ లాటీలు తిప్పుతూ పోలీసులు పైకి పైపైకి వెళ్ళి జనాన్ని అదిలించి క్రిందికి మళ్ళించారు.

పది నిముషాలలో భవంతి అంతా నిర్మానుష్యమై పోయింది.

పైన అంతా శిలామయం. ప్రతి వస్తువూ విధ్వంసమై పోయింది. వేలాది ఫైళ్ళు అవసరమైనవీ. అనవసరమైనవీ అన్నీ అగ్నికి ఆహుతై పోయాయి. ఎక్కడ చూసినా గాజుముక్కలు, కర్రలు అంతా భీభత్సంగా తయారైంది.

పోలీసు అధికారులు చాలా నిగ్రహంతో వ్యవహరించారు. ఎవరినీ ఏమీ అనలేదు. కొట్టలేదు. అందర్నీ మంచి మాటలతో క్రిందికి, ఆ తర్వాత ఆవరణ బైటికి పంపివేశారు.

అరగంటలో ఆవరణలో కూడా ఎవరూ మిగలలేదు. బావురుమంటూ ఖాళీ స్థలం. బిక్కుబిక్కుమంటూ పోలీసు రక్షణలో ఉద్యోగులూ మిగిలారు.

◆ ◆ ◆ ◆

సాయంకాలం అయిదు గంటలకు ప్రారంభమైన వర్షం యింకా తెరిపి యివ్వలేదు.

బస్సులో కిటికీ పక్కగా కూర్చుని వున్నాడు గాంధీ. బాగా పొద్దుపోయి నట్టున్నది. మిగిలిన ఇద్దరూ హాయిగా నిద్ర పోతున్నారు.

అతనికి మాత్రం నిద్ర రావడం లేదు. కిటికీ అద్దం మీద వర్షపు చినుకులు పడి అందులో రక రకాల విచిత్ర దృశ్యాలు కనిపిస్తున్నాయి.

అతని మెదడంతా చికాకుగా కీకారణ్యంలాగావుంది. డాక్టరు మాటలు గుర్తుకువచ్చాయి మాటి మాటికి.

'మనసును ప్రశాంతంగా ఉంచుకో. ఆలోచనలు పెట్టుకోకు'

'ప్రశాంతంగా ఉంచుకో, ఆలోచించకు'

'ఆలోచించకు'

'నిద్రపో'

అతడు కళ్ళు మూసుకున్నాడు. గాలినీ, వర్షాన్నీ చీల్చుకుంటూ వేగంగా వెడుతున్న బస్సు చేస్తున్న శబ్దం. అదొకరకమైన సంగీతంలా వినిపిస్తున్నది.

అంతలో అతనికి ఆ కళ్లు గుర్తు వచ్చాయి.

శ్రావణ మేఘ మాలికలు కమ్ముకున్న ఆకాశ ఖండాల వంటి ఆర్ద్రమైనకళ్లు తనలో జీవితాశను రగిలించి, తనను నడిపించగల కళ్ళు.

ఆమె నెప్పుడైనా జీవితంలో తాను కలుసుకోగలడా? ఆమెను మళ్ళీ చూడగలడా?

ఆమె పేరేమిటి? తానా రోజు హాస్పిటలుకు వెళ్ళినప్పుడు అది కూడా కనుక్కోలేదు.

కరుణ... సుగుణ... మీనా... వసుంధర... అహల్య... శబరి... గాంధీ కళ్ళు మూతపడ్డాయి.

మగతగా నిద్ర

అందులో కల,

అందమైన పూలతోట అగ్నికి ఆహుతి అవుతున్నది. మంటలురేగుతున్నా జ్వాల జిహ్వలు చాచి సమస్తాన్నీ కబళిస్తున్నాడు అగ్ని దేవుడు. విపరీత పొగలు... సెగలు... అతడు ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు. పక్కన నెల్సన్, శ్యామసుందర్ హాయిగా నిద్ర పోతున్నారు.

అతడు కళ్ళు నులుముకుని కూర్చున్నాడు.

ప్రయాణం సాగుతూనే వుంది!

(ప్రభవ - నవలా వాహిని - అక్టోబర్ 1978)

◆ ◆ ◆